ప్రపంచ సాహిత్యం-49

# అల్లంత దూరాన ఆ పాట వినవచ్చె...



డాక్టర్ లంకా శివరామప్రసాద్

ప్రపంచ సాహిత్యం - 49

# అల్లంత దూరాన ఆ పాట వినవచ్చె...

**ఎమిలి బ్రాంటి (Emily Bronte)**
**వాల్ట్ విట్‌మాన్ (Walt Whitman)**
**మాథ్యూ ఆర్నాల్డ్ (Matthew Arnold)**
**ఎడ్గార్ అల్లన్ పో (Edgar Allan Poe)**
**డాంటి గాబ్రియేల్ రోజెట్టి (Dante Gabriel Rossetti)**
**క్రిస్టినా రోజెట్టి (Christina Rossetti)**
**ఎమిలి డికెన్‌సన్ (Emily Dickinson)**
**ఛార్లెస్ యల్. డాడ్‌సన్ (Charles L. Dodgson-Lewis Carroll)**

డాక్టర్ లంకా శివరామప్రసాద్

# అల్లంత దూరాన ఆ పాట వినవచ్చె...

## (Master Poems in English)

Translated by

**Dr. Lanka Siva Rama Prasad**

✧✧✧——————————————✧✧✧

May 2018

All rights reserved

Copyright @ 2018
by **Dr. Lanka Siva Rama Prasad**
Head of the Department
Cardiothoracic & Vascular Surgery
**Prathima Institute of Medical Sciences**
Nagunur Road, Karimnagar - 505 417, Telangana.

Published by:

**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 8897849442
Email: lankasrprasad@gmail.com

Price : ₹ **200** **$ 4**

Cover Design & Post Script : **Prakash Pula**

Printed at :

**Vasavi Printers**
J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

***This book is presented to...***

<u>ఈ రచనకు ఆధార గ్రంథాలు</u>

**Master Poems of the English Language**
**Edited by Oscar Williams**

# ప్రస్తావన

ముగ్గురు కవయిత్రులు (ఎమిలి బ్రాంటి, క్రిస్టినా రోజెట్టి, ఎమిలి డికిన్సన్); అయిదుగురు కవులు (వాల్ట్ విట్మాన్, మాథ్యూ ఆర్నాల్డ్, ఎడ్గార్ అల్లన్పో, డాంటీ గాబ్రియేల్ రోజెట్టి, ఛార్లెస్ యల్ డాడ్సన్–లూయిస్ కారల్)ల పదిహేడు కవితల స్వేచ్ఛానువాదమీ కవితా సంకలనం.

తాను సృష్టించిన ఊహాలోకంలోనే తాను నివసిస్తూ Withering Heights లాంటి అద్భుత నవలను రచించిన Emily Bronte జ్ఞాపకం, అమెరికన్ కవులలో ముఖ్యుడు, అమెరికన్ ఎపిక్–ఇతిహాసంగా తన Leaves of Grass కవితా సంపుటిని తీర్చిదిద్దిన Walt Whitman కవితలు రెండు; Sage Writer గా మార్మిక కవిగా పేరొందిన Matthew Arnold కవితలు రెండు; Edgar Allan Poe కవిత ఒకటి; చిత్రకారుడు, కవి Dante Gabriel Rossetti చిత్రకవిత The Blessed Damozel; అతడి సోదరి Christina Rossetti వ్రాసిన The Convent Threshold; అద్భుతమైన కవయిత్రి Emily Dickinson రచించిన కవితలు ఎనిమిది (మృత్యువు అంతర్లీన అంశంగా); Alice's Adventures in Wonderland - వ్రాసి ప్రసిద్ధికెక్కిన Charles L. Dodgson (Lewis Carroll) వ్రాసిన Nonsense Poem - The Hunting of Snark ఈ కవితా సంకలనంలో చోటు చేసుకున్నాయి.

సృజనలోకం ప్రచురిస్తున్న Master Poems in English అనువాద కవితలను విశేషంగా ఆదరిస్తున్న తెలుగు సాహితీ ప్రియులకు ఈ పుస్తకం మరో కానుక. ఈ ప్రయత్నం మరింత ఆదరణ పొందుతుందని ఆశిస్తూ...

**– డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# విషయసూచిక


**I. ఎమిలి బ్రాంటి (Emily Bronte)**

1) జ్ఞాపకం ........ 7

**II. వాల్ట్ విట్‌మాన్ (Walt Whitman)**

2) ప్రెసిడెంట్ లింకన్ జ్ఞాపకాలు ........ 10

3) విద్యుత్ దేహగానం ........ 21

**III. మాథ్యూ ఆర్నాల్డ్ (Matthew Arnold)**

4) డోవర్ బీచ్ ........ 33

5) సంచార మేధావి ........ 35

**IV. ఎడ్గార్ అల్లన్ పో (Edgar Allan Poe)**

6) నల్లకాకి ........ 46

**V. డాంటీ గాబ్రియేల్ రొజెట్టి (Dante Rossetti)**

7) ఆశీర్వదింపబడిన యువతి ........ 53

**VI. క్రిస్టినా రొజెట్టి (Christina Rossetti)**

8) కాన్వెంట్ గుమ్మం ........ 60

**VII. ఎమిలి డికెన్‌సన్ (Emily Dickinson)**

9) మృత్యువు ........ 67

**VII. ఛార్లెస్ యల్. డాడ్గసన్ (Charles L. Dodgson)**

10) స్నార్క్‌ను వేటాడడం



# ఎమిలి బ్రాంటి

## (Emily Bronte 1818-1848)

ఎమిలి జేన్ బ్రాంటి ఇంగ్లీషు నవలా రచయిత్రి, కవయిత్రి. ఆమె వ్రాసిన ఒకే ఒక నవల Wuthering Heights ఆంగ్ల సాహిత్యంలో Classic గా పేరు పొందినది. ఆమె కలం పేరు Ellis Bell. 30 జులై 1818న జన్మించిన ఆమె తండ్రి పేరు Patrick Bronte, తల్లి Maria Bronte.

Charlotte వ్రాసిన Jane Eyre; Emily వ్రాసిన Wuthering Heights, Anne వ్రాసిన The Tessant of Wildfell Hall ఆంగ్ల సాహిత్యంలో Master Pieces గా పరిగణించబడ్తున్నాయి. Bronte Sisters గా పేరొందిన ఈ ముగ్గురు సోదరీమణులు మతబోధకుడైన తండ్రి క్రమశిక్షణకు లోనై పగలంతా ఇంటిలో నిశ్శబ్దంగా ఉండాల్సి రావడంతో వాళ్ళు తమదైన లోకాల్ని, పాత్రలను, సన్నివేశాలను సృష్టించుకున్నారు. ఒక ఊహాలోకం Gondal ను, తమ కలం పేర్లు మగ రచయితలుగా కనిపించాలని Currer, Ellis, Acton Bell గా మార్చుకున్నారు.

వాళ్ల సోదరుడు Branwell, సోదరీమణులు Maria, Elizabeth లు క్షయవ్యాధితో మరణించినారు.

ఎవరితోనూ పెద్దగా మాట్లాడని తత్త్వం, ఎంత జబ్బు వచ్చినా వైద్యులిచ్చిన మందులు వాడక పోవడం, అక్కడి నీళ్లు కలుషితం కాగా వచ్చిన అనారోగ్యం, కుటుంబంలో ఉన్న క్షయవ్యాధి (Tuberculosis) ఆమెకూ సోకి ఉధృతం కాగా 19 డిసెంబర్ 1848 నాడు ఆమె కన్నుమూసింది.

# 1. జ్ఞాపకం

## (Remembrance)
## (R. Alcona to J. Brenzaida)

మంచు గుట్టగా నీపైన పేర్చబడిన మట్టి అడుగున నీవు
దూరంగా సుదూరంగా శీతల సమాధిలో వేరు చేయబడినావు.
నిన్ను ప్రేమించడం మరచిపోగలనా, నా ఏకైక ప్రేమవు నీవు.
అన్నిటికి అలసట తెచ్చే కాల తరంగంచే తెంపబడినావు.

ఇప్పుడు, ఒంటరిగా ఉన్నపుడు, నా ఆలోచనలు ఎగిరిపోవు
ఆ పర్వతాలపైన, అంగోరా తీరం వేపున,
వాటి రెక్కలకు విశ్రాంతినిస్తూన్నాయి, చిన్ని పొదలు, ఫెర్న్ ఆకులు
ఆ ఉన్నతమైన హృదయాన్ని శాశ్వతంగా కప్పిన చోటున!

మట్టి అడుగున శీతలంగా, పదిహేను విశృంఖల డిసెంబర్లు
గోధుమ వర్ణపు కొండల నుంచి, కలిసిపోయాయి వసంతంలో
అన్నేళ్ల తరువాత అయినా అన్నిటినీ గుర్తుంచుకునే ఆత్మలు
ఆ కష్టాల్నీ, మార్పునూ, అవి విశ్వాసం గలవే యదార్థంగా!

యవ్వనపు మధుర ప్రేమా! నిన్ను మరచిపోతే క్షమించు నన్ను
ప్రపంచపు అల నన్ను తనతో కూడా భరిస్తూ కదులుతున్నది.
దృఢమైన కోరికలు, అంధకారపు ఆశలు నన్ను కలవరపరుస్తున్నవి.
ఆశలు అస్పష్టంగా ఉన్నా, నీకు అన్యాయం చేయబోవు.

ఏ ఇతర సూర్యుడూ నా స్వర్గాన్ని వెలుగుతో నింపలేదు.
మరే ఇతర నక్షత్రము నా కోసం ప్రకాశించలేదు.
నా జీవితపు ఆనందమంతా నీ జీవితంలోనిదే.
నా జీవితపు పరమానందమూ నిశ్చల సమాధిలో నీతోనే!

ఎప్పుడైతే బంగరు కలలుగన్న రోజులు గతించాయో
నిరాశ కూడా నీరసపడి విధ్వంసాన్ని విడనాడుతుందో
అప్పుడు నేను నేర్చుకున్నాను బతుకునెలా ఆనందించాలో
సంతోషపు సాయం లేకుండానే ఎలా బతికి బలపడాలో!

అప్పుడు నేను వృధా ఉద్వేగాల కన్నీళ్లకు అడ్డుకట్ట వేసాను
నా యవ్వనపు ఆత్మను నీకై పరితపించడాన్ని తగ్గించాను.
నాదానికన్నా అధికమైన సమాధిలోకి త్వరగా వెళ్లాలనే
దాని జ్వలిస్తున్న కోర్కెను దృఢంగా తిరస్కరించాను.

అయినా దానిని, నేనలా క్షీణించిపోనివ్వను.
జ్ఞాపకాల పారవశ్యపు బాధలో తలమునకలు కానివ్వను!
ఆ దివ్యమైన పరితాపాన్ని గాఢంగా సేవించిన వెనుక
ఈ శూన్యపు ప్రపంచాన్ని మరల నేనెలా కోరుకోగలను?

---

బ్రాంటి సోదరీమణులు (Bronte Sisters) సృష్టించుకున్న ఊహా ప్రపంచం Gondal లో Emily గొండాల్ రాణి. ఊపిరాడని క్రమశిక్షణతో మతబోధకుడైన తండ్రి పెంపకంలో– Clergy daughters - వాళ్లు తమ లోకాన్ని తమ ఊహల్తో అల్లుకున్నారు, తండ్రి నిర్మించిన వాస్తవ శృంఖలాబద్ధ జీవితాన్నుంచి పారిపోవడానికి.

Wuthering Heights రాస్తున్న సమయంలోనే వ్రాయబడిన ఈ కవిత ఆమె సోదరుడు Branwell వ్యాధిగ్రస్థుడై ఉన్నపుడు వ్రాసినదని అంటారు.



# వాల్ట్ విట్‌మాన్
## (Walt Whitman)

Walter 'Walt' Whitman (31-5-1819 to 26-3-1892) అమెరికన్ కవి, వ్యాస రచయిత, జర్నలిస్టు. Transcendentalism (అతీంద్రియ వాదము)కు Realism (వాస్తవవాదానికి) మధ్యకాలపువాడు. మానవతావాది. అమెరికన్ కవులలో Father of Free Verse అని పేరు పొందినాడు.

అతడి ప్రసిద్ధ రచన Leaves of Grass కవితా సంకలనం వివాదాలకు గురైనది. జర్నలిస్టు ఉపాధ్యాయుడు, క్లర్క్, నర్సు ఇలా వివిధ ఉద్యోగాలు చేస్తూనే స్వంత ఖర్చుతో 1855లో Leaves of Grass ప్రచురించినాడు. అమెరికన్ ఇతిహాసంగా దానిని తీర్చిదిద్దుతూ సాధారణ వ్యక్తికి కూడా దాని గురించి తెలిసేలా శ్రమపడుతూ తాను చనిపోయేవరకూ దానిని విస్తృతం చేస్తూ, సరిదిద్దుతూ ఉన్నాడు. తన 72వ ఏట ఆరోగ్యం క్షీణించి న్యూజెర్సీలో చనిపోయినపుడు అతడికి అమెరికన్ ప్రజలు ఘనంగా నివాళులర్పించారు.

Sexuality పై అతడి అభిప్రాయాలు, ప్రవర్తన (Homosexuality / Bisexuality) బానిసత్వాన్ని వ్యతిరేకించడం, సమానత్వ ప్రతిపాదనలు ఇవన్నీ ఆరోజుల్లో వివాదాస్పద అంశాలైనాయి.

Franklin Evans (నవల-1842), Leaves of Grass (1855-1891), Drum-Taps (1865), Democratic Vistas (1871); Memoranda during the War (1876), Specimen Days (1882) అతడి ముఖ్య రచనలు.

# 2. ప్రెసిడెంట్ లింకన్ జ్ఞాపకాలు

## (Memories of President Lincoln)
## (When Lilacs Last in the Dooryard Bloomed)

### 1

ఎప్పుడైతే ఇంటి ముందు పెరడులో ఆఖరి లిలాక్‌పూలు వికసించాయో
రాత్రివేళ పశ్చిమాకాశాన ఆ గొప్ప నక్షత్రం వేకువనే తొలిగిందో
నేను దుఃఖిస్తున్నాను, ఎల్లప్పుడూ తిరిగి వచ్చే వసంతంతో కలిసి దుఃఖిస్తాను.
మరల తిరిగివచ్చే వసంతమా, నాకోసం త్రిమూర్తిత్వాన్ని తీసుకువస్తావులే!
సతత వికాస లిలాక్ పూలను, పశ్చిమాకాశాన ఆ తారను
నేను ప్రేమించే అతడి ఆలోచననూ!

### 2

పశ్చిమాన రాలిన ఓ శక్తివంతమైన తారా!
రాత్రి చీకటులారా, ఉద్వేగపు కన్నీటి రాత్రులారా!
ఆ గొప్ప నక్షత్రం అదృశ్యమైనది. దానిని కప్పి ఉంచిన నల్ల మకిలి, చీకటీ?
నన్ను శక్తిహీనుడిని చేసిన క్రూర హస్తాల్లారా, అసహాయమైన నా ఆత్మా!
నా ఆత్మకు స్వేచ్ఛ నివ్వని దట్టమైన కారుమేఘమా!

### 3

ఆ పాత పొలమింటి గుమ్మం ముందు, సున్నం వేసిన కర్రల కంచె దగ్గర,
నిలబడి ఉన్నది లిలాక్ పూల పొద ప్రశస్తమైన ఆకుపచ్చ హృదయాకారపు ఆకులతో,
అసంఖ్యాక పూలగుత్తులతో, నేను ప్రేమించే పరిమళాలతో
ప్రతి పత్రమూ ఒక అద్భుతం, ఈ పెరటి మొక్కలో
సుకుమార వర్ణ పుష్ప సంచయం, ప్రశస్తమైన ఆకుపచ్చ హృదయాకారపు పత్ర వికసితం.
పూవుతో ఉన్న చిగురు కొమ్మను నేను తెంపాను.

## 4

వేరు చేయబడిన ఒంటరి చిత్తడి మడుగులో
సిగ్గుల మొగ్గలా దాగున్న పక్షి ఒకటి పాడుతున్నది
ఒంటరి థ్రష్ పక్షి
అంతర్ముఖుడైన ముని, వివాదరహితుడై,
తనకోసం తాను పాడుకున్న పాట
రక్తం స్రవిస్తున్న గొంతు పాడే పాట
జీవితపు పాటకు మృత్యుద్వారం (సోదరుడా,
నాకు తెలుసు, ఈ పాట పాడకపోతే నీవు మరణిస్తావని)

## 5

వసంతకాలపు రొమ్ముపై పట్టణాల మధ్య భూమి
పాత అడవుల మధ్యదారులు, ఈ మధ్యనే అక్కడ
తొంగిచూస్తున్న వయొలెట్లు, కాస్త నల్లని చెత్త దగ్గర,
పొలాల్లోని దారుల కిరువైపులా ఉన్న పచ్చిక మధ్య
అంతూ దరీ లేని ఆ పచ్చిక
పసుపు ఈటెల్లాంటి గోధుమల్ని దాటి, ప్రతి గింజ
తన ముసుగు నుంచి నల్లని గోధుమ పొలాల్లో తలపైకెత్తగా,
తెలుపు ఎరుపు (గులాబి) వర్ణపు ఆపిల్ తోటల్ని దాటి
ఓ పార్థివ దేహాన్ని మోసుకువెళ్తూ, అక్కడ
అది విశ్రాంతి తీసుకుంటుంది సమాధిలో
రాత్రింబవళ్లూ ప్రయాణం చేస్తుందో శవపేటిక!

## 6

శవపేటిక పోతున్నది వీధులలో సందుగొందులలో
పోతుండగా పగలూ రేయిని, గొప్ప మబ్బు కమ్మి
దేశాన్ని చీకటితో ముంచెత్తుతున్నది
అవనతం చేయబడిన పతాకలు, చీకటిలో
మునిగిన పట్టణాలు
రాష్ట్రాలు, మేలిముసుగులు కప్పుకునినిలబడి ఉన్న స్త్రీలలా

దీర్ఘమైన ఊరేగింపులు, రాత్రికి సహజసిద్ధమైన ఆడంబరాలతో
అసంఖ్యాకమైన కాగడాలు వెలుగు, నిశ్శబ్ద వదనాల
సముద్ర వస్త్రాచ్ఛాదిత శిరస్సులు
వేచి ఉన్న చోట, శవపేటిక ఆగమనానికై, గంభీర వదనాలు.
రాత్రిని నింపిన దుఃఖగీతాలు, రోదనలు, వేలాది గొంతులు
సంఘీభావ, బలమైన పవిత్ర వాక్యాలు
దుఃఖిత స్వరాలు, శవపేటిక చుట్టూరా విషాద గీతాలు
మసక వెలుగులో చర్చిలు, కంపిస్తున్న బాకాలు, వాయిద్యాలు
వీటి మధ్య నీవు ప్రయాణం చేస్తున్నావు,
అంతిమ ఘడియలు అనంతంగా మోగుతుండగా
With the tolling bells perpetual clong
అదుగో, నెమ్మదిగా పోతున్నది శవపేటిక.
నేను నీకు లిలాక్ పూవును ఇస్తున్నాను.

**7**

(నీకు ఒక్కడికే కాదు,
లేత ఆకుపచ్చ శాఖలు, పూలు తెస్తున్నాను అన్ని శవపేటికలకూ
ఉదయంలా తాజాగా, నీకోసం ఓ పాట పాడుతాను,
ఓ పవిత్రమైన స్పృహగల మృత్యువా?
గులాబీ పుష్పగుచ్ఛాలపై
ఓ మృత్యువా, నిన్ను గులాబీలతో, లిల్లీ మొగ్గలతో కప్పుతాను
అయితే ముందుగా తొలిగా వికసించిన ఈ లిలాక్ పూలతో!
అనేకం తెంపుతాను, పొదల నుండి శాఖలను అనేకంగా తెంపి
శాఖలు, పూలు నా చేతులు నిండగా, నీపై వెదజల్లుతాను
నీకు, అన్ని శవపేటికలకూ, ఓ మృత్యువా)

**8**

అంతరిక్షంలో పయనిస్తున్న పశ్చిమ గోళమా,
నీవే మనుకున్నావో నాకిప్పుడు తెలుసు, నేను నడిచి వచ్చి
ఓ నెల దాటింది.

నేను నడిచాను రాత్రి పారదర్శకపు నీడలలో,
నేను చూసాను నీవేదో చెప్పాలనుకోవడం, రాత్రి తరువాత
రాత్రిలోకి వంగి చెప్పబోవడం.
అలా నీవు నింగి నుంచి వంగి వస్తావు దిగువగా ఉన్న
నా పక్కకు (మిగతా నక్షత్రాలు అలా చూస్తూ ఉండగా,
మనిద్దరం అలా ఆ శుభరాత్రిలో సంచరిస్తూ
(దేనికోసమో నేను ఆ రాత్రి నిదురపోలేదు)
రాత్రి ముందుకు వస్తుండగా, పశ్చిమ అంచున ఉన్న నీవు
దుఃఖపు బాధతో నిండి ఉండడం గమనించాను.
నేనా ఎత్తైన నేలపై వాయువీచికల మధ్య, చల్లని
పారదర్శక రాత్రిలో నిలబడి ఉండగా,
నేను గమనించాను నీవు వెళ్లిన వేపు, నన్ను నేను
పోగొట్టుకున్నాను రాత్రి చీకటిలో
తృప్తిపడని సమస్యలో నా ఆత్మ మునిగిపోగా,
అక్కడ నీ విచారమైన కక్ష్య చీకటిలో ముగిసి వెళ్లిపోతుంది.

## 9

ఆ చిత్తడి మడుగులో ఉండి గానం చేయి
ఓ సుకుమారమైన, ఉత్సాహం గల గాయకుడా, నేను
నీ నాదాన్ని విన్నాను, నీ పిలుపును విన్నాను.
నేను విన్నాను, వచ్చాను, నిన్ను అర్థం చేసుకున్నాను.
అయితే, ఒక్కక్షణం తారట్లాడాను, ఆ అద్భుతమైన
నక్షత్రం నన్ను నిలువరించింది.
నన్ను వీడిపోతున్న సహచరుడు పట్టుకున్న తార నిలువరించింది నన్ను!

## 10

ఓహ్! నేను ప్రేమించినవారు మరణించగా నేనేమని మాట్లాడను?
ఆ మధురమూర్తి ఆత్మకై ఏ పాటను అలంకరించి గానం చేయను?
నేను ప్రేమించే అతడి సమాధిలో ఏ సువాసనాద్రవ్యాన్ని వెదజల్లను?
సముద్రపు గాలులు తూర్పు నుంచి పడమరకు వీస్తున్నాయి.

తూర్పు, పడమర సముద్రాల నుంచి వీస్తూ, ప్రెయరీ బయళ్లపై కలుసుకుంటున్నవి
ఇవి, వీటితో, నా ప్రార్థనతో
నేను ప్రేమించే అతడి సమాధిని పరిమళ భరితం గావిస్తాను.

## 11

ఓహ్, ఆ గది గోడలపై వేటిని వేలాడదీయను?
ఆ గోడలపై వేలాడదీసే చిత్తరువు ఏమిటి?
నేను ప్రేమించిన అతడి సమాధి గృహాన్ని అలంకరించేది దేనితో?
వృద్ధి చెందే వసంతకాలాన్ని, వ్యవసాయక్షేత్రాల్ని, గృహాలను,
సూర్యాస్తమయాన నాలుగవ నెల ప్రారంభాన్ని, మసక నలుపు పొగ
వైవిధ్యంగా, ప్రకాశవంతంగా ఉన్న దానిని.
స్వర్ణవర్ణంతో అద్భుతంగా, రాజసంగా, కళ్లు చెదిరే కాంతితో అస్తమిస్తున్న
సూర్యుని జ్వాలలను, జ్వలిస్తూ విస్తరిస్తున్న గాలులను
పాదాల కింద మధురమైన తాజా పచ్చిక, పొదలను, విస్తారంగా ఉన్న
వృక్షాల లేత ఆకుపచ్చ ఆకులను, చిగుళ్లను
దూరంగా, ప్రవహిస్తున్న మెరుపులా, నదీ ప్రవాహపు రొమ్ము,
అక్కడక్కడా గాలి పొరలతో
నదీ తటాలకు దగ్గర చిన్నిచిన్ని కొండలు, గుట్టలు, ఆకాశానికి
అభిముఖంగా రేఖగా, నీడలుగా,
పక్కనే పట్టణం గృహాలతో దట్టమై, పొగగొట్టాల వరుసలు
అన్ని రకాల జీవిత దృశ్యాలు, కర్మాగారాలు, శ్రామికులు ఇంటికి
తిరిగి వస్తున్న దృశ్యాలు.

## 12

అహో, దేహం, ఆత్మ – ఈ దేశం
నా స్వంత మనహట్టన్ శంకువులు, తళతళ మెరిసే
త్వరత్వరగా ప్రవహించే తరంగాలు, నౌకలు
వైవిధ్యమై విస్తరించిన భూమి, ఉత్తర దక్షిణ దిశల కాంతి
ఓహియో తీరాలు, మెరిసే మిస్సోరి
సుదూర తీరాలకు వ్యాపించిన ప్రయరీ మైదానాలు
పచ్చికతో, మొక్కజొన్న మొక్కలతో నిండిన పొలాలు

అహో, అత్యద్భుత ప్రకాశభానుడు ప్రశాంతంగా, దుందుడుకుగా
వయొలెట్, పర్పుల్ ఉదయాలు తొలి వాయువీచికల స్పర్శలు
మృదువై, సుకుమారమైన అగణిత కాంతి వెల్లువ
వ్యాపిస్తున్న అద్భుతం అందరిని స్నానాలు చేయించగా
మధ్యాహ్నం సంపూర్ణమై రాబోతున్నది మధురమై తోచగా
స్వాగతిస్తున్న రాత్రి, నక్షత్రాలు
నా పట్టణాలపై ప్రకాశిస్తూ, మనిషిని, నేలను కప్పుతూ!

## 13

గానం చేయి, గానం చేయి నలుపు గోధుమ రంగుల పిట్టా!
చిత్తడి నేలల్నుంచి, కొండా కోనల్నుంచి, చెట్ల పొదల్నుంచి
నీ గానాన్ని ప్రవహింపజేయి.
దేవదారు, శంకు వృక్షాల మసక చీకట్లనుంచి అనంతంగా,
గానం చేయి ప్రియసోదరుడా, నీ వేణుగానాన్ని వినిపించు
మనిషి పాటను మరింత బిగ్గరగా, అతి విషాదకర స్వరంతో
ద్రవరూపమై, సుకుమారంగా, స్వేచ్ఛగా
శృంఖలాలు లేక, షరతులు లేక నా ఆత్మలోకి ఓ అద్భుత గాయకుడా!
నిన్ను మాత్రమే నేను వినగలను– అయినా ఆ తార నన్ను
పట్టుకుని ఉన్నది (త్వరలో విడిచిపోతుంది)
అయితే ఈ లిలాక్ తన పరిమళాలతో నన్ను స్వాధీనపరచుకున్నది.

## 14

ఇప్పుడు నేను పగటి పూట కూర్చుని, ముందుకు చూసినప్పుడు
సాయంకాలపు కాంతిలో వసంతకాలపు పొలాలు, రైతులు
వారి పంటలకు సన్నాహాలు చేస్తున్నపుడు
విశాలమైన విస్మృతి దృశ్యాలు నా దేశంలోని అనేక సరస్సులు, అరణ్యాలు
దివ్యలోకపు నింగి అందాలు (కంగారు పెట్టే గాలులు, తుఫానుల తరువాత)
మధ్యాహ్నపు ఆకాశపు వంపుల కింద వేగంగా పోతున్న
పిల్లల, మహిళల మాటలు, స్వరాలు

చలిస్తున్న అసంఖ్యాక తరంగాలు, కదుల్తున్న ఓడలను నేను చూసాను.
వేసవి వస్తున్నది తన స్వర సంపదలతో, శ్రామికులతో
కళకళలాడ్తున్నవి పొలాలు తీరికలేని పనులతో
అసంఖ్యాక గృహాలు, సాగిపోతున్నవి, భోజనాలతో, దినచర్యలతో
వీధులు క్రిక్కిరిసి కంపిస్తున్నవి, నగరాలు అప్పుడే అక్కడే కట్టివేయబడినాయి.
వాటిమీద, వాటిలో పడి మిగతా వాటితో పాటు నన్నూ కమ్ముకున్నవి
అదుగో మేఘం, నల్లటి దీర్ఘ వరుస.
నాకు మృత్యువు గురించి తెలుసు, దాని ఆలోచన, మృత్యు రహస్యం జ్ఞానమూ
ఆ మృత్యు రహస్యజ్ఞానం నాకు ఒక పక్క నడుస్తున్నది.
మధ్యలో నేను, నా సహచరుల చేతులను పట్టుకుని నడుస్తున్నట్లు
నాతో మాట్లాడని రాత్రిలోకి నేను దాక్కోవడానికి పారిపోయాను,
నీటి తీరాల్లోకి చిత్తడి నేల గుండా ఆ మసక చీకటిలో,
ఆ గంభీరపు దేవదారు, దెయ్యపు శంకు చెట్ల నీడలలోకి,
ఆ గాయకుడు, ఇతరుల ఎడల బిడియపడేవాడు, నన్ను ఆహ్వానించినాడు.
ఆ నల్లటి గోధుమరంగు పక్షి, నాకు పరిచితమే, మా ముగ్గురినీ పలకరించినది.
ఆ పక్షి పాడిందప్పుడు మృత్యుగీతం, నేను ప్రేమించేవాడికై ఓ కవిత్వ చరణం.

లోతైన, ఒంటరి, గుహాంతరాళాల్లో నుంచీ,
నిశ్శబ్దంగా నిలబడిన సువాసనల దేవదారు, దెయ్యపు శంకువృక్షాల నుంచీ
ఆ పక్షి గానం వినబడసాగింది.

ఆ పాటలోని మంత్రముగ్ధ మాధుర్యం నన్ను పరవశుణ్ణి చేసింది.
ఆ రాత్రి నేను నా సహచరులను నా చేతుల్తో పట్టుకుని ఆపినప్పుడు
నా ఆత్మ స్వరం ఆ పక్షి గానంతో సమంగా పలికింది.

రా, ఓ అందమైన, సుకుమారమైన మృత్యువా!
ప్రపంచం చుట్టూరా మృదువుగా కదుల్తూ, ప్రశాంతంగా వస్తూ, వస్తుంది.
పగలు, రాత్రి, అందరికి, ప్రతి ఒక్కరికి
త్వరలోనో, ఆలస్యంగానో, సుకుమారమైన మృత్యువు.
ఈ అగణిత అనంత విశ్వము కీర్తించబడును గాక!

జీవనము, ఆనందములకై, వింతైన వస్తువులు, జ్ఞానానికై
ప్రేమకై, మధురమైన ప్రేమకై – కీర్తించు! కీర్తించు! కీర్తించు!
మృత్యుశీతల కౌగిలి జాపే ఖచ్చితమైన హస్తముల స్పర్శ కొరకు.

చీకటి తల్లి తన మెత్తటి పాదాలతో ప్రవహిస్తుంది ఎల్లప్పుడూ,
ఎవరూ పాడలేదా ఓ చక్కటి స్తోత్రాన్ని నిన్ను మనస్ఫూర్తిగా స్వాగతిస్తూ?
నేను స్తోత్రాన్ని పఠిస్తాను నీ కొరకు, నిన్నందరికన్నా గొప్పవాడిగా పొగుడుతాను.
నీ కొరకు ఓ పాటను, నీవు వచ్చీరాగానే, తడబడకుండా రాగానే.

శక్తివంతమైన బట్వాడాదారురాలివే నీవు.
అయినప్పుడు, నీవు వాటిని కొనిపోయినప్పుడు, నేను ఆనందంగా
పాడుతాను మృతుల కొరకు.
నీ ప్రేమభరిత సముద్రంలో తేలియాడుతూ నన్ను కోల్పోతాను
నీ ఆనందపు వరదలో మునిగిపోతాను ఓ మృత్యువా!

నా నుంచి నీకు ఈ ప్రేమగీతాలు
నిన్ను స్తుతిస్తూ, నమస్కరిస్తూ నృత్యాలు, అలంకారాలు, విందులు, నీకై
విశాల మైదాన దృశ్యాలు, అనంతాకాశపు నీలినీడలు
జీవంతో తొణికిసలాడే పొలాలు, గొప్ప ఆలోచనల రాత్రి
రాత్రి అసంఖ్యాక నక్షత్రాల కింద నిశ్శబ్దంలో
సముద్రతీరాన, నాకు తెలిసిన గుసగుసల తరంగ స్వరాలు
ఆత్మ నీవేపు తిరుగుతున్నది, ఓ విస్తృతమై, మేలి ముసుగులో ఉన్న మృత్యువా!
ఈ దేహం కృతజ్ఞతతో నీకు దగ్గరగా గూడు కట్టుకుంటున్నది.

తరూశాఖాగ్రాలపై నీ కోసం నేనో పాటను తేలియాడేట్లు చేస్తాను
పడిలేచే అలలపై, అసంఖ్యాక పొలాలపై, విశాల పచ్చిక మైదానాలపై
దట్టంగా నిండిన పట్టణాలపై, కిక్కిరిసిన రేవులు, వీధులపై
నేనీ పాటను ఆనందంతో, మృత్యువుపై ఆనందంతో
నేనీ పాటను తేలియాడేట్లు గానం చేస్తున్నాను.

## 15

నా ఆత్మకు సంబంధించిన లెక్కలను
ఆ నల్లటి గోధుమ వర్ణపు పిట్ట బిగ్గరగా బలంగా వినిపిస్తున్నది
స్వచ్ఛమైన స్పష్టమైన స్వరాలు వ్యాప్తిచెందుతూ రాత్రిని నింపుతూ
మసక చీకటి దేవదారు, శంకువృక్షాలలో బిగ్గరగా ధ్వనిస్తూ
తడిలోని తాజా పరిమళాలు, చిత్తడి నేల సువాసనలలో స్పష్టంగా,
ఉండగా, నేను నా సహచరులతో ఆ రాత్రి అక్కడే ఉన్నాను.

నా కనులలో బందీ అయిన నా చూపు మూయబడలేదు
దీర్ఘ విస్తృత దృశ్యాలను చూడ నిరీక్షించేందుకు గాను,

నేను చూసాను అనేక సైన్య సమూహాలను
శబ్దరహిత స్వప్నాలలో వందలాది యుద్ధ పతాకలను
యుద్ధపు ధూమాల మధ్య జనించి, క్షిపణులు దూసుకుపోతుండగా నేను చూసాను.
ఆ పొగ గుండా అక్కడకు, ఇక్కడకు కొనిపోతూ, ఛిద్రమై, రక్తపంకిలమై
చివరకు మిగిలిన కొద్ది పీలికలు కర్రలపై, (ఇదంతా నిశ్శబ్దంలోనే)
ఆ కర్రలూ ముక్కలు, ముక్కలుగా విరగగొట్టబడి...

నేను చూసాను యుద్ధరంగాన అసంఖ్యాక మృతదేహాల్ని,
యువకుల తెల్లటి అస్థిపంజరాల్ని, నేను చూసాను
నేను చూసాను కళేబరాలను, చెత్తను, చెత్తతో నిండిన
యుద్ధపు ఆనవాళ్లను, మృతి చెందిన సైనికుల శవాలను
అయితే నేననుకున్నట్లు వాళ్లు లేరు.
వారు పూర్తి విశ్రాంతిలో ఉన్నారు; వాళ్లు బాధపడడం లేదు
బతికి ఉన్నవాళ్లు బాధపడ్తున్నారు, వాళ్ల తల్లులు బాధపడ్తున్నారు.
భార్య, పిల్లలు, స్నేహితులు, సహచరులు బాధపడ్తున్నారు.
చావకుండా మిగిలిన సైన్యాలు బాధపడ్తున్నాయి.

## 16

ఈ దృశ్యాలను దాటి, రాత్రిని దాటి
నా సహచరుల చేతులను వదిలి, వాళ్లను దాటి,
ఆ యోగి పక్షి పాటను దాటి, నా ఆత్మ పాడే పాటను దాటి,
విజయగీతాన్ని, మృత్యు బహిర్గత గీతాన్ని, వైవిధ్యమై, ఎప్పుడూ
మార్పు చెందే పాటను దాటి
తగ్గిన గొంతులో, రోదనాభరితమై ఉన్న, స్పష్టమైన స్వరంతో
పడుతూ లేస్తూ, రాత్రిని వరదలా ముంచేస్తూ
విషాదంగా మునుగుతూ, మూర్ఛపోతూ, హెచ్చరికలపై
హెచ్చరికలు, అయినా ఆనందంగా విస్ఫోటిస్తూ
భూమిని కప్పివేస్తూ, దివ్యలోకపు వ్యాప్తిని నింపివేస్తూ
ఆ శక్తివంతమైన సామగానం, గుహాంతరాళాల్లో నేను విన్నది
దాన్ని దాటి, నేను వదిలిపోతున్నాను ఈ లిలాక్ పూలను,
హృదయాకారపు పత్రాలను
నిన్ను ద్వారపు ఆవరణలో వికసించిన నిన్ను వదిలి
మరల వచ్చే వసంతంలో వస్తాను.
నీ కొరకు ఈ పాట నుంచి ఆగిపోతున్నాను,
పశ్చిమాన ఉన్న నీపై నా చూపును, పడమటి దిక్కు
నీతో కలిసి ఉండగా!
ఆ సహచరుడు వెండిలా ప్రకాశించే వదనంతో రాత్రిలోకి పోతుండగా,

ప్రతి దానిని భద్రపరచుకుని, రాత్రిలో మరలా తీసుకుని రావడానికి
ఆ పాట, అపాత మధురమైన, నల్లటి గోధుమవర్ణపు పక్షిపాట
నా ఆత్మ చుట్టూ ప్రతిధ్వనించే అద్భుతమైన ఆ పాట
దుఃఖంతో నిండిన వదనంతో రాల్తున్న నక్షత్ర కాంతిలా
నా చేతులను పట్టుకున్న సహచరులు ఆ పక్షి పాటను సమీపిస్తుండగా
మంద్ర స్వరాన, రోదనాభరితమై, అయినా స్పష్ట స్వరాన, పడుతూ లేస్తూ,

నా సహచరులు, వారి మధ్య నేను, ఎల్లప్పటికీ గుర్తుంచుకునే
జ్ఞాపకాలు, నేనెంతగానో ప్రేమించిన వారు మృతి చెందగా మిగిలినవారు
ఎంతో మధురమైన, తెలివిగల ఆత్మ, నా అన్ని రోజులు, దేశాలు
– ఇవన్నీ ప్రియమైన అతడి కొరకు.
లిలాక్ పూలు, నక్షత్రాలు, పక్షి, ఇవన్నీ నా ఆత్మ పాడే పాటతో
మేళవించబడి, ఆ పరిమళ భరిత శంకువృక్షాలు,
మసక చీకటి దేవదారు వృక్షాల మధ్యన.

✧✧✧✧✧

---

'నెమ్మదిగా వెళ్తున్న నీ శవపేటికపై
నేను ఇస్తున్నాను నా లిలాక్ పూల శాఖను'

14 April 1865 లో Ford's theatre లో John Wikies Booth చే కాల్చబడి, 15 ఏప్రిల్ 1865 నాడు అబ్రహం లింకన్ కన్నుమూసినాడు. అమెరికాతో పాటు యావత్ ప్రపంచమూ దుఃఖసాగరంలో మునిగినది.

అమెరికన్ కవి Walt Whitman (1819–1892) 1865లో వ్రాసిన స్మృతిగీతమిది (Elegy).

206 పంక్తులు, ప్రకృతి గీత సంప్రదాయం, విషాద ఛాయలున్న కవిత లింకన్ పేరు శీర్షికలో తప్ప ఇంకెక్కడా కానరాదు. లిలాక్ ఊదాపూలు, పశ్చిమాకాశాన తార (వీనస్), యోగి పక్షి (Hermit Thrush) లాంటి చిహ్నాలు, అమెరికా అంతర్యుద్ధానికి సంబంధించిన దృశ్యాలు ఈ కవితలో అద్భుతమైన వర్ణనలతో కానవస్తాయి.

Drum Taps and Sequel to drum taps కవితా సంకలనంలో ఈ కవిత ప్రచురింపబడింది. తరువాత 1867లో Leaves of Grass నాల్గవ ఎడిషన్‌లోకి గ్రహించబడింది. స్మృతిగీతాల్లో (Elegies) John Milton's Lycidas (1637; Percy Bysshe Shelley's Adonais (1821) ల సరసన చేర్చబడిన స్మృతిగీతం– Walt Whitman's - "When Lilacs last in the Dooryard Bloomed" (1865).

అబ్రహం లింకన్ Funeral Train - 1654 మైళ్ల దూరం 2662 కిలోమీటర్ల ఊరేగింపుతో వాషింగ్టన్ నుంచి న్యూయార్క్ మీదుగా Springfield, Illinois చేరుకున్నది. (April 21, 1865 నుంచి May 3, 1865)

వాల్ట్ విట్‌మాన్ ఈ విషయాలను తన కవితలో అనన్య సామాన్యంగా వర్ణించినాడు.

# 3. విద్యుత్ దేహగానం

## (I Sing the Body Electric)

### 1

నేను విద్యుత్ దేహం గురించి పాడుతున్నాను.
నేను ప్రేమించిన వాళ్ల సైన్య సమూహాలు నన్ను కౌగలించుకుంటాయి,
        నేను వారిని కౌగిలించుకుంటాను,
నేను వాళ్లతో వెళ్లేంత వరకూ ప్రతిస్పందించేంత వరకూ
        వాళ్లు నన్ను వదలరు,
వారిని కల్మష రహితుల్ని చేరి, వారిని ఆత్మశక్తితో నిండుగా
        నింపేంతవరకూ!
ఎవరైతే తమ దేహాలను మలినపరచుకుంటారో, వారు
        తమ దేహాలను దాచుకుంటారనడంలో సందేహమా?
బతికున్నవారిని అవమానం చేసేవారు మృతులను అవమానించేవారంత
        చెడ్డవారనడంలో సంశయమా?
ఆత్మ అంత సంపూర్ణంగా దేహం ప్రవర్తించకపోతే?
దేహమే ఆత్మ కాకపోతే, మరి ఆత్మ అంటే ఏమిటి?

### 2

స్త్రీ గాని, పురుషుడు గాని, వారి దేహాలపై ప్రేమను
        గణించడానికి సందేహిస్తారు, దేహమూ సందేహిస్తుంది.
మగవాడిదీ పరిపూర్ణమైనది, స్త్రీదీ పరిపూర్ణమైనదని
ముఖ కవళికలూ సందేహిస్తాయి.
చక్కగా తయారు చేయబడిన మనిషి వ్యక్తీకరణ అతడి
వదనంలోనే కాక అంగాంగాల్లో, తుంటి, మణికట్టు కీళ్లలో
        కూడా ప్రస్ఫుటంగా కానవస్తుంది.

అతడి నడకలో, మెడవంపులో, నడుము మడతలో
మోకాళ్లలో; దుస్తులు అతడిని దాచలేవు.
అతడి బలమైన మధురమైన వ్యక్తిత్వం నూలు, ఉన్ని
దుస్తులలోంచీ కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది.
అతడు వెళ్తుంటే ఒక గొప్ప కవిత నడుస్తున్నట్లు, ఇంకా ఎక్కువగా,
చెప్పాలంటే, నీవు అతడి వెనుకను చూడడానికి ఆతృత
చెందుతావు, అతడి మెడ వెనుకను, భుజాల వెనుకను,

పసిపాపల లాలిత్యము, పూర్ణత్వము, స్త్రీల వదనాలు, వక్షోజాలు
వారి దుస్తుల వంపుసొంపులు, వారి గమన రీతులు
వీధుల్లో వెళ్తున్నపుడు వారి ఆకారపు సొబగులు, ఇవన్నీ.
ఈతకొలనులో నగ్నంగా ఈదుతున్న ఈతగాడు
ప్రకాశవంతమైన ఆకుపచ్చని పారదర్శక ద్రవంలో ఈదుతూ
లేదా, ముఖంపైకి ఉండేట్లు తేలియాడుతూ నిశ్శబ్దంగా
వెనక్కీ ముందుకూ నీటి అలలల కుదుపులకు–
తెడ్ల పడవలలో తెడ్లు వేసేవాళ్లు తెడ్లను వెనక్కూ,
ముందుకూ కదిలిస్తున్నట్లు, అశ్వికుడు గుర్రపు జీనుపై!
ఆడపిల్లలు, తల్లులు, పరిచారికలు అందరూ తమ తమ పనుల్లో
శ్రామికుల గుంపు మధ్యాహ్నం కూర్చుని భోజన పాత్రలను
తెరిచి, తమ భార్యలు చూస్తుండగా,
తన బిడ్డను ఓదారుస్తున్న తల్లి, తోటలోనో, పశువుల శాలలోనో
రైతు కూతురు.
మొక్కజొన్న కోస్తున్న యువకుడు, గుంపు మధ్య గుండా తన
ఆరు గుర్రాల బండిని నడుపుతున్న రథికుడు
కుస్తీపడ్తున్న యోధులు, ఇద్దరు శిష్యులు, వయసులో ఉన్నవారు
యవ్వనోత్సాహంతో, మంచి వ్యక్తిత్వంతో, ఆ ఊరివాళ్లు,
ఖాళీ స్థలంలో, సూర్యుడస్తమించాక, తిరస్కారాన్ని కౌగిలించుకుంటూ

పైపట్టు, లోపలిపట్టు, జుట్టు కళ్ల మీదపడి చీకటి కాగా
అగ్నిమాపకదళ సిబ్బంది తమ యథాపూర్వక దుస్తులతో పోతూ,
మగవాళ్ల బలిష్ఠమైన కండలు వారి లాగూలలో, పటకాల వద్ద కనిపిస్తుండగా
మంటల వద్ద నుండి నెమ్మదిగా మరలి వచ్చి, కాసేపు విరామం,
మరల గంట మ్రోగగానే, మరల జాగరూకులై
సహజంగా, పరిపూర్ణంగా, వైవిధ్యపు రీతుల్లో, కాస్త వంచిన తల
మెడవంపు, వాళ్లు లెక్కిస్తున్నారు.
ఎలా అంటే– నేను ప్రేమిస్తున్నాను, నన్ను నేను వదులు చేసుకున్నాను
స్వేచ్ఛగా పోతున్నాను, తల్లి రొమ్ము వద్ద ఉన్న పసిపాపతో,
ఈతగాళ్లతో కలిసి ఈదుతూ, కుస్తీ పడ్తున్నవాళ్లతో కలిసి
కుస్తీ పడుతూ, అగ్నిమాపక సిబ్బందితో కవాతు చేస్తూ
ఆగి, విని, లెక్కించి....

## 3

నాకొక మనిషి తెలుసు, సాధారణ రైతు, అయిదుగురు కొడుకుల తండ్రి
వాళ్లలో కొడుకులకు తండ్రులు, వాళ్లలో తండ్రులకు కొడుకులు
అద్భుతమైన జీవశక్తి, ప్రశాంతత, వ్యక్తిగత సౌందర్యం అతడి సొత్తు.
అతడి శిరస్సు రూపం, తెలుపు పసుపు కలిసి పాలిపోయినట్లుండే
జుట్టు, గడ్డం, కొలతలకు కుదరని అర్థం సూచించే నల్లని కళ్లు
ఘనమై, వైశాల్యమై ముచ్చట గొలిపే నడవడి
ఇవన్నీ చూడడానికే నేనతడిని దర్శించేవాడిని, అతడు తెలివిగలవాడు కూడా!
ఆరడుగుల ఎత్తు, ఎనభై ఏళ్ల వయస్సు; అతడి పుత్రులు బలిష్ఠులు,
శుభ్రంగా ఉండి, చక్కటి గడ్డం, అందమైన వాళ్లు.
వాళ్లూ, అతడి కుమార్తెలు, అతడినెంతగానో ప్రేమించేవారు.
అతడిని చూసిన వారెవరైనా అతడిని ప్రేమిస్తారు.
అతడి సంపాదన గురించి కాదు, అతడిని మనసారా ప్రేమించేవారు
అతడు మంచినీళ్లు మాత్రమే తాగేవాడు. అతడి రక్తం ఎర్రగా

ప్రకాశించేది, అతడి స్వచ్ఛమైన గోధుమరంగు వదన చర్మం క్రింద
అతడు తుపాకీతో వేటాడేవాడు, చేపలు పట్టేవాడు, తన పడవను
తానే నడిపేవాడు, అతడికి దానిని ఓ ఓడల యజమాని బహుమతిగా
ఇచ్చినాడు, అతడికి అడివికోళ్లను వేటాడేందుకు తుపాకులను
అతడిని ఇష్టపడేవాళ్లు కానుకగా ఇచ్చినారు.
అతడు బయటకు వెళ్లినప్పుడల్లా అతడి అయిదుగురు
కొడుకులు, అనేకమంది మనవళ్లు వేటకు బయల్దేరేవాళ్లు.
అంతమంది గుంపులోనూ ఎక్కువ ఉషారుగా ఉండేది అతడే!
నీకనిపిస్తుంది అతడితో చాలా చాలా కాలం కలిసి
ఉండాలని, పడవలో అతడి పక్కనే కూర్చుని
అతడు, నీవు ఒకరినొకరు స్పృశించుకుంటే బాగుంటుందని
నీ కనిపించవచ్చు.

## 4

నాకిష్టమైన వాళ్లతో కలిసి ఉండడం చాలని నేను తలపోసాను.
మిగతావాళ్లతో సాయంకాలం గడపడం కోసం ఆగడం ఇకచాలు.
అందమైనవాళ్లు, ఆసక్తితో, ఊపిరులు పీలుస్తూ, నవ్వుతూ ఉండే
శరీరాలు నీ చుట్టూ ఉండడమిక చాలు.
వారి మధ్యన నడవడం, ఎవరో ఒకరిని స్పృశించడం, నా చేతుల్ని
ఆమె లేక అతడి మెడ చుట్టూరా మృదువుగా పెనవేయడం,
ఒక్క క్షణమే, అయితే ఏమిటప్పుడు?
నేనింతకు మించిన ఆనందాన్నేదీ అడగబోను, సముద్రంలో
ఈదినట్లు దానిలోనూ ఈదుతాను.
ఆడ, మగవాళ్లకు దగ్గరగా ఉండడంలో చూడడంలో ఏదో విషయమున్నది,
ఆ స్పర్శలో, ఆ వాసనలో, ఏదో ఆత్మను సంతోషపరచేదున్నది.
ఆత్మను ఆనందింపజేస్తాయి అన్ని విషయాలు, ఈ విషయాలు ఆత్మను
మరింత సంతోషపెడ్తాయి.

## 5

ఇది స్త్రీ రూపం
ఒక దివ్యకాంతి వలయం ఆమె నుంచి వెలువడ్తుంది ఆపాదమస్తకం
అది భీకరమైన కాదనలేని ఆకర్షణతో ఆకర్షిస్తుంది.
నేను ఆ ఊపిరితో ఆకర్షింపబడినప్పుడు, నేను అసహాయమైన
ఆవిరినై ఉండగా, అన్నీ పక్కకు పడిపోతాయి, నేనూ, అది తప్ప.
పుస్తకాలు, కళ, మతం, కాలం, కనిపించేది, నేల, స్వర్గం నుంచి
ప్రతీక్షించేది లేదా నరకం నుంచి భయపడేది, అన్నీ ఆరగించబడ్తాయి.
ఉన్మత్తతా కేసరాలు, అదుపు చేయబడని మొలకలు ఆడుకుంటాయి,
దానినుంచే వచ్చే ప్రతిస్పందన కూడా అదుపు చేయలేనిది.
శిరోజాలు, వక్షోజాలు, పిరుదులు, కాలి వంపులు, పడీపడనట్లు పడే
చేతులూ అన్నీ పరివ్యాప్తమవుతాయి, నావి కూడా.
ఆటను ఆపే పోటు; పోటును ఆపే ఆటు, ప్రేమ దేహపు
వ్యాకోచం, మధురమైన బాధ.
అవధుల్లేని పారదర్శకపు ప్రేమ ధారలు, అపరిమితమై కంపించే
ప్రేమ ద్రవాలు, శ్వేత ఉప్పెనలు, మధుర రసాలు.
వరుడి ప్రేమరాత్రి ఖచ్చితంగా, మెత్తగా ప్రవహిస్తుంది వేకువలోకి
మృదువైన తరంగాల్లా లొంగి అంగీకరించే పగటిలోకి,
కౌగిలింతల మధుర స్పర్శల దినములోకి చొచ్చుకునిపోయి మాయమౌతుంది.
ఇది కేంద్రకం, స్త్రీకి శిశువు జన్మించాక – మగవాడు
స్త్రీ నుంచి జనన మొందినాడు.
ఇది జన్మస్నానం, చిన్నా పెద్దల కలయిక, మరల బయటకు దారి
మహిళలారా సిగ్గుపడకండి. మీకున్న గౌరవం మిగతావాటిని
చుట్టి వస్తుంది. మిగతా వాటిని బయటకు నెడ్తుంది.
మీరు దేహానికి ద్వారాల వంటివారు, ఆత్మకూ ద్వారాలు మీరు.
స్త్రీకి అన్ని లక్షణాలు, నిరోధాలు ఉంటాయి.
ఆమె తన స్థానంలో ఉండి, చక్కని సమతుల్యతతో కదుల్తుంది.

మేలిముసుగు చాటున్న అన్ని విషయాలు ఆమె, ఆమె
చురుకైనది, సహనము గలది.
ఆమె మగపిల్లలతో పాటు ఆడపిల్లలకు జన్మనిస్తుంది
ఆడపిల్లలతో పాటు మగపిల్లలనూ–
నేను నా ఆత్మను చూస్తున్నాను ప్రకృతిలో ప్రతిఫలించగా,
నేను ఆ మంచు తెరలలో నుంచి చూస్తున్నపుడు, ఆమె
వర్ణించలేని, సంపూర్ణమైన, బుద్ధి స్థిరత, సౌందర్యం
ఆ వినమ్రత శిరసును, రొమ్ములను కప్పుకున్న చేతులతో
ఉన్న ఆ మాతృమూర్తి స్త్రీ రూపాన్ని చూస్తున్నాను.

## 6

మగవాడేం తక్కువ కాదు, ఎక్కువ కాదు, అతడికీ తన స్థానమున్నది.
అతడికీ అన్ని గుణాలున్నాయి, అతడు క్రియ, అతడు శక్తి
గ్రాహ్యమైన విశ్వపు ఉద్రేకం అతడిలో ఉన్నది.
తిరస్కారం అతడు, ఆకలి, తిరుగుబాటు అతడు,
విశృంఖల విశాల ఉద్వేగాలు, అత్యంత ఆనందం, విచారం
అన్నీ అతడివే, గర్వమూ అతడిదే.
గర్వమధికమై ప్రశాంతతనిస్తుందతడికి, అతడి ఆత్మకు,
జ్ఞానమే అతడు, దానిని ఎల్లప్పుడూ ఇష్టపడతాడు,
ప్రతిదానిని పరీక్షకు పెడ్తాడు.
దేనిని పరిశీలించినా, ఏ సముద్రమైనా, ఏ పడవైనా
దానిని ధ్వనింపజేస్తాడిక్కడే.
(ఇక్కడ కాకపోతే ఇంకెక్కడ చేయగలడు?)
మగవాడి దేహమూ పవిత్రమైనదే, స్త్రీ దేహంలా
ఎవరైనా కావచ్చు, అది పవిత్రమైనదే, – శ్రామికుల గుంపులో
అతి అల్పమైన వాడి దేహం కూడా,
రేవులో అడుగుపెట్టిన వలస వచ్చినవాడి ఉదాసీన వదనమైనా,
ప్రతిదీ ఇక్కడకు చెందినదే, భాగ్యవంతుడిదైనా, నీలాంటివాడిదైనా,

ఈ ఊరేగింపులో ఆమెకైనా, అతడికైనా ఎవరి స్థానం వారికున్నది.
(అంతా ఓ ఊరేగింపు,
ఈ విశ్వమే ఓ ఊరేగింపు. పరిపూర్ణమైన, కొలతలున్న కదలిక)
నీ గురించి నీకు తెలుసా, అల్పుడిని నీవు అజ్ఞాని అంటున్నావు?
మంచి దృశ్యాన్ని చూసేందుకు నీకు అర్హత ఉన్నది, అతడికి
గాని ఆమెకు గాని లేదా ఆ అర్హత?
నీవనుకుంటున్నావా పదార్థమంతా
దగ్గరకు వచ్చి పరివ్యాప్తమై తేలియాడుతుండగా, నేల
దాని ఉపరితలాన ఉన్నదని, నీరు ఏరులై ప్రవహించగా,
ఆకుపచ్చదనం మొలకెత్తుతుందని.
నీ కొరకేనా, అతడికి, ఆమెకు కాదా?

## 7

మగవాడి శరీరం వేలం వేయబడుతున్నది.
(యుద్ధానికి ముందు నేను బానిసల విక్రయశాలకు పోయి
చూస్తూండేవాడిని.)
వేలం వేసే వాడికి సాయం చేసేవాడిని, అతడు
ఖంగాళీ మనిషి, తన పని ఎలా చేయాలో తెలియనివాడు,
గౌరవనీయులు ఈ అద్భుతాన్ని చూసేవారు.
పాడేవాళ్లు ఎంత ఎక్కువ పాడినా వారికది చాలేది కాదు.
క్వింటిల్లియన్ సంవత్సరాల నుంచి ఈ గోళం తయారు చేస్తున్నది
ఒక్క మొక్క, జంతువు లేకుండా, దాని కోసమే!
దానికోసమే ఋతువులు పరిభ్రమిస్తున్నాయి
వాస్తవంగా, స్థిరంగా కదులుతూ
ఈ శిరస్సులో అన్నిటినీ కళవళ పరిచే మెదడు
దానిలో, దిగువ ధీరోదాత్తులైన హీరోల నిర్మాణం,
వీళ్ల కాళ్లూ చేతులను పరీక్షించు, ఎర్రగా, నల్లగా,
తెల్లగా, వీళ్ల నరాల్లో, కండల్లో వంచనా రూపం.

వాళ్లను నగ్నంగా చేయి, నీవు చూడవచ్చు పూర్తిగా,
అతి శ్రేష్ఠమైన ఇంద్రియశక్తి, జీవముట్టిపడ్తున్న నేత్రాలు
ధైర్యము, స్వేచ్ఛ, స్వసంకల్పము.
రొమ్ము కండల ముక్కలు, మెత్తటి నడుము, మెడ,
వదులుగా లేని మాంస సముదాయం, సౌష్ఠవంగా ఉన్న కాళ్లూ చేతులూ
అయినా వాటిలోని అద్భుతాలు
వాటిలో ప్రవహించే రక్తం
పాత రక్తమే! ఆ ఎర్రటి ప్రవహించే రక్తమే!
అక్కడ ఉబుకుతుంది, ధారలు జిమ్ముతుంది హృదయం,
అన్ని ఉద్వేగాలూ, కోరికలు, ఆశయాలూ, చేరుకోవడాలు.
(నీవనుకుంటావా అవి లేవు ఎందుకంటే అవి సౌందర్యశాలలలోనూ,
తరగతి గదుల్లోనూ వ్యక్తపరచబడవని?)
ఇతడొక్కడే మనిషి కాదు, ఇతడు తండ్రులు కాబోయే
తండ్రులకు తండ్రి.
అతడిలో జనాభా సమృద్ధి రాష్ట్రాలు, గణతంత్ర రాజ్యాలున్నాయి.
అతడికై అసంఖ్యాక శాశ్వత జీవితాలు, వాటిలో
అసంఖ్యాక అవతారాలు, ఆనందాలున్నాయి.
నీకెలా తెలుస్తుంది శతాబ్దాల గుండా అతడి సంతానానికి
సంతానంలో ఎవరు వస్తారని?
(నీవెలా కనుగొంటావు నీలో నుంచి నీవెలా వచ్చావో
శతాబ్దాల వెనుకకు శోధించుతూ పోతుంటే)

## 8

స్త్రీ దేహం వేలానికి ఉన్నది.
ఆమె కూడ ఆమె కొరకే కాదు, ఆమె తల్లులకు తల్లి.
ఆమె తల్లులకు సహచరులకు తల్లిగా భరిస్తుంది
నీవెప్పుడైనా స్త్రీ దేహాన్ని ప్రేమించావా?
నీవెప్పుడైనా పురుష దేహాన్ని ప్రేమించావా?

ఈ భూమిపైనున్న సర్వ దేశాల్లో, కాలాల్లో ఇవన్నీ
ఒకే రకంగా ఉండడం గమనించావా?
ఏదైనా పవిత్రమైనది ఉందనుకుంటే అది మానవ దేహమే!
మానవుని కీర్తి, మధురిమలు మచ్చలేని మానవత్వాన్ని సూచిస్తాయి.
స్త్రీ, పురుషులలోని శుభ్రమైన, దారుఢ్యమైన, స్థిరమైన
తంతు నిర్మిత దేహం అత్యంత అందమైన వదనం కన్నా
మరింత అందంగా ఉంటుంది.
తన దేహాన్ని మలిన పరచిన మూర్ఖుడిని నీవు చూసావా?
తన దేహాన్ని మలినపరచుకునే స్త్రీని నీవు చూసావా?
వారు ఆ దేహాన్ని మరుగుపరచరు, మరుగుపరచలేరు.

## 9

ఓ నా దేహమా! నీలాంటి దేహాల్ని కలిగి ఉన్న స్త్రీ పురుషుల
దేహాల్ని నేను విడిచిపుచ్చలేను, నీలాంటి దేహ భాగాల్ని,
నీ దేహాల్లాంటి దేహాలూ ఆత్మ ఉత్థాన పత్థానాలతో
పడి లేస్తాయని నమ్ముతాను (అవి ఆత్మలే కనుక)
నేను నమ్ముతాను మీరు నా పద్యాలతో పాటు పడి లేస్తారని,
నిలబడతారని, పడతారని, అవి నా పద్యాలు.
పురుషుడు, స్త్రీ, బాలుడు, యువకుడు, భార్య, భర్త, తల్లి, తండ్రి
యువకుడు, యువతి, వీరందరి పద్యాలు, కవితలు
తల, మెడ, శిరోజాలు, చెవులు, చెవిదొబ్బలు, కర్ణభేరులు,
కనులు, కనురెప్ప వెండ్రుకలు, కనుపాప, కనుబొమలు, మెలకువగా,
నిదురలో ఉండే కనురెప్పలు
నోరు, నాలుక, పెదాలు, దంతాలు, అంగిట, దవడలు, దవడ కీళ్లు
ముక్కు, ముక్కు రంధ్రాలు, మధ్యలో గోడ,
బుగ్గలు, నమరుగంతలు, నుదురు, చుబుకం, గొంతు, మెడ వెనుక, మెడ
బలిష్ఠమైన భుజాలు, మగతనాన్ని చూపే గడ్డం, రెక్క ఎముక,
భుజాల వెనుక, విశాలమై గుండ్రటి ఛాతి,

పై చేయి, చంక, మోచేయి, చేయి, చేతికీళ్లు, ఎముకలు,
మణికట్టు, మణికట్టు కీళ్లు, చేయి, అరచేయి, ముణుకులు,
బొటనవేలు, చూపుడువేలు, వేళ్ల కీళ్లు, గోళ్లు
ఎదురు ఛాతీ, మెలిదిరిగిన వెంట్రుకలు, ఛాతి ఎముకలు, పక్కటెముకలు
తుంటి, తుంటి ఎముకలు, తుంటి దారుఢ్యం, లోపలికి, బయటకు
వృషణాలు, మేహనం
తొడలు, దేహాన్ని భరించే ఎముకలు
కాలి తంతువులు కండరాలు, మోకాలు, మోకాలి చిప్ప, పైకాలు, క్రింది కాలు
చీలమండలు, పాదాలు, వేళ్లు, వేళ్ల కీళ్లు, మడమ
అన్ని రకాల నడకలు, ఆకారాలు, నా, నీ శరీర నిర్మాణాలు
ఎవరిదైనా కావచ్చు, స్త్రీయైనా పురుషుడిదైనా,
ఊపిరితిత్తులు, హృదయ కవాటాలు, గొంతు కవాటాలు,
లింగరూపము, మాతృత్వము
స్త్రీగా ఉన్న స్త్రీ రూపము, పురుషునికి జన్మనిచ్చే స్త్రీత్వము
గర్భసంచి, చనుగుబ్బలు, చనుమొనలు,
పాలు, కన్నీళ్లు, నవ్వు, ఏడుపు, ప్రేమ దృక్కులు
ప్రేమలో ఒడిదుడుకులు, ఎగిసి పడడాలు
గొంతు, సంభాషణ, భాష, గుసగుస, కేకలు, అరుపులు
తిండి, నీరు, నాడి, జీర్ణక్రియ, చెమట, నిద్ర, నడక, ఈత
నడుముపై చేయి ఉంచి నిలబడడం, గెంతులు,
పడుకోవడం, కౌగిలించుకోవడం, చేతుల్తో
చుట్టేయడం, బిగించడం.
క్షణక్షణం మారే నోటి బిగింపులు, కనుల చుట్టూ మార్పులు
చర్మం, ఎండకు రంగు మారడం, మొటిమలు, వెంట్రుకలు
ఓ వింత జాలి శరీరపు నగ్న మాంసాన్ని ఒకరు
స్పర్శించినపుడు ఇంకొకరికి కలిగే భావన,
వలయంగా తిరిగే ఊపిరుల నదుల ప్రవాహాలు,

లోనికీ బయటకు కదిలే ఉచ్ఛ్వాస నిశ్వాసాలు,
నడుముకున్న అందం, పిరుదుల లావణ్యం!
మోకాళ్ల వరకూ సాగే సౌభాగ్య సౌందర్యం,
నీలో నాలో ఉన్న పలుచని ఎర్రటి చిక్కటి జిగురున్న ద్రవాలు,
ఎముకలు, ఎముకలలోని మూలుగలు.
అద్భుతమైన ఆరోగ్య స్వస్థతా జ్ఞానము
ఓ; నేనంటాను ఇవన్నీ శరీరంలోని భాగాలూ, పద్యాలూ
కావు, ఆత్మవని.
ఓ, నేనంటాను ఇవే ఆత్మ అని.

✧✧✧✧✧

---

వాల్ట్ విట్‌మాన్ తనను తాను ఆదిమానవుడు ఆదాం (Adam) గా భావించుకుని ఈ దివ్య విద్యుత్ దేహగానాన్ని చేసినాడు. దేహాన్నే కాక దేహంలో ఉండే విద్యుత్‌ను–ఆత్మను అద్భుతంగా కవిత్వీకరించినాడు.

1855లో Leaves of Grass లో ప్రచురింపబడింది శీర్షిక 1867 ఎడిషన్‌లో– 'I sing the Body Electric' పేరున ప్రచురితమైనది.

ప్రకృతి సహజమై, పతనం చెందని మానవుడిగా ఆడమ్‌ను వర్ణించి, అతడు తన సంతానాన్ని– Children of Adam – మరల ఈడెన్ తోటలోకి నడపాలని వాల్ట్ వైట్‌మాన్ అభిప్రాయపడినాడు.

మానవులందరూ ఒకటే అని ప్రబోధిస్తూ, రేపటి అమెరికాలో ఈ తారతమ్యాలుండ బోవని ముందుగానే జోస్యం పలికినాడు. అందుకే ఈ కవిత అత్యంత శక్తివంతమైన Prophetic Poem గా రూపుదాల్చినది. వాల్ట్ విట్‌మాన్ తనదైన శైలిలో ఈ కవితను చిరస్మరణీయంగా తీర్చిదిద్దినాడు.



# మాథ్యూ ఆర్నాల్డ్

## (Matthew Arnold 1822-1888)

మాథ్యూ ఆర్నాల్డ్ (24-12-1822 to 15-4-1888) ఆంగ్ల కవి, విమర్శకుడు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా పనిచేసినాడు. Sage Writer (యోగి లాంటి రచయిత) - వర్తమాన విషయాలపై పాఠకుడికి మార్గదర్శక రచయితగా ప్రసిద్ధిగాంచినాడు.

G.W.E. Russell అతడి గురించి వ్రాస్తూ "Matthew Arnold is a man of the world entirely free from worldliness and a man of letters without the faintest trace of Pedantry"

ఎంతో సుఖవంతమైన జీవితానికి అలవాటుపడినా అతడు సమకాలీన విషయాలపై నిగూఢమైన చక్కని కవితలను వ్రాస్తూ Third Great Victorian Poet along with Alfred Lord Tennyson and Robert Browing గా పేరు తెచ్చుకున్నాడు.

1867లో వ్రాసిన అతడి Dover Beach చాలా పేరు తెచ్చుకున్నది. “ఈ ప్రపంచంలో మనకు ఉన్నదానితో సుఖంగా లేకపోతే మనం మన అవసరాలను, కోరికలను తగ్గించుకుని సంతృప్తిగా బతకడం మేలు. పరలోకంలో స్వర్గ సుఖాలు లభిస్తాయని కలలు గనడం కన్నా!” -అన్నది అతడి సిద్ధాంతం.

ఇంగ్లండ్‌లోని, కెంట్‌లోని ‘డోవర్ బీచ్’ వస్తువుగా వ్రాసిన ఈ కవిత, నాగరికత పెరిగినకొద్దీ ప్రకృతిలోని మార్మికత మాయం కావడాన్ని, దేవునిపై విశ్వాసం సన్నగిల్లడాన్ని వర్ణిస్తుంది.

భావవాద కవిత్వానికి (Romanticism) నవీన కవిత్వానికి (Modernism) కు మధ్య వారధిలా కొందరు విమర్శకులు మాథ్యూ ఆర్నాల్డ్‌ను పరిగణించడానికి కారణం- Dover Beach and The Scholar Gypsy కవితలు.

# 4. డోవర్ బీచ్

## (Dover Beach)

సముద్రం ప్రశాంతంగా ఉదీ రాత్రి.
సంపూర్ణమైన అలల పొంగు, చక్కగా కానవస్తున్న చంద్రుడు,
అఖాతంపైన – ఫ్రెంచి తీరాన, వెలుగుతున్న కాంతి కిరణాలు
చటుక్కున ఆగిపోయాయి; ఇంగ్లండు గుట్టలు నిలబడి ఉన్నాయి.
మెరుస్తూ, విశాలంగా, ప్రశాంతమైన అఖాతం వద్ద!
రా, కిటికీ వద్దకు! రాత్రి గాలి మధురంగా ఉన్నది!
పొడుగైన వరుస జల్లు రేఖ,
ఎక్కడైతే సముద్రం, వెన్నెలతో తడిపిన నేలను కలుస్తున్నదో అక్కడ!
విను! నీవు వినగలవు గలగల ధ్వనించే గులకరాళ్ల హోరు
అలలు వాటిని వెనక్కి లాగి మరల ముందుకు విసుర్తున్నపుడు
అవి తిరిగి వచ్చేప్పుడు ఎగువ కరవాకకు తగిలి
మొదలై, ఆగి, మరల మొదలవుతాయి.
వణుకుతున్న నెమ్మది అవరోహణ స్వరాల్లా, వాటితో
తీసుకువస్తాయి శాశ్వత విషాద వరుసల్ని.

సోఫోక్లీజ్ చానాళ్ల క్రితం
విన్నాడు ఎగియన్ సముద్ర తీరాన, అది తీసుకువచ్చింది అతడి
మదిలోకి బురదగా ఆటుపోట్లను
అవి మానవ దైన్యానికి సంబంధించినవి. మనం
కనుగొంటాం ఆ శబ్దంలో ఒక ఆలోచనను
ఈ సుదూరపు ఉత్తర సముద్రం వలన వింటూ!

ఒకప్పుడుండేది విశ్వాసమనే సముద్రం
నిండుగా, సంపూర్ణంగా, ఈ భూమి తీరాలను చుట్టి,

ప్రకాశవంతమైన నడికట్టు మడతల్ని నేలపై పరచినట్లు;
కాని, నేనిప్పుడు వింటున్నాను
దాని విషాద స్వరాన్ని మాత్రమే, దీర్ఘమై, హోరు తగ్గిన దానిని
వెనక్కి తగ్గుతూ, రాత్రిగాలి ఊపిరి విసురుకు
విశాలమైన భయంకరమైన అంచుల వెంబడి
ప్రపంచపు నగ్న గులకరాళ్లలా!

ఓ ప్రేమా, మనం ఒకరికొకరం నిజాయితీగా
సత్యరూపంగా ఉందాం! ఈ ప్రపంచం
మనముందు ఓ స్వప్నలోకంలా పడి ఉన్నది
వైవిధ్యంగా, అందంగా, కొత్తగా;
కాని, వాస్తవానికి సంతోషం గాని, ప్రేమ గాని,
వెలుగు గాని, నిర్ణయం గాని, శాంతి గాని,
బాధకు సాయం గాని ఏమీ లేవు,
ఒక చీకటి మైదానంలో మనం పడి ఉన్నాం
ఘర్షణ, పలాయనాల హెచ్చరిక ధ్వనుల అయోమయంలో
కొట్టుకుపోతూ, అజ్ఞానపు సైన్యాలు
రాత్రుళ్లు కలహించుకునే చోటుకు!

**And we are here as on a darkling plain**
**swept with confused alarms of struggle and flight.**
**where ignorant armies clash by night.**

---

తొలి Modern Poem గా పిలువబడినదీ కవిత. The Sea is calm tonight అని ప్రారంభమయ్యే ఈ కవిత క్షణక్షణం పెరిగి మరల తరిగే అలల్లా దృశ్యాల్ని మార్చుతూ, ధ్వనుల్ని వినిపిస్తూ క్రమేపీ మారుతున్న జీవన పరిస్థితుల్లోని విషాదాన్ని బయటకు తెస్తుంది. పైకి స్వప్నలోకంలా కనిపించినా ఆనందం, వెలుగు, ప్రేమ, శాంతి లేని ఆ ప్రపంచమే మన భవిష్యత్తు కానున్నదని నూరేళ్ల క్రితమే అతడు హెచ్చరించిన హోరుధ్వనులు మన చెవుల్లో మార్మోగుతాయి.

# 5. సంచార మేధావి

## (The Scholar Gipsy)

వెళ్లు, నిన్ను పిలుస్తున్నారు వాళ్లు, ఓ గొర్రెలకాపరీ!
వెళ్లు గొర్రెలకాపరీ! కొండదిగి గొర్రెలకొట్టం తడిక తీయి!
ఆశతో ఎదురుచూస్తున్న మందకు ఆకలి తీర్చకుండా వెళ్లకు.
బే, బే, అనే గొర్రెల గొంతులకు ఎక్కువ శ్రమనివ్వకు.
కోసిన పచ్చగడ్డి ఇంకా కొత్త మొలకల నివ్వలేదు.
అయితే పొలాలు నిశ్శబ్దంగా నిలబడి ఉన్నపుడు
అలసిన మనుషులు, కుక్కలు ఆదమరచి నిద్రపోతున్నపుడు
ఒక్క తెల్లగొర్రెలు మాత్రం కనిపిస్తాయక్కడక్కడ;
వెన్నెల అలుముకున్న పచ్చికపై తెలతెల్లని ఖండిత రేఖల్లా
రా, గొర్రెల కాపరీ, నీ అన్వేషణ మొదలుబెట్టు!

ఇక్కడ పంటను కోసేవాడు తన పని తాను చేస్తున్నాడు,
ఎగువ పొలపు చీకటిమూలలో వేసినాడు తన కోటును,
తన బుట్టను, తన మట్టియాత్ర సరంజామాను
ఎండలో ఉదయమంతా గడ్డి పనలను కట్టుకుని
మధ్యాహ్నం పూట వస్తాడు తన వస్తువులున్న చోటుకు
ఇక్కడ కూర్చుని ఎదురుచూస్తాను నేను.
సుదూరపు ఎగువ భూముల్నుంచి వినవస్తాయి నాకు
గొర్రెల కొట్టంలోని మంద పెట్టే అరుపులు
మొక్కజొన్న పొలాల్లో కోతకోసే వాళ్ల కేకలు
వేసవికాలపు రోజంతా వేడుకగా జీవభాష గుసగుసగా.

ఎగువగా ఉన్న ఈ చోటు, సగం కోసిన పొలం చాటున
సూర్యాస్తమయమయ్యేంత వరకూ, గొర్రెలకాపరీ, ఉంటాను నేనిక్కడే.

దట్టమైన మొక్కజొన్న చేను మధ్య తొంగి చూస్తాయి ఎర్రటి గసగసాల పూలు.
నేను చూస్తాను గుండ్రటి ఆకుపచ్చటి వేళ్లు, పసుపు కాండాలు
లేత ఎరుపు తంతువులున్న పుష్పాల పొదలు
గాలిలో వ్యాపించిన వేపచెట్ల పూల పరిమళాలు
సువాసనలు, జల్లుజల్లుగా గాలిలో తేలి
నేనున్న చోట పచ్చికపై జాలువారుతున్నాయి చూడు.
ఆగష్టు సూర్యుడి నుండి నాకొక గూడును ఇవ్వగా
నాకన్ను ప్రయాణిస్తున్నది దిగువనున్న ఆక్స్‌ఫర్డ్ శిఖరాలవేపు

అదుగో నాకు దగ్గరగా పచ్చికపై గ్లాన్‌విల్ పుస్తకం
రా, నీకు చదివి వినిపిస్తాను అనేకసార్లు చదివిన కథను,
ఓ ఆక్స్‌ఫర్డ్ పేద మేధావి విచిత్ర కథా విశేషమును
నిండైన సౌష్ఠవం, నిపుణతగల మేధో వికాసం
ఉద్యోగంలో అభివృద్ధి చెందే ఉద్దేశపు తలుపు కొట్టడం
వద్దనుకుని, ఒక వేసవి ఉదయం వదిలినాడు
స్నేహితులను, వెళ్లి కలిసినాడు సంచార జిప్సీల సహవాసానికి
వారితో కలిసి తిరిగినాడు ప్రపంచపు నలుమూలలా
చాలామంది అనుకున్నట్లు గొప్ప పనేం చేయలేదు
కాని, ఆక్స్‌ఫర్డ్‌కు, స్నేహితుల కొరకు మరల తిరిగి రాలేదు.

అయితే, ఒకసారి, ఎన్నో ఏళ్ల తరువాత, దేశపు రహదారులపై
అతడికి కళాశాలలో పరిచితమైన ఇరువురు మేధావులు
కలిసినారతడిని, ప్రశ్నించినారు అతడి జీవన విధానాన్ని.
అతడన్నాడు తన జిప్సి బృందం, తన సహచరులు
వారికిష్టమైన రీతిలో తిరుగగల స్వేచ్ఛ, కళలున్నాయని
మనుషుల మెదళ్లను నియంత్రించే శక్తులతో
ఎదుటవారి మనసు తెలిసి వారిని బంధించగలరన్నాడు.
నేను –అన్నాడతడు – ఆ రహస్య విద్యను నేర్చుకుని

సంపూర్ణంగా అధ్యయించి, ప్రపంచానికి తెలియజేయదును
కాని, దానికి కావలెను సరైన సమయము దివ్యలోకపు అనుజ్ఞ"–

ఆ మాట అని అతడు వారిని విడిచి అదృశ్యమైనాడు
మరల తిరిగి రాలేదు, కాని, పుకార్లకు కొదవలేదు.
ఆ సంచార మేధావి కనిపించాడక్కడ ఇక్కడని
కనిపించిన కొద్ది క్షణాలు, ధ్యానంలో, నాలుక కట్టేసిన మౌనంలో
పురాతన కాలపు టోపీ తలపై, నల్లగా మసిబారిన అంగీలో
జిప్సీలు తొడుక్కునే సాధారణ వస్త్రాలలో.
హకస్ట్‌లో వసంతకాలాన కలిసారట గొర్రెలకాపరులు కొందరు
బెర్క్‌షైర్ చిత్తడినేలలోని ఒంటరి ఏల్‌హౌస్ మధుశాలలో
వెచ్చటి బల్లమీద, ముతక చొక్కా మోటుమనుషల మధ్యన
కూర్చుని ముచ్చట్లాడుతున్న తరుణాన.

అయితే, అలా తాగుతూ మాట్లాడ్తుండగానే, అతడెగిరిపోయాడట.
నాక్కూడా వాళ్ల చూపులు సగం సగం అర్థమైనట్లు
గొర్రెల కాపరులకా సంచారి దారిలోన కనబడినట్లు
ఒంటరి గోధుమ పొలాల్లో కాకుల్ని బెదరగొట్టే పిల్లల్ని
అతడేమన్నా అటుగా వచ్చాడా అని అడిగినట్లు.
లేదా నా పడవలో విశ్రాంతి తీసుకుంటున్నాడా,
వేసవి వేడికి విశ్రాంతికై చల్లని నదీ తారాన లంగరు వేసినదానిలోన,
పచ్చిక మైదానాల మధ్యన, ఎండతో వెలుగుతున్న వాటి పైన.
వెచ్చని ఆకుపచ్చని కమ్నర్ కొండల్ని గమనిస్తున్నాడేమో
ఆ బిడియపు స్థలంలో అతడు సంచరిస్తున్నాడేమో!

నాకు తెలిసినంత వరకు నీకిష్టం విశ్రాంతిగా ఉన్న మైదానాలు
ఆక్స్‌ఫర్డ్ నావికులు ఆనందంగా విచ్చేసే ఫెర్రీవద్ద
వేసవి రాత్రులందు ఇళ్లకు తిరిగివస్తూ, చూసారట నిన్ను
బాబ్‌లాక్–హిథె వద్ద థేమ్స్ నదిని దాటుతూండగా,

చల్లని నీటి ప్రవాహంలో నీ వేళ్లు తడిచి ఉండగా
నెమ్మదిగా పోతున్న చిన్న పడవ గుండ్రంగా తిరుగుతుండగా
ఏదో స్వప్న స్థితిలో వెనుకకు ఒరిగి ఉండగా
నీ ఒడిలో ఉన్నాయట పూలగుత్తులొక గుట్టగా
విచ్‌వుడ్ పొదలలో, బిడియపు పొలాల్లో తెంపినవా పూలు
అప్పుడు నీకనులు వెన్నెలలో వెలిగే ప్రవాహంపై నిశ్చలమైనవట.
వారప్పుడు దిగినాక నేలపై నీవు కనిపించలేదు మరల
సుదూరపు గ్రామాల నుంచీ వచ్చే మహిళలు
ఫైఫీల్డ్ ఎల్మ్ చెట్టు చుట్టూరా నృత్యం చేస్తారు మే నెలలో
చీకటి కమ్ముకుంటున్న పొలాల్లో నీవు తిరగడం చూసారు
రహదారి మెట్లను దాటడం చూసినారు
తరచుగా నీవు వారికి ఇచ్చావు అనేక పుష్పాలను
బలహీనమైన ఆకులున్న తెల్లటి ఏనిమోన్లను
ముదురు నీలిగంట పుష్పాలు వేసవి మంచుతో తడిసిన వాటిని
పర్పుల్ ఆర్కిడ్ పూలు, మచ్చల ఆకులతో ఉన్న వాటిని
కాని నీ గురించి చెప్పడానికి వారికి మాటలే లేవు.

గాడ్‌స్టౌవ్ వంతెనపైన, గడ్డి కోసే కాలంలోన,
మండుటెండల జ్వాలల్లో కొడవళ్లు మెరిసే 'జూన్' లోన
గాలికి తలలూపే పచ్చిక బయళ్లలో వస్తున్నవాళ్లు,
నల్లరెక్కల స్వాలో పక్షులు మెరిసే థేమ్స్ నదిపై తిరుగుతాయో
వర్జించబడిన కట్ల కనుమలో స్నానం చేయడానికి పోతున్నపుడు,
వాళ్లు నీకు దగ్గరగా పోయినారు తరచుగా,
దట్టంగా పెరిగిన నదీతటం పైన నీవు కూర్చుని ఉండగా
నీ వైవిధ్యమైన దుస్తులు, నీ ప్రత్యేక రూపం
వెదికే చీకటి కనులు, మృదువైన సంక్షిప్త గాలులు
అయితే, వాళ్లు స్నానం చేసి వచ్చేసరికి, నీవక్కడ కానరావు.

కమ్నర్ కొండలలోని ఏదో ఒంటరి స్థలంలో
తెరచిన తలుపు వద్ద గృహిణి కుట్టుకుంటూ ఉండగా

నీవు కనిపించావట, ఒక తలుపుకు జేరబడి,
వ్యవసాయపు గిడ్డంగుల్లో కుప్పనూర్చేవాళ్లను చూస్తూ
పిల్లలు, పొద్దున్నే వాలు తలంపై, సాయంకాలం ఏటిలోని నీటికోళ్లకై
వెళ్లే వాళ్లు నిన్ను చూసారు నీవు వాటిని చూస్తుండడం
ఏప్రిల్ దినమంతా, పచ్చిక బయళ్లు మోకాళ్ల వరకు
పెరుగుతుండడాన్ని నీవు గమనించడం
నిన్ను గుర్తించారు, నక్షత్రాలు బయటకు వచ్చి ప్రకాశిస్తున్నపుడు
మంచు తడిపిన పచ్చికలో నీవు నడుచుకుంటూ పోతున్నపుడు

ఆకురాలు కాలంలో బాగ్లీవుడ్ చుట్టుపక్కల
మైదానపు అంచుల వద్ద దారి పక్కన, జిప్సీలు
తమ పొగచూరిన గుడారాల్ని వేసుకున్న చోట, నీవు
ప్రతి పొదలోని రక్తవర్ణపు చారికలు, నల్లటి పీలికలు,
థెస్సాలే అరణ్య స్థలంపైన
కోయిల (నల్లపిట్ట) ఆహారాన్ని ముక్కుతో కరుస్తూ
నిన్ను చూసి, తినడం ఆపదు, భయమసలే లేదు.
చాలాసార్లు నీవు తన పక్కగా వెళ్లడం గమనించింది
పారవశ్యంగా, నీ చేతిలో ఏదో వాడిపోయిన కొమ్మ ఉండగా
ద్యులోకం నుండి ఏదో నిప్పురవ్వ పడడానికి వేచిచూస్తూ నీవుండగా,

ఒకసారి శీతాకాలంలో, కట్టమీద బాటపై, చలిలో
బాటసారులు వరద నిండిన పొలాల గుండా ఇంటికి పోతుండగా
నేను నిన్ను దాటిపోలేదా చెక్కల వంతెనపై
పెద్ద అంగీలో ముడుచుకుని, మంచుతో పోట్లాడుతూ
నీ ముఖాన్ని హింక్సె, శీతాకాలపు వంతెన వేపు తిప్పి?
నీవు కొండనెక్కి వెళ్లిపోయినావు
కమ్నర్ పర్వతాల తెల్లటి కనుబొమల వేపు,
ఒకసారి వెనుదిరిగి చూసినావు, మంచుతునకలు దట్టంగా పడుతుండగా

క్రీస్తు చర్చి ఆవరణలో పండుగ దీపాల వరుసను,
వెళ్లి ఊరి బయట విడిగా ఉన్న ఇంటిదగ్గర ఇంత గడ్డికై వెదికినావు.

అయితే ఇదేమిటి – నేను కలగంటున్నానా! రెండువందలేళ్లు
గడిచాయి, నీ కథ ఆక్స్‌ఫర్డ్ ఆవరణలలో తిరుగాడి!
గ్లాన్ విల్ సమాధిపై ఈ కథ వ్రాసి ఉంది
నీవు అభ్యాసపు గదుల్ని వదిలి వెళ్లిపోయావని
జిప్సీల సమూహంలో చేరి వింత కళలు నేర్చుకోవాలని,
నీవు ఈ భూమి నుంచి వెళ్లిపోయావు
చానాళ్ల క్రితం; ఎక్కడో ప్రశాంతమైన చర్చి ఆవరణలో
ఏ మారుమూల పల్లెటూరిలోనో, ఎక్కడో పేరులేని సమాధిలోనో
ఎత్తైన పచ్చికలు, తెల్లపూల ముళ్లపొదలు ఊగుతున్న చోట
ముదుటి ఎరుపు పళ్ల యూచెట్టు నీడనో నీవుండి వుంటావు.

లేదు, లేదు నీవు గంటలు గడిచిపోవడం గమనించలేదు.
మర్త్యుల జీవితాలలో అరిగిపోయేదేమిటి?
మార్పు నుంచి మార్పుకు వాళ్ల జీవితం కదుల్తుంది,
మరల మరల తగిలే అఘాతాలు, దెబ్బలు
శక్తివంతమైన ఆత్మలనే అలిసిపోయేట్లు చేస్తాయి.
స్థితిస్థాపకత శక్తులనే మొద్దుబారదీస్తాయి,
ఇప్పటి వరకు మన నరాల్ని ఆనందంతో, యవ్వనంతో ఉంచినా
మన చతురత వేయి ప్రణాళికలతో అలిసిపోయింది.
అటుగా వెళ్తున్న మేధావికి మన అరిగిపోయిన జీవితాన్ని
వదిలి మనం మనంగా మిగిలిపోతాం.

నీవు జీవించనే లేదు, ఇంక శిధిలమవడం దేనికి?
నీకు ఒక లక్ష్యం, ఒక వ్యాపారం, ఒక కోరిక ఉండి ఉంటే
ఎప్పటి నుంచో మృతులలో లెక్కింపబడినావు.
ఇతర మానవుల్లా నీలోని అగ్నిని వ్యయపరచినావు.

నీ సమకాలీనుల తరాలెన్నో గడచిపోయినాయి.
మేము వెళ్లిపోయే సమయమూ వచ్చింది.
కాని, నీలో ఏదో అమరత్వపు శక్తిని కలిగి ఉన్నావు.
నీవు వయసు పెరుగుదల నుంచి తప్పించబడినావు.
గ్లాన్‌విల్ పుటలలో శాశ్వతంగా జీవిస్తున్నావు
అందుకే నీవలా మిగిలినావు, మేమలా కాదు.

త్వరగా నీవు ఈ ప్రపంచాన్ని వదిలి వెళ్లినా, తాజా శక్తులతో,
బాహ్యంగా ప్రపంచంపై వాటిని వదలక,
లక్ష్యంపై స్థిరంగా, ఇతర విషయాలపై ఖర్చుపెట్టకుండా,
రుగ్మతల నీరసం నుంచి విడుదలై, నిస్త్రాణనిచ్చే సంశయాలను వదిలి
ఎంతో ప్రయత్నించి, ఎంతగానో కలవరపడి, తెచ్చుకున్నావు
మాకు లేనటువంటి జీవితాన్ని,
ఎటువంటి అవకాశము, నిబంధనలు లేకుండా సోమరిగా
కొట్టుమిట్టాడుతూ, ప్రతి ఒక్కరూ కష్టపడుతూ, ఎందుకు
కష్టపడుతున్నారో తెలియక, ప్రతి సగం వంద విభిన్న జీవితాల్ని
గడుపుతూ, మేమూ ఎదురుచూస్తుంటాం నీలానే,
అయితే నీలానే ఆశతో కాదు.

నీవు ఎదురు చూసినావు స్వర్గపు నిప్పుకణిక కోసం, మేము
మా సాధారణ స్వభావాలను సగం నమ్మినవాళ్లం
లోతుగా ఆలోచించము, స్పష్టమైన సంకల్పమూ లేదు
మా అంతర్దృష్టి ఏనాడూ ఫలాల్నివ్వలేదు కార్యాలలో,
మా అస్పష్ట నిర్ణయాలు ఎప్పుడూ సరిగా ఫలించలేదు
ఎవరి కోసమో మేము ప్రతి సంవత్సరం చూసి చూసి
కొత్త ప్రారంభాలను, కొత్త నిరాశలను పుట్టిస్తుంటాము.
జంకుతూ, జీవితాన్ని తప్పుదారిలో పడవేస్తాము.
ఈరోజు గెలిచిన నేలను రేపు కోల్పోతాము
ఆహ్! మేం కోల్పోవడం లేదా లోక సంచారీ! ఎదురుచూస్తూ?

అవును, మేము ఎదురుచూస్తున్నాం, కాని ఇంకా ఆలస్యమౌతున్నది.
ఆ తరువాత బాధ పడతాం! మాలో ఒకడు
ఎంతగానో కష్టాలనుభవించినవాడు నిరాశలో మునిగిపోతాడు.
జ్ఞానపు సింహాసనాన కూర్చుండి అతడు
తన వద్ద దాచబడిన దుఃఖపు అనుభవాల్ని,
ఆ కష్టకాలపు రోజుల్ని నగ్నంగా ముందు పరుస్తాడు,
మనకు అతడి కష్టాల పుట్టుకను, వృద్ధిని, చిహ్నాలను చెబుతాడు.
ఎలా మరణిస్తున్న అగ్గిరవ్వ పోషింపబడిందో
ఎలా అతడి రొమ్ము శాంతపడిందో, ఎలా అతడి శిరస్సు
గంట గంటకు ఉపశాంతికై ఎలా మారిందో!

ఇది మనలో తెలివిగలవాడిని; మనం ఇతరులకై దుఃఖిస్తాము.
మన దీర్ఘకాలపు ఆనందరహిత స్వప్నం ముగుస్తుందని కోరుకుంటాము.
ఆనందానికున్న అన్ని వ్యాజ్యాలను తుడిచివేసి, భరిస్తాము,
పెదాలు మూసిన సహనంతో మన స్నేహితుడి కోసం;
దుఃఖభరితమైన సహనం నిరాశకు పొరుగువాడేనని తెలుసుకుంటాం
కాని, ఎవరికీ నీకున్నట్లు ఆశపై నమ్మకం లేదు,
పొలాల గుండా, అడవుల గుండా నీవు తిరుగుతుంటావు
పల్లెపట్టున తిరిగే, అల్లరి పిల్లాడిలా
నీ యోచనకు మబ్బులు కమ్మని ఆనందాన్ని సేవిస్తూ
ప్రతి సందేహమూ కాలంలో కొట్టుకుపోయేట్లు చేస్తావు.

నీవు జన్మించిన ఆ రోజుల్లో తాజాగా, స్వచ్ఛంగా ఉండేవి యుక్తులు.
మెరుస్తున్న థేమ్స్ నదీజలాల్లా జీవితం ప్రవహించేది.
ఈ నవీన జీవితపు వింతవ్యాధి రాకమునుపు,
దానితో హడావుడిగా రోగులు, విభజింపబడిన లక్ష్యాలను
వాటి తలలు అధికశ్రమకు లోనై, హృదయాలు పక్షవాతానికి
గురవుతాయి సంపూర్ణంగా
అందుకే ఎగిరిపో, నాకు అంటుకున్న భయమా!

ఇంకా ఎగిరిపో, పొదలున్న అడవిలో లోతుగా మునిగిపో
అయిష్టంగా, డిడో ఎలాగైతే తన స్పష్టమైన సంజ్ఞలతో
తన కపట స్నేహితుడు పాతాళంలో-
ఎదురు రాగా, పక్కకు తొలిగిందో
అలాగే నీవూ మాకు చేతులూపి తెలియజేయి,
నీ ఒంటరితనాన్ని భద్రపరచుకో!
ఆక్రమించలేని ఆశనింకా ఆశ్రయిస్తూ
అతిక్రమించలేని నీడనింకా పట్టుకుని ఉంటూ
స్వేచ్ఛగా, సాగే ప్రచోదనంతో ముందుకు పోతూ
రాత్రిపూట, అడవిలోని చెట్ల వెండి శాఖల్లా
సుదూరపు అరణ్యాలలో, ఎవరూ వెంటబడని చోట
ఓ సాధారణ పచ్చికబయళ్ల వాలులో
బయల్పడు, వెన్నెల వెలుగులున్న గుంజల పక్కన
విశ్రాంతి తీసుకుంటూ, నీ పూలను తాజాగా ఉంచు మంచుబిందువులతో,
లేదా విను, మంత్రముగ్ధమైన వీనులతో
చీకటి లోయల్నుంచి, నైటింగేల్ పక్షులకు వినవచ్చే ధ్వనులను!

కాని, ఎగురు మా దారులపై, మా జ్వరపు ప్రవర్తనలపై,
మానసిక వ్యధలతో మేము బలంగా వ్యాధి పీడితులమైనాము.
అది మాకు ఆనందాన్నివ్వకపోయినా, మా విశ్రాంతిని భంగపరచినది.
నీ చక్కటి అందమైన జీవితం నుంచి నిన్ను మేము గెల్చుకోవాలి.
ఆశీర్వదింపబడని వాళ్లలా మేము దారితప్పి ఉన్నాము
త్వరలో, త్వరలో, ఆనందం సమసిపోతుంది.
నీ ఆశలు, పిరికివవుతాయి, నీ శక్తులు అస్థిరమౌతాయి.
నీ స్పష్టమైన లక్ష్యాలు అడ్డదిడ్డంగా స్థానాలు మార్తాయి.
నీ శాశ్వత సంతోష యవ్వనమనేది అదృశ్యమవుతుంది.
మాసిపోయి, ముసలిదై చివరకు మాలా మరణిస్తుంది.

అప్పుడు మా అభినందనలను గాలిలో ఎగిరేట్లు చేయి,
మా మాటలను, మా చిరునవ్వులను

సముద్రం నుంచి వచ్చిన గంభీరుడైన టిరియన్ వ్యాపారి
        సూర్యోదయమప్పుడే దూరాన ఉన్న పడవను కనుక్కున్నట్లు
శీతల శిరోజాల తీగల మొక్కల్ని సులభంగా లేవనెత్తి
        దక్షిణ దిక్కును అవలోకిస్తున్న కనుబొమల వెంద్రుకలు
        ఎగియన్ ద్వీపాల మధ్య
ఉల్లాసంగా గ్రీకు ఓడ వస్తున్న దానిని గమనించి
దాని నిండా పసుపు రంగు ద్రాక్షలు, చియాన్ మధువు
ఆకుపచ్చని నిండైన అత్తిపళ్లు, ఉప్పు చేపలున్నవని
తన పురాతన గృహంలోకి అతిధులు చొచ్చుకు రానున్నారని గ్రహించినట్లు

యువకులైన నావికులు అలలను జయించినవారు
తన చుక్కానిని లాక్కుని, మరిన్ని తెరచాపల నెత్తి
        రాత్రింబవళ్లూ బిడియం లేక పట్టుకుని
చిన్ని గాలులతో కూడిన నీలి సముద్ర జలాలపై
        సిర్టెస్, సిసిలీల మధ్యన
        ఎక్కడైతే అట్లాంటిక్ మహాసముద్రం విజృంభిస్తుందో
పశ్చిమ అఖాతాల కావల, తలవంచని తెరచాపలతో
మబ్బులు నిండిన కొండ శిఖరాల దిగువన, నురుగు పొరల గుండా
బిడియపడ్తూ వ్యాపారస్తులు, నల్లటి ఇబెరియన్లు వస్తున్నారు
తీరాన అతడు తాళ్లతో కట్టిన మాటలను విప్పుతున్నాడు.

✧✧✧✧✧

---

The Scholar Gipsy – సంచార మేధావి – ఆర్నాల్డ్ మాథ్యూస్ రచనలలో ప్రసిద్ధమైనది. 1853లో వ్రాయబడిన ఈ కవిత – జోసెఫ్ గ్లాన్‌విల్ (Joseph Glanvill's The Vanity of Dogmatizing - 1661) రచన ఆధారంగా వ్రాయబడిన Oxford Story. రాల్స్‌వాఘన్ విలియమ్స్ దీనికి, Thyrsis కవితకు సంగీతాన్ని కూర్చి The Oxford Elegy గా ఈ కవితలను అజరామరం గావించినాడు. 1929లో Marjorie Hope Nicolson ఈ కవితలోని Scholar Gipsy ని ఫ్రెంచి ఆల్కెమిస్టు Francis Mercuty Van Helmont గా గుర్తించింది.



# ఎడ్గార్ అల్లన్ పో

## (Edgar Allan Poe 1809-1849)

ఎడ్గార్ అల్లన్ పో (19-1-1809 to 7-10-1849) అమెరికన్ రచయిత, కవి, ఎడిటర్, విమర్శకుడు. మిస్టరి, Macabre - మృత్యువు, దయ్యాలు అంశంగా కథలు, కవిత్వం వ్రాసినాడు. అమెరికాలో Romanticism యుగంలో ముఖ్యుడు. Short Story రచన, డిటెక్టివ్, సైంటిఫిక్ రచనలకు ఆద్యుడిగా గుర్తించబడినాడు. తన రచనల ద్వారా జీవనం సాగించాలని ప్రయత్నించి పేదరికంలో బతికినాడు.

Gambling, Alcoholism వ్యసనాలలో చిక్కుకుని ఎప్పుడూ అప్పుల ఊబిలో ఉండేవాడు. ఆ సమయంలో అమెరికాలో పబ్లిషర్లు రచయితలకు పారితోషికాలు ఎగ్గొట్టేవారు. 18 ఏళ్ల వయసులో మారుపేరుతో మిలటరీలో పనిచేసినాడు. తరువాత అనేక పత్రికలలో ఉద్యోగం చేసి విమర్శకుడిగా– 'ఇంకు బదులు Prussic Acid వాడతాడు' – అన్న కీర్తి సంపాదించినాడు. Henry Wardsworth Longfellow ఇతడి విమర్శలకు గురైనవాళ్లలో ప్రముఖుడు.

జనవరి 29, 1845లో Evening Mirror లో ప్రచురింపబడిన The Raven అతడి కీర్తిని ఇంటింటా వ్యాపింపచేసింది.

అతడి భార్య వర్జినియా మరణం అతడినెంతో క్రుంగదీసింది (30-1-1847). అతడి రచనల్లో ప్రముఖంగా కానవచ్చే 'Death of a beautiful woman' తాను కోల్పోయిన ప్రియురాళ్ల గురించేనని విమర్శకుల అభిప్రాయం.

అక్టోబరు 3, 1849లో మగతగా ఉన్న స్థితిలో బాల్టిమోర్ హాస్పిటల్‌లో చేర్చబడిన ఎడ్గార్ అల్లన్ పో వాషింగ్‌టన్ మెడికల్ కాలేజిలో అక్టోబర్ 7, 1849 నాడు ఉదయం అయిదు గంటలకు కన్ను మూసినాడు.

# 6. నల్లకాకి

## (The Raven)

ఓ బావురుమనే అర్ధరాత్రి, ఆలోచనల్తో నేను అలిసి బలహీనంగా ఉన్నపుడు
ఎప్పటివో పురాగాథల్ని వింతైనవి, విలక్షణమైనవి చదివి చదివి,
కునికిపాట్లు పడుతూ తలకదిలిస్తున్నపుడు, ఎవరో తలుపు తట్టిన చప్పుడు.
మృదువుగా నా గది తలుపును మొట్టికాయలు వేస్తున్నట్లు, నెడ్తున్నట్లు
నాలో నేను గొణుకున్నాను– 'ఈ సమయంలో ఏ అతిథి – తడ్తున్నాడు తలుపు!'
– ఇంతే, ఇంతకు మించి ఏమీ లేదు.

హే, ఖచ్చితంగా నాకు గుర్తు, అది శీతాకాలం డిసెంబరు మాసం
ప్రతి నిప్పుకణిక పొగచూరి మసి కమ్ముతూ వెలుగు తగ్గి, దయ్యపు నీడలా
నేను రేపు గురించి ఆలోచించాను, ఏదో వేదన, వేదన నుంచి విరామం
అందుకే పుస్తకాలలో తలదూర్చి, 'లెనొరి'ను మరచిపోవాలని ఎలాగోలా
'లెనొరి' నా ప్రియతమురాలు, అందాల 'లెనొరి' దేవదూతలు ఆమెకిడిన నామం
– ఇక ఎప్పటికీ నామరహితం

కదిలీ కదలనట్లుగా ఊదారంగు సిల్కు కర్టెన్లు కదిలినప్పుడల్లా
నాలో ఏదో కంపనం, ఇంతకుముందెన్నడూ అనుభవించని భీభత్స భయం
ఆ భయం గొలిపే ఊహల్తో వణికే గుండెను నిశ్చలపరుస్తూ అనుకున్నాను.
నాలో నేను– 'ఎవరో అతిథి నా గది తలుపు తడుతున్నాడు'
– ఇంతే, ఇంతకు మించి ఏమీలేదు.

ప్రస్తుతానికి నా ఆత్మకు కాస్త ధైర్యం చిక్కింది, ఇంక చేయకుండా ఆలస్యం,
అన్నాను– 'ఆర్యా, అమ్మా, నన్ను క్షమించండి దయచేసి,
నేను మగత నిద్రలో ఉన్నాను, మీరు మృదువుగా తలుపుతడ్తున్నారు.
ఎంత మెల్లగా ఉన్నదంటే ఆ చప్పుడు, వినీ వినబడనంత మెల్లగా, మెల్లగా
నాకేమీ వినబడలేదు సరిగా' – అంటూ తలుపు తెరిచాను విశాలంగా
– అంతా చీకటి, అంతకుమించేమీ లేదు.

ఆ చీకటిలోకి చూసాను తొంగి తొంగి, చాలాసేపు ఆశ్చర్యంగా భయభయంగా
సందేహపడుతూ, ఇంతవరకూ ఏ మానవుడూ కలలు గన సాహసించని కలలు కంటూ
ఆ నిశ్శబ్దమూ భంగపరచబడలేదు, ఆ నిశ్చలత ఏ గుర్తునూ చూపలేదు.
ఒకే ఒక మాట గుసగుసగా వినవచ్చిందక్కడ – 'లెనొరి'!
అదీ నేనన్నదే మెల్లగా. వెనక్కి మరలింది గుసగుసగా– 'లెనొరి'!
–ఇంతే, ఇంతకుమించేమీ లేదు.

నేను గదిలోకి మరలాను, నాలో ఆత్మ జ్వలిస్తూ ఉండగా
మరలా విన్నాను నేను తలుపు తట్టిన చప్పుడు, మరింత బిగ్గరగా
'ఇది ఖచ్చితంగా' – అనుకున్నాను నేను – కిటికీ తలుపు దగ్గర ఖచ్చితంగా
చూద్దాం, ఈ వింత చప్పుడు, దీని కథా కమామీషు, పద చూద్దాం!
కాసేపు బిగబట్టుకుని గుండె, ఈ గొడవ అంతూ పంతూ చూద్దాం!
–బహుశా గాలి కాబోలు, అంతకుమించేమీ లేదు.

కిటికీ తలుపు తెరిచాను, అప్పుడు, రెక్కలు టపటపా కొట్టుకున్న చప్పుడు
రాజసంగా అడుగు పెట్టిందొక నల్లకాకి పాతకాలపు కథల్లోలా
ఎటువంటి పలకరింపులూ లేవు, ఒక్క నిముషం ఆగలేదు.
ఓ ప్రభువులా ఓ రాణిలా కూర్చున్నది నా గది తలుపుపై,
నా గది తలుపుపైన, అమర్చి ఉన్న పల్లాస్ ఎథెనా విగ్రహంపైన
– గూటిలో కూర్చున్నట్లు, అంతకుమించి ఏమీలేదు.

ఆ నల్ల చేపమాను రంగున్న పక్షి నా ముఖంపై తెప్పించింది కాస్త నవ్వు
గంభీరంగా, దృఢంగా ఉన్న దాని ముఖాన్ని చూడగానే నాకు
'నీ శిఖ కత్తిరించబడినా లేకపోయినా, నీవు పిరికిపందవు కావు.
రాత్రి చీకటి తీరాల్లో సంచరించే పురాతన బొంతకాకిలా, భీతిగొలుపుతున్నావు
నిశీధి ప్లూటో గ్రహ తీరాన విహరించే నీ నామధేయమేమిటో!
–నల్లకాకి అన్నది– 'ఎప్పటికీలేదు, Never more'

నేనెంతో ఆశ్చర్యపడినాను, నా మాటల్నది సావధానంగా వినడం
అయితే దాని జవాబు మాత్రం అర్థరహితం, ప్రయోజన శూన్యం
బతికున్నవాడెవడైనా ఏం చేయగలడు ఒప్పుకోక,
తన గది తలుపు మీద ఓ పక్షి ధీమాగా కూర్చున్నాక,
పక్షి లేదా జంతువు, ఆ విగ్రహం మీద తిష్టవేసి కూర్చున్నాక!
–అటువంటి పేరు ఎప్పటికీలేదు, Never more

అయితే ఆ నల్లకాకి ఒంటరిగా ప్రశాంతంగా కూర్చున్నది.
ఆ విగ్రహంపై, మాట్లాడింది ఒకే ఒక్క మాట, ఆత్మను నింపి మరీ
ఆ తరువాత మాట్లాడలేదు ఒక్కమాట, కదపలేదు ఒక్క ఈక
నేను గొణిగాను– 'ఇంతకు ముందూ మిత్రులు వచ్చారు ఎగిరిపోయారు
రేపు ఇతడూ వెళ్లిపోతాడు, ఇదివరకు ఎగిరిపోయిన నా ఆశలలానే.
–అప్పుడా పక్షి అన్నది– 'ఎప్పటికీ లేదు - Never more'

అంత ఖచ్చితంగా నిశ్చలత్వాన్ని పగలగొడ్తూ అన్న మాటకు ఉలిక్కిపడ్డాను
సందేహం లేదు అన్నాను నేను – ఇది పలికిన ప్రతి పలుకూ,
ఇతడి పాత యజమాని ఏదో దయలేని కష్టంలో నేర్పి ఉంటాడు.
ఈ ఒక్క మాట, అతడి కష్టాలన్నీ కలిపి ఒకటే మాట, ఒకటే ఒకటి
ఆశల దుఃఖగీతాలు, విషాదపు భారాలన్నింటినీ కలిపి ఈ ఒక్కమాట.
– ఎప్పటికీ లేదు, Never more

ఆ నల్లకాకి మొత్తానికి నా దుఃఖిత ఆత్మను నవ్వుతో నింపింది.
నేను మెత్తటి కుర్చీని, ఆ విగ్రహం, కాకి ముందుకు తోసాను.
ఆ వెల్వెట్ మెత్తపై కూర్చుని, ఊహలకు ఊహలు తొడుగుతూ
ఈ పురాకాలపు శకున పక్షిని ప్రాక్కథలకు కలుపుతూ
ఈ వికారపు లాభరహిత, దెయ్యపు, బక్కచిక్కిన ప్రాక్కథల శకున పక్షి,
–మాటకు అర్థమేమని 'ఎప్పటికీ లేదు, Never more'

అలా ఊహిస్తూ కూర్చున్నాను, కాని నోట మాట రాలేదు.
అగ్నిలా జ్వలిస్తున్న ఆ పక్షి కళ్లు, నా రొమ్ములోకి చొచ్చుకుపోగా
నేనలా దివ్యలోకాల్ని ఊహిస్తున్నాను, నింపాదిగా పడుకుని
మెత్తటి వెల్వెట్ మెత్తపై కూర్చుని, దీపపు కాంతి ఆనందపడగా
ఎవరి మెత్తటి వెల్వెట్ మెత్తపై కూర్చుని, దీపపు కాంతితో ఆనందపడుతూ
–ఆమె అనేది– 'హే, ఎప్పటికీ లేదు, Never more.

అప్పుడు, నేననుకున్నాను– గాలి చిక్కబడింది, ఏదో పరిమళం
కనిపించనిది, సెరాఫిమ్ దేవదూత ఈ తివాచీ పరచిన నేలపై నడుస్తూ
'దౌర్భాగ్యుడా' – అరిచాను నేను– 'నీ దేవుడు పంపించాడు దేవదూతలను
ఆగు, ఆగి మరచిపో 'లెనొరి' జ్ఞాపకాలను,
తాగు, తాగి ఈ నెపెంధి మత్తుపానీయాన్ని మరచిపో 'లెనొరి'ని
– నల్లకాకి అన్నది– 'ఎప్పటికీ లేదు, Never more.

'ప్రవక్తా!' అన్నాన్నేను– 'దుష్టపక్షీ' – ప్రవక్తవే పక్షివైనా, డెవిల్‌వైనా,
నిన్ను టెంప్టర్ సాతాను పంపినా, లేక తుఫాను నిన్నిటు నెట్టినా,
ఒంటరిగా ఉన్నా, ఏ మాత్రం వణుకులేక, ఈ మాంత్రిక ఎడారిలో
భయం నడయాడే ఈ ఇంటిలో, వేడుకుంటున్నా, నిజం చెప్పు
ఉన్నదా, గిరియాడ్ గుట్టల్లో నెప్పి తగ్గే లేపనం, ఉన్నదా, ఉన్నదా, చెప్పు
– నల్లకాకి అన్నది– 'ఎప్పటికీ లేదు, Never more'

'ప్రవక్తా' –అన్నాన్నేను– దుష్టపక్షీ! ప్రవక్తవే పక్షివైనా, డెవిల్‌వైనా,
మనపైన వంగే నింగి, మనిద్దరం నమ్మే దేవుడు, సాక్షిగా
ఈ దుఃఖం నిండిన ఆత్మకు, సుదూరపు ఈడెన్ వాసి
ఆ సాధు కన్యను పట్టుకోగలుగుతుందా, దేవదూతలు, మెచ్చిన 'లెనొరి'ని
పట్టుకోగలుగుతుందా చక్కని ప్రకాశవంతమైన 'లెనొరి'ని.
– నల్లకాకి అన్నది– 'ఎప్పటికీ లేదు, Never more'

ఆ మాట మన వీడ్కోలు మాట కావాలి' – పక్షివా, రాక్షసివా?
పో, బయట తుఫానులోకి, లేదా రాత్రి ప్లుటోనియన్ తీరానికి
ఒక్క నల్ల ఈక కూడ వదలొద్దు నీవిక్కడున్నట్లు గుర్తుగా
నా ఒంటరితనానికి నన్ను వదిలేయి, నా తలుపుపై విగ్రహాన్ని వదిలేయి
నా గుండెలోంచి నీ ముక్కును తీసివేయి, నీ ఆకారాన్ని, తలుపు మీంచి తీసివేయి.
– నల్లకాకి అన్నది– 'ఎప్పటికీ లేదు, Never more'.

ఆ కాకి, ఏ మాత్రం తొణకలేదు, కదల్లేదు, కూర్చునే ఉన్నది, కూర్చునే ఉన్నది.
తెల్లటి పల్లాస్ ఎథెనా విగ్రహంపై, నా గది తలుపు పైన
ఆ కళ్లు తలపిస్తున్నాయి కలలుగంటున్న దయ్యపు కళ్లలా
దాని మీద పడ్తున్న దీపపు కాంతి పరచుకున్నది నేలపై నీడలా
నేలమీద తేలియాడ్తున్న నీడలోనున్న నా ఆత్మ ప్రయత్నిస్తున్నది
– బయటపడ్తుందా– ఎప్పటికీ లేదు, Never more.

✧✧✧✧✧

---

జనవరి 1845లో ప్రచురింపబడిన ఈ కవిత దానిలోని అంతర్లీనంగా ఉన్న సంగీతపు ఝరికి మార్మికమైన వాతావరణానికి, ప్రేమికుడి ఉద్వేగాన్ని మనసును వెంటాడే రీతిలో వర్ణిస్తుంది.

Never more (ఎప్పటికీ లేదు) అనే పదం మరల మరల వస్తూ కవితలోని విషాద వాతావరణాన్ని మరింత ఎక్కువ చేస్తుంటుంది.

ఛార్లెస్ డికెన్స్ వ్రాసిన Barnaby Rudge నవలలోని Raven ప్రేరణగా, ఎలిజబెత్ బారెట్ కవిత Lady Geraldine's Courtship లోని శైలి, లయను అనుసరిస్తూ వ్రాసినట్లు Edgar Allan Poe తన The Philosophy of Composition (1846) వ్యాసంలో పేర్కొన్నాడు.

ఉత్ప్రేక్ష, నీతిబోధలు లేకుండా, ప్రేమను మరచిపోవడానికి, మరచిపోకుండా ఉండడానికి చేసే ప్రయత్నం ఈ కవితలో కనిపిస్తుంది.

గ్రీకు, రోమన్ సంప్రదాయ కవిత్వంలోని Elegiac Paraclaustithyron - తన ప్రియురాలిని కలవలేక, ఇంటిబయట వేచి దుఃఖిస్తూ పాడే శోకగీతం లాంటి కవితగా– The Raven ను Christopher F.S. Maligec పేర్కొన్నాడు.

Pluto - Roman God of underworld

Tempter - Satan (సాతాన్)

Raven (Norse Mythology - Huginn, Muninn - ఆలోచన – జ్ఞాపకం – రెండు బొంతకాకులు).

నోవా పంపిన తెల్లకాకి వరద తగ్గుముఖం పట్టిందో లేదో చూడడానికి వెళ్లి, తిరిగి రావడానికి ఆలస్యం చేస్తుంది. అందుకే అది నల్లకాకిగా, చచ్చిన వాటిని తినే Carrion పక్షిగా శపించబడినది.

Nepenthe - నెపెంథ్ – Homer's Odyssey లో – జ్ఞాపకాలను తుడిచిపెట్టే ముందు,

Balm of Gilead - గిలియాడ్‌లో దొరికే లేపనం, మందు

Aidenn - Garden of Eden - ఈడెన్ వనం.



# డాంటీ గాబ్రియేల్ రొజెట్టి

**(Dante Rossetti 1828-1882)**

డాంటీ గాబ్రియెల్ రొజెట్టి (12-5-1828 to 9-4-1882) ఇంగ్లీషు కవి, చిత్రకారుడు, అనువాదకుడు, Pre Raphaelite Brotherhood ను 1848లో William Holman Hunt and John Everelt Millais తో కలిసి స్థాపించినాడు. ఆ విధంగా తరువాతి తరం వారైన William Morris, Edward Burne - Jones లాంటి వారికి, యూరొపియన్ Symbolist లకు ప్రేరణగా నిలిచి Aesthetic Movement కు బీజం వేసినవాడైనాడు.

తన కవితలకు చిత్రాలు వేసి తన చిత్రాలకు కవితలు, సానెట్లు వ్రాసినాడు. తన సోదరి Christina Rossetti రచన Goblin Market కు బొమ్మలు వేసినాడు. అతడి సోదరుడు William Nichael Rossetti విమర్శకుడు. ఇంకో సోదరి Maria Francesca Rossetti రచయిత్రి.

క్లోరాల్ హైడ్రేట్‌కు, ఆల్కహాల్‌కు బానిసగా మారడం, కవిత్వం విమర్శకుల మెప్పును పొందకపోవడం అతడిని కృంగదీసినాయి. 1872లో మానసికంగా అస్వస్థుడైనాడు. మూత్రపిండాలు పాడైపోగా Bright's disease తో 1882లో ఈస్టర్ ఆదివారం నాడు (9-4-1882) కన్నుమూసినాడు.

The Blessed Damozel 1850లో ప్రచురింపబడింది. రెండుసార్లు సరిదిద్దబడి 1856, 1870, 1873లో ప్రచురింపబడింది. Edgar Allan Poe వ్రాసిన 'The Raven' కవితలో తన ప్రియురాలు చనిపోగా దుఃఖిస్తున్న ప్రియుడి వృత్తాంతం ఉండగా; దానికి విరుద్ధంగా The Blessed Damozel లో స్వర్గంలో ఉన్న ప్రియురాలు తన ప్రియుడి కోసం పడుతున్న తపన వర్ణించబడింది.

# 7. ఆశీర్వదింపబడిన యువతి

## (The Blessed Damozel)

ఆశీర్వదింపబడిన ఆ యువతి చూసింది
స్వర్గలోకపు స్వర్ణద్వారము నుంచి
సాయం సమయపు చలించని నీటి కన్నా
ఆమె కనుల లోతు మరింత లోతైనది
ఆమె హస్తాన అందాల లిల్లీ పూలు మూడు
ఆమె శిరోజాలపై మెరిసేను తారలు ఏడు.

ఆమె వస్త్రం జాలువారెను మెడనుంచి అంచువరకు
అలంకరించుకోలేదామె ఏ కృత్రిమ సరుకు,
మేరీ కానుక ఇచ్చిన తెల్ల గులాబి మినహా
ఆమె చేసిన సేవలకది సరైన కానుక
జాలువారెడి ఆ శిరోజాలు ఆమె తల వెనక
పక్వపు మొక్కజొన్నల పసిడి పసుపు, ఆహా!

దేవుని చెంత గానమాలపించునామె
ప్రతిరోజూ క్రమం తప్పక కనుపించు రూపమే
ఆమె వదనంలోని అద్భుతమింకా వాడిపోలేదు
అలా చెబుతున్నదా నిశ్చలమైన చూపు
అయినప్పటికీ వాటిని విడిచిపెట్టినదేమొ,
దాదాపు పదేళ్ల నుంచి ఎందుకో, ఏమో?

(ఒకరికి, అది పదేళ్లు, ఏళ్లు కావచ్చును
....అయినా ఇప్పుడు, ఇచ్చోట
ఆమె నావేపు ఒరిగినప్పుడు,
ఆమె శిరోజాలు నా వదనాన్ని కమ్ముకుని...
ఆకురాలు కాలపు ఆకులలా
దశాబ్ది గడచిపోయింది వేగంగా,)

అది దేవుడి గృహపు కోటగోడ
ఆమె నిలబడినది దానిపై
దేవుడు నిర్మించాడు ఎంతో లోతుగా
అక్కడ మొదలగును అంతరిక్షపు జాడ
ఎంత ఎత్తున అంటే, అక్కడి నుంచీ చూస్తే
స్పష్టంగా కనబడదు సూర్యుడు కూడా!

అది ఉన్నది దివ్యలోకంలో, ఈథర్
వరదకు అడ్డంగా, ఓ వంతెనలా
దిగువన, పగలూ, రాత్రుళ్ల అలలు
జ్వాలల, చీకట్ల అంచులు
భూమి ఉన్నంత దిగువగా, శూన్యం
పరిభ్రమిస్తుంది భయం గొలిపే మరుగుజ్జులా!

ఆమె చుట్టూరా, ప్రేమికులు, కొత్తగా కలిసినవారు
మరణం లేని ప్రేమకు చెందినవారు.
తమలో తాము మాట్లాడుకుంటున్నారు
వారి హృదయాలు గుర్తుకు తెచ్చుకుంటున్న పేర్లు,
దేవుని వేపు పయనిస్తున్న ఆత్మలు
ఆమెను దాటిపోతున్న సన్నని జ్వాలలు.

ఆమె ఇంకా వంగి చూస్తున్నది దిగువకు
చుట్టూ ఉన్న మోహన వలయానికి ఆవలకు,
ఆమె ఛాతీ గట్టిగా ఒత్తుకోగా
అడ్డుగా ఉన్న కమ్మీ వెచ్చబడేంత వరకూ;
ఆమె చేతిలో ఉన్న లిల్లీ పుష్పాలు
నిద్రపోతున్నట్లున్నాయి ఆమె వంగిన చేతులలో

స్వర్గపు స్థిర స్థావరం నుంచి చూసిందామె
కాలం భీకరంగా కంపిస్తూ ప్రచోదించడానిని

అన్ని ప్రపంచాల గుండా; ఆమె తీక్షణ దృక్కులు
అగాధాన్ని దాటి, అక్కడి బాటను దూసుకుని
పోగా, ఆమె ఇప్పుడు మాట్లాడినది,
తారలు తమ గోళాల్లో గానం చేస్తున్నపుడు.

సూర్యుడు నిష్క్రమించినాడు, నెలవంక
చిన్ని ఈకలా రెపరెపలాడుతున్నది
అగాధంలో సుదూరంగా, ఇప్పుడు ఆమె
మాట్లాడినది నిస్తబ్ద వాతావరణంలో
ఆమె గొంతు నక్షత్ర స్వరంలా వినిపించింది
తారలన్నీ కలిసి గానం చేసిన విధంలా

(ఆహా, ఎంత మధురం! ఇప్పటికీ ఆ కోయిల
గానంలో ఆమె ఉచ్చారణ స్పష్టమే,
వినాలి తన్మయత్వాన? ఆ గంటలు ఎప్పుడైతే
మధ్యాహ్నపు గాలిని వశం చేసుకున్నాయో
ఆమె అడుగులు నావేపు వచ్చేందుకు ప్రయత్నించలేదా
ఆ ప్రతిధ్వనించే మెట్లమీదుగా దిగువకు?)
"నేననుకున్నాను అతడు నా వద్దకు వస్తాడని;
అతడు తప్పక వస్తాడు" -అన్నదామె.
నేను ప్రార్థించలేదా స్వర్గంలో? - నేలపై,
ప్రభూ, ప్రభూ, అతడూ ప్రార్థించినాడుగా?
ఈ రెండు ప్రార్థనలూ సరైన శక్తి కలిగినవేగా!
నేను భయపడడమెందుకు?

అతడి శిరస్సు చుట్టూ స్వర్ణవలయం
అతడు ధరించినాడు శ్వేతవస్త్రం
అతడి చేతిని పట్టుకుని వెళ్తాను నేను
లోతైన కాంతి బావులలోకి

ఒక ప్రవాహంలా మేము దిగి వెళ్తాము
దేవుని దృక్కులలో స్నానం చేసి పునీతులమౌతాము.

మేమిరువురం నిలబడతాము ఆ పూజాగృహం పక్కన
మార్మికమై, నిషేధించబడి, ఎవరూ నడవని ప్రదేశం
దాని దీపాలు సర్వదా కదుల్తూనే ఉన్నాయి
ప్రార్థనలు దేవుడి వేపు వెళ్తున్నాయి
మా పాత ప్రార్థనలను చూడు, అనుగ్రహించు,
అన్నీ చిన్ని మబ్బుల్లా కరిగిపోతున్నాయి.

మేమిద్దరం శయనిస్తాం అక్కడున్న
మార్మిక వృక్షపు నీడలో
దానిలోని రహస్యాన్ని, వృద్ధిని
స్పృశిస్తుంది పావురం
దాని ఈకలు తాకిన ప్రతి ఆకూ
చెబుతాయి అతడి పేరు వినబడేట్లు.
నేను స్వయంగా బోధిస్తాను,
నేనూ అలాగే శయనించి,
నేను ఇక్కడ పాడే పాటలు, వీటిలో
అతడి స్వరం నెమ్మదిగా, మెత్తగా
ఆగిన ప్రతిసారీ కొత్త విషయమేదో,
జ్ఞానమేదో కనిపించి అబ్బుర పరుస్తుంది.

(అయ్యో! మేమిద్దరం, మేమిద్దరం, నీవంటావు!
అవును, ఒకరు నీవేగా– నాతో ఉన్నది
ఆనాడు పాతకాలం, అయినా దేవుడు
దానిని అనంత ఏకత్వంలోకి మారుస్తాడు,
నీ ఆత్మను సరిపోలిన ఆత్మ
దాని ప్రేమ యావత్తూ నీదే కదా!)

‘మనమిద్దరం’ – అన్నదామె – వెదుకుదాం
మేరీమాత ఉండే వనాలను
అక్కడ ఉంటారామె చెలికత్తెలు అయిదుగురు
అయిదు సుమధుర సంగీత రూపకాలు
సెసిలి, గెర్ట్రాడ్, మాగ్ధలిని,
మార్గరేట్, రోజాలిన్.

వలయంగా కూర్చుని ఉంటారు వాళ్లు
వారి నుదుట పూలదండలు
శ్వేతాగ్ని జ్వాలల్లాంటి వస్త్రాలు
స్వర్ణదారాలను నేస్తుంటారు వాళ్లు
చిన్న చిన్న వస్త్రాలను సరిగా సరిపోయేలా
అప్పుడే పుట్టిన వారికి, ఇంతకు ముందు మరణించి;

“అతడు భయపడతాడు, మూగగా ఉంటాడు
అప్పుడు నేను నా చెక్కిలిని అతడి చెక్కిలికి
ఆన్చి, మా ప్రేమ గురించి చెబుతాను,
మేమెన్నడూ సిగ్గుపడనిది, బలహీన పడనిది;
మేరీమాత అంగీకారాన్ని తెలుపుతుంది
నేను గర్వించేదానిని, నన్ను మాట్లాడనిస్తుంది.

“ఆమె స్వయంగా తీసుకువస్తుంది, చేతిలో చేయి వేసి
అతడి చుట్టూరా అన్ని ఆత్మలూ, మోకాళ్లపై
కూర్చుని నమస్కరిస్తాయి, అసంఖ్యాక శిరస్సులు
ఆ శిరస్సుల చుట్టూరా స్వర్ణ వలయాలు
మమ్మల్ని కలవడానికి వచ్చిన దేవదూతలు
గానం చేస్తారు సిథర్న్ సిటొలీ సితారలను

అక్కడ నేను క్రీస్తు ప్రభువు నడుగుతాను
ఇది చాలు నాకూ, అతడికని

నేలపై నివసించినట్లే ఇక్కడా
ప్రేమతో, ప్రేమలో
అప్పుడు, ఆ తర్వాత, శాశ్వతంగా
కలిసి, నేనూ, అతడూ...”–

ఆమె చూసింది, విన్నది, ఆనక ఇలా అన్నది
మృదువుగా, తగ్గిన దుఃఖపు సంభాషణతో
–“ఇదంతా అతడు వచ్చిన తరువాత’ –ఆమె ఆగినది.
కాంతి ఆమె వేపు తుళ్లిపడుతూ వచ్చినది
దేవదూతలతో నిండిన కాంతి విమానంగా,
ఆమె కనులు ప్రార్థించాయి, చిరునవ్వు నవ్వినదామె.

(నేను చూసానామె చిరునవ్వును) అయితే వెంటనే
వారి దారి సుదూర గ్రహాలవేపుగా అస్పష్టమైనది
అప్పుడామె తన చేతులను వేసినది
బంగరు అడ్డుకమ్మీలపైన
తన అందమైన వదనాన్ని చేతుల మధ్య ఉంచి
దుఃఖించినది (నేను విన్నాను ఆమె కన్నీళ్లను).

✧✧✧✧✧

---

The Blessed Damozel (The blessed damsel - ఆశీర్వదింపబడిన కన్య – డాంటీ గాబ్రియేల్ రోజెట్టి కవితలలో ప్రసిద్ధికెక్కినది. 1850లో Pre Raphelite Journal The Germ లో తొలిసారిగా ప్రచురింపబడింది.

Edgar Allan Poe 1845లో వ్రాసిన The Raven కవితకు సమాధానంలా ఈ కవిత కడురమ్యంగా సాగుతుంది.

Claude Debussy వ్రాసిన La damoiselle elue (1888) కవితకు– 'The Blessed Danmozel" ఆధారం.

కవిత, చిత్రం రెంటినీ ఓ జంటగా ‘రొజెట్టి’ కవిత్వీకరించి, చిత్రంగా మలిచినాడు. గ్రాన్‌విలె బాంట్‌కాక్, ఎడ్గార్ బైంటన్, ఎర్నెస్ట్ ఫర్రార్, జూలియస్ హారిసన్, టాంగెరిన్ డ్రీమ్ మ్యూజిక్ గ్రూప్ లాంటి ఎందరో సంగీతకారులు ఈ కవితకు సంగీతాన్ని సమకూర్చి చక్కని పాటగా గానం చేసినారు.



# క్రిస్టినా రొజెట్టి

## (Christina Rossetti 1830-1894)

క్రిస్టినా జార్జినా రోజెట్టి (5-12-1830 to 29-12-1894) ఆంగ్ల కవయిత్రి. అనేక రొమాంటిక్, భక్తి, పిల్లల పాటలను కవితలను రచించి ప్రసిద్ధి కెక్కినది.

ఆమె Goblin Market కవితాసంకలనం, క్రిస్టమస్ కారల్ పాట In the bleak midwinter ఎంతగానో ప్రాచుర్యం పొందినాయి.

1862లో ప్రచురింపబడిన The Goblin Market and Other Poems అనేకమంది విమర్శకుల, Hopkins, Swineburne, Tennyson లాంటి కవుల ప్రశంసలనందుకున్నది. ఎలిజబెత్ బారెట్‌చే బ్రౌనింగ్‌కు వారసురాలిగా కీర్తింపబడింది.

బానిసత్వానికి, జంతుహింసకు, జంతువులపై ప్రయోగాలను వ్యతిరేకించినది.

The Convent Threshold కవితలో కవయిత్రికి క్రిస్టియానిటిపై ఉన్న సందేహాలు, నమ్మకాల మధ్య ఉన్న ఘర్షణ, వైరుధ్యాలు వర్ణించబడినాయి.

When I am dead, my dearest, sing no sad songs for me
Plant thou no roses at my head, nor shady cypress tree
Be the green grass above me, with showers and drops wet
And if thou wilt, remember, And if thou wilt, forget

I shall not see the shadows, I shall not feel the rain
I shall not hear the nightingale, sing on as if in pain
And dreaming through the twilight, That doth not rise nor set
Haply may remember, and haply may forget.

# 8. కాన్వెంట్ గుమ్మం

## (The Convent Threshold)

ప్రియతమా! రక్తం అడ్డుగా ఉన్నది మనిద్దరి మధ్య,
తండ్రి రక్తం, సోదరుడి రక్తం!
ఈ రక్తపు సరిహద్దును నేను దాటలేను.
ఎగువకు పోయే మెట్లను ఎన్నుకున్నాను నేను.
మెట్ల తరువాత మెట్లు స్వర్ణకాంతుల నింగి వేపు
పట్టణానికి, అద్దాల సముద్రానికి.
నా లిల్లీ పాదాలు బురదతో నిండి ఉన్నాయి–
ఆ ఎర్రటి బురద ఏదో కథ చెప్పాలనుకుంటున్నది.
ఆశతో కూడినదో, అపరాధ భావనతో కూడినదో
ఇంకా అందుబాటులో లేని ప్రేమ గురించి
అయ్యో! నా హృదయమా, నా హృదయాన్ని
బహిర్గతపరచగలిగితే, ఈ మచ్చ అక్కడే కనిపిస్తుంది.
నేను గాజు సముద్రం, అగ్నికై వెదుకుతున్నాను.
ఆ ప్రదేశాన్ని కడిగి, ఆ ఉచ్చును తగలబెడ్తాను,
అహో, మెట్లుంటే పైకెక్కేందుకు కదా,
నాతో అధిరోహించు; ఎక్కు అగ్గిరాజేసిన మెట్లను.

నీ కనులు నేలవేపు చూస్తున్నవి, నావి స్వర్గం వేపు
సుదూరపు అద్భుత నగరాన్ని చూస్తున్నాను నేను
కొండల కావల ఓ జలప్రదేశం
అగాధానికావల మెరుస్తున్న ప్రాంతం
రాజభవనాలు, అక్కడ సత్ప్రవర్తకులు విందారగిస్తున్నారు
మనోహరమైన వృక్షాల కింద శయనిస్తారు.
లేదా మేలుకుని లయతో కూడిన గీతాన్ని గానం చేస్తారు.
అక్కడ ఛెరుబిమ్, సెరాఫిమ్ దేవదూతలతో కూడి,

వారి మెడలో శిలువ, వారు కప్పులలో తాగి ఖాళీ చేస్తున్నారు.
అరలలో ఉంచి, వేల్చబడి, అణచబడి, మెలిదిప్పబడి అంగాంగాలూ
ప్రపంచం వెలివేయబడిన వాళ్లు
నక్షత్రాల అంతరిక్షపు స్వర్గం విప్పబడింది
వారి వదనాల ముందున్న సూర్యుడు మసకబారినాడు.

నీవు నేలవేపు చూస్తున్నావు, ఏమిటి చూస్తున్నావు?
పాలలా తెల్లగా, లతల మధ్య ద్రాక్షతీగెల్లా ఎర్రబడి మెరుస్తూ,
పైకి కిందకు గంతులు వేస్తూ, ముందుకు వెనక్కి,
ఎంతో సంతోషంగా, ఎంతో నిండుగా, మధువుతో మరింత బలంగా,
మంచు ముత్యాల అలంకరణతో విరిసిన పీచ్ పండ్లలా,
వాటి స్వర్ణశిరోజాలు తేలియాడుతుండగా,
ప్రేమ సంగీతం వారి గొంతుల్లో పల్లవిస్తుండగా,
యువతీ యువకులు వచ్చిపోతున్నారు.

నీవు కాలయాపన చేస్తున్నావు, కాలమున్నది అతి స్వల్పం.
నీ జీవితం కోసం పారిపో, ధైర్యాన్ని కూడగట్టుకో పారిపోవడానికి
నీడలు పొడుగ్గా విస్తరించి ఉన్నాయి, పగలు పెరుగుతున్నది,
రాత్రి దగ్గరకు వస్తున్నది.
కొండల్లోకి పారిపో, ఆలస్యం చేయకు,
ఇది చిరునవ్వులకు, నిట్టూర్పులకు సమయమా?
రహస్య వృక్షాల మధ్య పాటలకోసం
ఎక్కడైతే అకస్మాత్తుగా నీలిపిట్టలు గూళ్లు కట్టి ఆడుకుంటున్నాయో?
కాలం స్వల్పం, నీవిక్కడే ఉంటావన్నమాట
ఈరోజు, అలా పిలువబడే ఈ రోజున
మోకాళ్లపై వంగు, మల్లయుద్ధం చేయి, కొట్టు, హింసించు, ప్రార్థించు
ఈ రోజు స్వల్పం, రేపు లేదు
ఎందుకు చనిపోతున్నావు? ఎందుకు చనిపోతున్నావు?

నీవు నాతో కలిసి మధురమైన పాపాన్ని చేసినావు
నాతో కలిసి పశ్చాత్తాపపడు, నేను పశ్చాత్తాపపడుతున్నాను.
నేను నేర్చుకున్న గాధల్ని మరచిపోవాల్సిన బాధ నాది,
మనం వెళ్లిన తేలికదారి పెడుతున్న బాధ నాది
నేను తిరిగి వచ్చేప్పుడు ఎంత కఠినంగా ఉందో!
నాకు నిద్ర పట్టేందుకు ఎంతకాలం పడుతుందో,
ఎలా ఈ రాత్రింబవళ్లను గడపాలో,
ఖచ్చితంగా, దేవదూతలు శుద్ధంగా అరుస్తారు,
ఆమె ప్రార్థిస్తుంది, తన ఆత్మను కన్నీళ్లతో కడుగుతుంది.
ఎంతకాలమని ఏళ్లకేళ్లు కాలమిలా సాగదీయబడుతుంది?

నేను నా బుగ్గలను, కళ్లను నీవేపు నుంచి మరలుస్తాను
నా శిరోజాలను నీవిక చూడలేవు.
అయ్యో, ఆ వెళ్లిపోయిన ఆనందాన్ని కూడా,
నా పెదవులు మాత్రమే నీవేపు తిరిగి ఉన్నాయి.
నా నీలిపెదాలు దుఃఖిస్తున్నాయి, పశ్చాత్తాపపడు?
ఓ అలసిన జీవితమా, ఓ అలిసిన లెంట్ ఉపవాస కాలమా!
తారలు తక్కువగా ఉండే అలసిన కాలమా!

నేనెలా స్వర్గంలో విశ్రాంతి తీసుకోను,
లేదా స్వర్గపు మెట్లపై ఒంటరిగా కూర్చోగలను?
సాధువులు, దేవదూతలు ప్రేమ గురించి పలికితే
నేను నా సింహాసనం మీద నుంచి జవాబు ఇవ్వవద్దా.
నాపై జాలి చూపించండి, నా స్నేహితులారా!
నేను ఆ ధ్వనులను విన్నాను కదా,
ఎదురుచూస్తున్న కనులతో నేనటు తిరిగి చూడవద్దా,
బాధాకరమైన కేకలతో నేలవేపు తిరగవద్దా?
నన్ను స్వర్గంలో ఈ కేక నుంచి రక్షించు!

మనం ఇచ్చిపుచ్చుకున్న బహుమతులన్నీ ఏమైనాయి?
పశ్చాత్తాపపడు, పశ్చాత్తాపపడు, క్షమింపబడతావు,
ఈ జీవితం దీర్ఘమైనదే, అయినా ముగింపు ఉన్నది.
పశ్చాత్తాపపడు, నీ ఆత్మను ప్రక్షాళన చేయి, రక్షించు.
ఇంతకంటే సంతోషకరమైన పాటను ఉదయనక్షత్రాలు
వాటి పుట్టిన రోజున పాడలేవు; దేవదూతలు ఎవరైనా
పశ్చాత్తాపపడుతున్నపుడు గానం చేసే పాటలకన్నా.

నేను రాత్రేమి కలగన్నానో నీకు చెబుతాను.
రూపు మారిన వదనమున్న ఆత్మ ఒకటి
అగ్ని పాదాలతో ఆక్రమించుకున్నదొక ప్రదేశాన్ని,
నేను విన్నానతడి వందల ఈకల శబ్దాన్ని
స్వర్గపు ఘంటికల ఆనందపు రవాల్ని.
స్వర్గపు గాలులు పరిమళాలతో వ్యాపించి ఉన్నవి.
వాటి వేగవంతమైన రథాలపై ప్రపంచాలు భ్రమిస్తున్నవి.
అతడధిరోహించాడు అరుస్తూ- నాకు వెలుగునివ్వండి’-
నిశ్చల కాంతి అతడిపై ప్రవహించింది, మరింత కాంతి
దేవదూతలు, ప్రధాన దేవదూతల్ని దాటిపోయినాడు అతడు.
ఆ దీర్ఘ రాత్రిలో మరింత ప్రకాశించినాడు
ఛెరుబిమ్‌ల అంగీలతో నడుస్తూ
            మరింత కాంతినిమ్మని అరిచినాడు, తడిచినాడు
దాహంతో నిండిన అతడి వదనం సముద్రాన్ని తాగింది.
దాహం తీరి, మరల దాహం, అంతులేదు అలా
నేనతడిని చూసాను, జ్ఞానాన్ని తాగినాడతడు
విల్లులా వంగిన కనుబొమలు, స్వర్ణకిరీటాలు
గిట్టలతో తొక్కబడిన సర్పాల్లా అతడి ముంగురులు
అతడు తన సింహాసనాన్ని వదిలి మోకాళ్లపై కూలబడినాడు.
సెరాఫ్ దేవదూతల పాదాల ధూళిని నాలుకతో స్పృశించినాడు,

తూచబడిన జ్ఞానమేమిటది?
జ్ఞానము శక్తివంతమే, ప్రేమ మరింత మధురమైనది.
అతడు చేసిన అభివృద్ధి అంతా,
తాను చేసినదంతా తక్కువేనని, తెలుసుకోవడం
ప్రేమ మినహా, ఎందుకంటే అన్నిటిలో ఉన్నది ప్రేమ

నేను చెబుతాను నేను రాత్రి ఏమి కలగన్నానో
అది చీకటి కాదు, అది వెలుగూ కాదు.
నా పుష్కలమైన శిరోజాలను తడిపింది శీతల మంచు.
మట్టి గుండా వచ్చి నీవు నన్ను వెదికినావు.
వచ్చి అడిగినావు– 'నీవు నన్ను కలగంటున్నావా?'
నా హృదయం ధూళిలా నీవేపు గంతులు వేసేది.
నేను సగం నిద్రలో సమాధానమిచ్చాను.
'నా దిండు తడిచినది, దుప్పట్లు ఎర్రబడినాయి,
నా మంచంపై సీసపు పరీక్షా పరికరమున్నది.
నిన్ను వెచ్చటి సహచరునిగా ఉంచుకుంటుంది
నీ తలకొక్క వెచ్చని దిండుగా
నా ప్రేమకన్నా కరుణగల ప్రేమగా"
నీ చేతుల్ని మెలిదిప్పు, నేను సీసంలా
తొక్కివేయబడడానికి ఇష్టపడతాను మట్టి బురదగుండా,
నీవు నీ చేతుల్ని తుడిచినావు, ఆనందంతో కాదు
తూలి నడిచినావు, ద్రాక్షరసంతో మత్తెక్కి కాదు.

రాత్రంతా నీ గురించే కలగన్నాను.
నిద్రలేచి నా ఇచ్చకు వ్యతిరేకంగా ప్రార్థించాను.
మరల నిద్రపోయాను నిన్ను కలగంటూ,
చాలాసేపటికి లేచి, మోకాళ్లపై కూర్చుని ప్రార్థించాను.
నేను చెప్పిన మాటలను లిఖించలేను.

నా మాటలు నెమ్మదైనవి, నా కన్నీళ్లు అతి స్వల్పమైనవి.
చీకటిగుండా నా మౌనం పిడుగులా పలికినది.
తెల్లవారినపుడు, నా ముఖం కుంచించుకుని ఉన్నది.
నా జుట్టు తెల్లబడినది. రక్తం గడ్డకట్టినది,
నేను తన్నులాడుకుంటూ అలానే పడి ఉన్నాను.

ఇప్పుడు నన్ను చూస్తే నీవనవచ్చు
నేను ఇన్నాళ్లూ ప్రేమించిన ముఖమేది?
నేను సమాధానమిస్తాను, ఎప్పుడు పోయింది.
స్వర్గంలో మేలిముసుగుతో అది ఆలశ్యం చేస్తుంది.
ఎప్పుడైతే ఉదయ నక్షత్రం పైకి లేస్తుందో,
నీడతో ఉన్న భూమి పలాయనం చేస్తుందో,
మనం తలుపు దగ్గర ఉంటాం సురక్షితంగా,
నీవప్పుడు మేలిముసుగును తీసివేయవచ్చు
పైకిచూడు మేలుకో, ఎందుకంటే పైన, సుదూరంగా
మన దివ్యవృక్షాలు పెరిగి ఉన్నాయి. మన ప్రదేశం
ఉన్నది సిద్ధంగా, అక్కడ మనం కలుద్దాం ఒకప్పుడు
కలిసి ఉన్నట్లు, ప్రేమించుకుందాం ఆనాటి సుపరిచిత ప్రేమతో.

✧✧✧✧✧

---

క్రైస్తవ మార్గంలో ముక్తిని సాధించే విషయాన్ని క్రిస్టినా రొజెట్టి ఈ కవితలో కడు రమ్యంగా వర్ణించింది.

The Convent Threshold is live a graceful wild beast protected from fanatics of all kinds and reminding us all of a style of literature that remained viable for long amidst the changes that brought about the world we know...

ఐహిక బంధాలను, రక్తసంబంధాలను త్యజించి ఆ గుమ్మాన్నిదాటి – an old familiar love - చిరపరిచితమైన ప్రేమ – ను చేరుకుని భగవానునిలో ఐక్యం కావడం ఈ కవితలోని సారాంశం.



# ఎమిలి డికెన్‌సన్

**(Emily Dickinson 1830-1886)**

ఎమిలి ఎలిజబెత్ డికిన్‌సన్ (10–12–1830 to 16–5–1886) అమెరికన్ కవయిత్రి; Amherst, Massachusetts లో జన్మించినా జీవిత కాలమంతా అంతర్ముఖిగా కాలం గడిపినదామె. లోకులు ఆమెను కాస్త తిక్కమనిషిగా భావించేవారు. ఎప్పుడూ తెల్లటి దుస్తుల్లో ఉండడం, ఎవరినీ పలకరించకపోవడం, తన పడకగది దాటి బయటకు వచ్చి అతిధుల్తో మాట్లాడక పోవడం, స్నేహితులతో కూడా ఉత్తరాల సంభాషణే గాని, వ్యక్తిగత పలకరింపులు లేకపోవడం ఆమె జీవితంలో విశేషాలు.

దాదాపు 1800 కవితలు వ్రాసినా సుమారు డజను కవితలు మాత్రమే ప్రచురణకు నోచుకున్నాయి. శీర్షికలు లేకపోవడం, Slant Rhyme, మృత్యువు, అమరత్వం ప్రధానాంశాలు ఆ కవితలలో. ఆమె మరణానంతరం ఎమిలీ చిన్ని చెల్లెలు లవినియా 1886లో పడకగదిలో లభించిన కవితలను ఏర్చికూర్చి, Thomas Wentworth Higginson, Mabel Loomis Tood ల సహకారంతో 1890లో ప్రచురించినది. 20వ శతాబ్దం నాటికి ఆమె కీర్తి నలుచెరగులా వ్యాపించగా ఆమె అమెరికన్ కవులలో ప్రముఖ స్థానాన్ని పొందినది.

# 9. మృత్యువు

## (A Sequence of Poems)

### 1

ఓ ప్రత్యేకమైన ఏటవాలు కాంతి కిరణ సముచ్ఛయం
శీతాకాలపు మధ్యాహ్నం నాడు,
అది అణచివేస్తుందన్నిటినీ
కాథడ్రెల్ స్వరాల గుచ్ఛంలా.

దివ్యమైన బాధనిస్తుందది
గాయపు మచ్చ ఉండదు
అంతర్గతమైన తేడా
అర్థాలు ఉన్న చోట

ఎవరూ బోధించలేదు దానికి
అది నిరాశతో కూడిన ముద్ర
రాచరికపు వ్యాధి, పీడ
గాలిలోంచి మనసు చేరుకున్నది.

అది వచ్చినపుడు నేల వింటుంది.
నీడలు ఊపిరినాపుతాయి
అది వెళ్లేప్పుడు కనిపిస్తుంటుంది
మృత్యు వీక్షణంపైనున్న దూరంలా!

### 2

నేను మృత్యువు కొరకు ఆగలేదు, కనుక
అతడు నాకోసం ఆగినాడు దయతో;
రథం ఆగింది, మేమిద్దరమే
మరియు అమరత్వం.

మేం నెమ్మదిగా ప్రయాణించాము
నేను పక్కకు పెట్టాను
నా శ్రమను, నా విశ్రాంతిని కూడా.
అతడి నాగరిక ప్రవర్తన చూసి

పిల్లలు తిరుగాడే పాఠశాలను దాటినాము
విరామ సమయపు గంట మోగుతున్నదపుడు
ధాన్యంతో అలరారుతున్న పొలాల్ని దాటినాము
దాటినాము అస్తమిస్తున్న సూర్యుడిని.
కాదు, కాదు, అతడే మమ్మల్ని దాటి పోయినాడు.

పొగమంచు వణుకుతూ, శీతలంగా దాటినది
నా గౌను కేవలం గొస్సామర్–బూరుగ దూది
నా పాదరక్ష కేవలం పచ్చిక బయలు

మేము ఆగినాము ఓ ఇంటిముందు
అది కేవలం ఉన్నది ఒక దిబ్బలా అక్కడ
పైకప్పు కనిపించీ కనిపించనట్లు
మూలలు నేలకు తాకుతున్నట్లు

అప్పటి నుంచి గడిచాయి శతాబ్దాలు
అయినా రోజుకన్నా తక్కువే సమయం
నేను చూసాను అశ్వాల శిరస్సులు
అవి తిరిగి ఉన్నాయి అనంతం వేపు

## 3

నా మెదడులో అనుభవించానొక అంత్యక్రియల ఉత్సవాన్ని
దుఃఖితులు అటూ ఇటూ పోతుండడానిని,
నడుస్తూ, నడుస్తూనే వాళ్లున్నారు
ఏదో ఇంద్రియజ్ఞానం ఉబికి వస్తున్నట్లు.

వాళ్లందరూ కూర్చున్నాక
మృదంగ వాద్య సంరంభం
ధ్వనిస్తూనే, ధ్వనిస్తూనే ఉన్నది, నేననుకున్నాను
నా ఆలోచనలు మొద్దుబారాయని.

అప్పుడు నేను విన్నాను ఏదో పెట్టె ఎత్తిన చప్పుడు
నా ఆత్మ పగిలినట్లు అడ్డంగా
మరల ఆ సీసపు లోహ చప్పుళ్లు
అప్పుడు ఏదో ప్రదేశం ఆక్రమించుకుంటున్నట్లు

స్వర్గాలన్నీ ఒక గంటగా రూపుదాల్చినాక
అన్నీ ఒక చెవిలా మారినాక
నేనూ, నిశ్శబ్దం ఒక వింతైన పరుగుపందెంలో
ఒంటరిగా నేలకూలి ఉన్నట్లు,

ఏదో కారణం లాంటి పలక పగిలింది.
నేను పడిపోయాను, దిగువకు, ఇంకా దిగువకు,
ప్రతి కుదుపులోనూ వింత కొత్తలోకం
అప్పటికి పూర్తిచేసినాను తెలుసుకోవడం.

## 4

నేను చనిపోయినపుడు ఈగ ముసిరిన శబ్దాన్ని విన్నాను.
గదిలోని నిశ్చలత
గాలిలోని నిశ్చలత లానే ఉన్నది
తుఫాను నిట్టూర్పుల మధ్యలోనిదిలా

చుట్టూ ఉన్న కళ్లు మారినాయి పొడిగా
ఊపిరులవుతున్నాయి స్థిరంగా
ఆ ఆఖరి క్షణంలో ప్రభువు ఉంటాడు
ఆ గదిలో సాక్షిగా

నా జ్ఞాపకాలను, ప్రియవస్తువులను
ఇచ్చేసాను, నాలో ఏవైతే ఇవ్వగలిగినవో
అవన్నీ ఇస్తుంటే, మధ్యలో వచ్చింది
ఈ ఈగ అడ్డంగా

ఖచ్చితం కాని నీలి అడ్డంకి ధ్వని
కాంతికి నాకు మధ్య
అప్పుడు గవాక్షాలు పని చేయలేదు
నేను చూడడాన్ని చూడలేకపోయాను.

## 5

అలబాస్టర్ గదుల్లో సురక్షితంగా
ఉదయం చేత స్పృశించబడక
మధ్యాహ్నం చేత స్పర్శించబడక
పునరుజ్జీవన బలహీన సభ్యులు నిద్రిస్తున్నారు
శాటిన్ బల్ల
శిలా నిర్మిత పైకప్పు.

కాంతి మరీచిక నవ్వుతుంది,
వాటి పైనున్న తన కోటలో;
జడత్వపు చెవిలో తుమ్మెద లొడలొడలాడ్తుంది.
అమాయకపు వరుసల్లో పక్షులు గానం చేస్తాయి
ఆహ్, ఎటువంటి వివేకమిక్కడ నశిస్తున్నదీ విధంగా!

## 6

ఎటువంటి సత్రమిది
రాత్రిపూట ఎక్కడి నుంచో
వింతైన బాటసారి వస్తున్నాడేమి?
ఎవరు దీని యజమాని?
ఎక్కడున్నారు పనికత్తెలు?

చూడు, ఎలా ఉన్నాయో ఆ గదులు వింతగా!
నెగడులో లేవేమీ ఎర్రటి మంటలు?
కప్పుల నిండా పొర్లేవే ద్రవాలు?
శవభక్షకుడా! యజమానీ!
ఈ క్రింద ఉన్న వారెవరు?

## 7

మృత్యువు కాదు, నేను నిలబడిందిక్కడ
చనిపోయిన వాళ్లంతా క్రింద పడి ఉంటారు.
ఇది రాత్రి కాదు, గంటలన్నీ
మధ్యాహ్నం బయటకు ఉంచాయి తమ నాలుకల్ని!

మంచు కాదు, నా శరీరంపై
ఏదో సిర్రొక్కస్ పురుగులు పాకినట్లు
అగ్ని కాదు, నా చలువరాతి పాదాలు
శవాగారాన్ని చల్లగా ఉంచేందుకు-

అయినా, అది అన్నిటి రుచినీ కలిగి ఉన్నది
నేను చూసిన ఆకారాలు
ఖననానికై ఉంచబడినాయి వరుసలలో
నా ఖననాన్ని గుర్తు చేస్తూ

నా జీవితమేదో కత్తిరించబడినట్లు
దానిని ఓ ఫ్రేముకు తగిలించినట్లు
తాళం చెవి లేకుండా ఊపిరాడదు
అది ఓ అర్ధరాత్రిలా

అప్పటిదాకా మోగినవన్నీ ఆగిపోగా
ఖాళీప్రదేశం చూస్తున్నది చుట్టూరా
భయంకరమైన మంచు, తొలి శరత్కాలపు ఉదయాలు
మోగే నేలను తొలిగిస్తాయి.

అయితే, ఎక్కువ గందరగోళం, ఆగకుండా
శీతలంగా- అవకాశమే లేదు, తప్పుకునేందుకూ
కనీసం నేల గురించి సమాచారమైనా లేదు
నిరాశను సమర్ధించుకునేందుకు.

## 8

నేను చనిపోయాను అందానికై;
సమాధిలో సర్దుకోలేకున్నాను
అక్కడ మృతులకు కనబడేలా ఉంటుంది
సత్యం, పక్కగదిలోనే,

నేను విఫలమైనపుడు అతడు మృదువుగా ప్రశ్నించినాడు.
"అందంకోసం" -అన్నాను నేను.
"అంతేకాదు, సత్యం కోసం; రెండూ ఒకటే,
మేం సోదరులం" -అన్నాడతడు.

అలా, బంధువులు కలుసుకున్నారా రాత్రి
గదుల మధ్య మాట్లాడుకున్నాం మేము
నాచు మా పెదాల్ని స్పృశించేంత వరకు
అది పెరిగి మా పేర్లను కప్పేంత వరకూ-

✧✧✧✧✧

---

ప్యూరిటన్-ప్రొటెస్టంట్ మతభావాల ఆఖరి దశాబ్దంలో ఉత్తర అమెరికా జనబాహుళ్యం పూర్తిగా మునిగి ఉన్న రోజులవి. ఆమె తాతగారు లాయరు. రాజకీయవేత్త, ధర్మనిష్ఠ గలవాడు. తండ్రిది ఇతరులను dominate చేసే వ్యక్తిత్వం. అటువంటి పెంపకంలో పెరిగిన ఎమిలీ డికెన్సన్ - వివాహం చేసుకోలేదు. తన ఇల్లూ, పడకగది బయటకు రావడానికే విముఖత చూపేది. Edward Wadsworth అనే వివాహితుడైన Clergyman ను ఇష్టపడింది కాని, ఆ ప్రేమ శారీరక ప్రేమ కాదు. 1862లో అతడు ఫిలడెల్ఫియా వదిలి వెళ్లిపోయినాక ఆమె వ్రాసిన కవితలలో ఎక్కువ భాగం Death and Immortality మీద వ్రాసిందని విమర్శకుల అభిప్రాయం.



# ఛార్లెస్ యల్. డాడ్గసన్

## Charles L. Dodgson (Lewis Carroll 1832-1898)

లూయిస్ కారల్ (27-1-1832.....14-1-1898) Charles Lulwidge Dodgson కలం పేరు. ఆంగ్ల రచయిత, గణిత శాస్త్రజ్ఞుడు, తర్క నిపుణుడు, ఫోటోగ్రాఫర్, ఆంగ్లికన్ డీకన్.

అతడు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రచన Alice's Adventures in Wonderland దాని పొడిగింపు Through the looking glass.

Jubberwocky, The Hunting of the Snark పేరొందిన కవితలు. వీటిని Literary nonsense poems కు ఉదాహరణలుగా చెబుతారు.

లూయిస్ కారల్ మాటలాటకు, తర్కానికి, అతిలోక భావసృష్టికి సిద్ధహస్తుడు.

అతడికి ఉన్న అంగవైకల్యం, ఒక చెవి వినబడకపోవడం, నత్తి (Stammering) ఇవి నూతన పదాల సృష్టికి తోడ్పడ్డాయేమోనని విమర్శకుల అభిప్రాయం.

The Hunting of the Snarkel (1874-1876) మధ్యకాలంలో వ్రాయబడినది. వీనిలో Jabberworthy కవిత, Through the looking glass లోని Portmanteau - Suitcase Words – రెండు పదాలు కలిసి ఒకే పదంగా రూపొందించబడడం (Furious = Fuming = Frumious) వాడినాడు.

పదిమంది సాహసికులు Snark అనబడే వింత జంతువు ప్రమాదకరమైన Boojum ను వేటాడడానికి వెళ్లడాన్ని – An agony in eight fits గా రచించినాడు.

(Slithy = Slime=lithe); Mimsy (flimsy=miserable); tigon (tiger=lion); Snark (Snake, Shark, Snail) ఇటువంటి పదాలు Portmanteau - సూట్‌కేసు తెరిచినపుడుండే రెండు భాగాల్లా ఉండి ఒకే అర్ధవంతమైన పదంగా రూపొందుతాయి. లూయిస్ కారల్ సృష్టించిన సంయుక్త పదాలు Snark, Boojum, Chortle, Frabjous, Galumph, Jabberwocky, Mimsy, Portmanteau, Stithy, Vorpal.

# 10. స్నార్క్‌ను వేటాడడం

## (The Hunting of the Snark)
## (An agony in Eight fits)

## Fit the First (మొదటి కింక)
## The Landing (నేలమీదకు దిగడం)

'ఇదే 'స్నార్క్'కు అనువైన ప్రదేశం' –అన్నాడు బెల్‌మాన్.
తన నౌకాసిబ్బందిని సురక్షితంగా దింపుతూ.
అలలపై ప్రతి ఒక్కరిని ఆదుకుంటూ నడుపుతూ
తన వేలితో తలవెంట్రుకల్ని మెలిదిప్పుతూ

"ఇదే 'స్నార్క్'కు అనువైన ప్రదేశం' –రెండుసార్లు అన్నానీ మాట!
సిబ్బందికి కావల్సినంత ధైర్యాన్నిచ్చేందుకు
ఇదే 'స్నార్క్'కు అనువైన ప్రదేశం! మూడుసార్లు అన్నానీ మాట!
నేనేది మూడుసార్లు చెప్పినా అది అవుతుంది నిజం!"

ఆ సిబ్బంది సంపూర్ణమైన సిబ్బంది; దాంట్లో ఉన్నాడొక బూట్స్
అతడు తయారు చేస్తాడు ఆడవాళ్ల బోనెట్లు, తలముసుగులు
ఒక బారిష్టరున్నాడు, వాళ్ల తగాదాలను చక్కగా అమర్చడానికి
ఇంకొకడు బ్రోకరు – వాళ్ల వస్తువుల వెల నిర్ణయించేందుకు.

ఇతడు బిలియర్డ్–మార్కర్– చాలా నైపుణ్యం గలవాడు
తనకు రావాల్సిన దానికన్నా ఎక్కువ పొందినాడు.
ఇంకొకడు బ్యాంకరు – అంతులేని ఖర్చుకు ఆధారమైనవాడు.
అందరి డబ్బుకూ అతడు ప్రస్తుతం సంరక్షకుడు.

ఓ ‘బీవర్’ కూడా ఉన్నది. ఓడపై అటుయిటు పరిగెత్తుతున్నది.
ముందు కూర్చుని లేసులు తయారుచేస్తున్నది.
తరచుగా వాళ్లను (బెల్‌మాన్ అన్నాడు) ప్రమాదాల నుంచి కాపాడుతున్నది.
అయితే నావికులకు అర్థం కాదు ఎలా చేస్తున్నదని!

అందులో ఒకడున్నాడు అనేక విషయాలలో పేరున్నవాడు
ఓడ ఎప్పుడెక్కాడో మరచిపోయాడతగాడు
అతడి గొడుగు, గడియారం, నగలు, ఉంగరాలు
అతడు తెచ్చుకున్న దుస్తులు ఆ ప్రయాణం కోసం

అతడి దగ్గరున్నాయి నలభై రెండు పెట్టెలు, జాగ్రత్తగా సర్దినవి
ప్రతి పెట్టె మీద అతడి పేరున్నది అత్యంత స్పష్టంగా
కాని ఒక విషయం అతడు మరచిపోయాడు
అవన్నీ బీచ్ ఒడ్డునే వదిలేసి వచ్చారని.

అతడి దుస్తుల గురించి పెద్ద బెంగ లేదు
ఎందుకంటే అతడి మీదున్నాయి ఏడు కోట్లు
మూడు జతల బూట్లు – అన్నిటికన్నా దారుణం
అతడు మరచిపోయాడతడి పేరు.

‘హి’ అన్నా గట్టిగా, అరచినా ప్రతిస్పందిస్తాడతడు
‘ఫై’మి అన్నా ‘ఫ్రిట్టర్ మై విగ్’ అన్నా
(‘వేయించండి’ అన్నా, ముక్కలు చేయండి నా విగ్గు అన్నా)
అతడి నేమంటావన్నా, అతడి పేరేమిటీ అని ఎవరైనా అన్నా
ముఖ్యంగా ‘థింగమ్ ఎ జిగ్’ అంటే ఎవరైనా

ఇంకా ఎవరైనా గట్టిగా పిలవదలుచుకుంటే
వాళ్లు  ఇతడిని పిలిచేవారిట్లా
దగ్గర స్నేహితులనేవారు ‘కొవ్వొత్తి చివర’ అని
శత్రువులంటారు– ‘మాడిన జున్ను’ అని.

వింతైన రూపం, బుద్ధి జ్ఞానం స్వల్పం
(బెల్‌మాన్ మాటల్లో ఇది స్పష్టం)
కాని అతడి ధైర్యం మెచ్చుకోతగింది, అదేకదా
కావల్సింది– 'స్నార్క్'ను ఎదుర్కోడానికి.

అతడు దుమ్ములగొండి హైనాలతో హాస్యమాడేవాడు.
అవి చూసినట్లే చూసి తలాడించేవాడు
ఒకసారి ఎలుగుబంటితో వేటకెళ్లాడు, దాని చేతుల్లో చేయివేసి
'దానిని హుషారుగా ఉంచాలిగా' –అన్నాడడిగితే.

'బేకర్' గా వచ్చాడు – కాని ఏమీ తేలేదు, పైగా ఆలస్యం
అందుకే బెల్‌మాన్‌కు వచ్చింది సగం పిచ్చి కోపం
అతడు చేయగలిగిందల్లా 'బ్రైడ్ కేక్' – దాన్ని
చేయడానికి ఏ పదార్థాలూ అక్కర్లేదని.

సిబ్బందిలో ఆఖరివాడు వాడిదో ప్రత్యేకత
పైకి కనిపిస్తాడు పెద్ద దద్దమ్మలా!
వాడికున్న ఒకే ఒక ఆలోచన– అది 'స్నార్క్'
అందుకనే బెల్‌మాన్, అప్పజెప్పాడా పని వెంటనే.

'బుచ్చర్'గా వచ్చాడతడు అప్పుడన్నాడు గంభీరంగా
అప్పటికే ఓడ కదిలి వారం రోజులయ్యింది.
నేను చంపగలిగిందల్లా 'బీవర్ల'ను – ఆ మాట విని
భయపడ్డాడు 'బెల్‌మాన్' నోటమాట రాలేదు.

నెమ్మదిగా వివరించాడు వణుకుతున్న గొంతుతో
ఓడ మీదున్నదల్లా ఒకే ఒక 'బీవరు'
అదేమో పెంపుడు జంతువు, నేను పెంచుకున్నది
దానిని చంపితే నేనూరుకోలేను.

బీవర్ విన్నది వాళ్ల సంభాషణ
　　　　కన్నీళ్లతో చెప్పింది తన అభ్యంతరాన్ని
స్నార్క్ వేటలో గల పారవశ్యమంతా కూడా
　　　　ఆ శూన్యమైన ఆశ్చర్యాన్ని అందుకోలేదని.

అది గట్టిగా సలహాయిచ్చింది సిబ్బందికి
　　　　'బుచ్చర్'నే వేరే ఓడలో రమ్మని చెప్పమని
'బెల్‌మాన్' అన్నాడు తానొప్పుకోనని
　　　　ఎందుకంటే తన ప్రణాళికలు దెబ్బతింటాయని.

నౌక నడపడానికి కావాలి ఎంతో నైపుణ్యం
　　　　ఉన్నదల్లా ఒకటే ఓడ, ఒకే గంట
అందుచేత అతడి భయం అతడికున్నది
　　　　రెండో ఓడను ఎలా నడపడమన్నది!

మరి ఏం చేస్తుంది బీవరు, సంపాదించుకున్నది
　　　　సెకండ్ హాండ్ డాగర్ ప్రూఫ్ కోటు
బేకర్ ఇచ్చాడో ఉచిత సలహా, 'తీసుకో–
　　　　ఏదన్నా పేరుబడ్డ కంపెనీ ఇన్సూరెన్సు' –అని.

బ్యాంకరన్నాడు– 'అద్దెకిస్తాలే కావాలంటే'
　　　　(కొత్త నిబంధనల ప్రకారం) – లేదా అమ్ముతాను.
రెండు మంచి పాలసీలు – ఒకటి అగ్ని భయానికి
　　　　రెండోది, వడగళ్ల నుంచి కాపాడుకోడానికి.

అయినా, ఆ విచారకరమైన రోజు తర్వాత
　　　　బుచ్చర్ అటు వెళ్తున్నపుడల్లా
బీవర్ చూస్తుండేది వ్యతిరేక దిక్కులో
　　　　చెప్పరానంత బిడియంగా ఉన్నట్లుగా!

## Fit the Second (రెండవ కింక)
## (The Bellman's Speech)

బెల్‌మాన్‌ను అందరూ అతడితో సహా ఆకాశానికెత్తినారు.
అటువంటి వాహనం, అటువంటి మెళకువ, లావణ్యం
పవిత్రత కూడా! అతడు కనిపించాడు తెలివిగలవాడిలా కూడా
అతడి ముఖంలోకి చూసిన క్షణంలోనే.

సముద్రాన్ని గుర్తుకు తెచ్చే విశాలమైన పటం
కాసింత వృథా అయిన స్థలం లేకుండా
నౌకా సిబ్బంది ఆనందించారు ఆది చూసినప్పుడు
వాళ్లకర్థమయ్యేట్లుగా ఉన్నది గనుక ఆ పటం.

'ఏమిటి మెర్కెటార్ ఉత్తర ధృవాలు, భూమధ్య రేఖలు
సమశీతోష్ణ, విభాగాలు, అక్షాంశ రేఖాంశాలవల్ల లాభం?
బెల్‌మాన్ అలా అరవగానే సమాధానమిచ్చేవారు సిబ్బంది!
"అవన్నీ కేవలం సాంకేతిక చిహ్నాలు!'

మిగతా పటాలన్నీ ఆకారాలు, ద్వీపాలు, అగ్రభాగాలు!
మనకున్నాడు ధైర్యశాలి మహా నిపుణుడు కేప్టెన్
(వాళ్లనే వాళ్లు అభ్యంతరం తెలుపుతున్నట్లు) మంచిది కొనుక్కొచ్చాడు.
అన్ని రకాలుగా సంపూర్ణమైన ఖాళీ పటం...

చాలా చక్కగా ఉంది, సందేహం లేదు; అయితే వాళ్లు కనుగొన్నారు
వాళ్లు అంత గాఢంగా నమ్మిన వాళ్ల కేప్టెన్
సముద్రాన్ని దాటడానికి అతడి దగ్గర ఉన్న ఒకే విధానం
తన గంటను గణగణా మోగించడం.

ఆలోచనాపరుడు, గంభీరుడు, కాని అతడిచ్చే ఆజ్ఞలు
కలవరపరుస్తాయతడి సిబ్బందిని
అతడరుస్తాడు - స్టార్‌బోర్డ్ వేపు నడవండి, కాని తలను
లార్‌బోర్డ్ వేపుంచండి, మరి ఏం చేయగలడు కర్ణధారి?

అప్పుడు తెడ్లు చుక్కాని కలబడినట్లున్నప్పుడు
బెల్‌మాన్ అన్నాడు నింపాదిగా
అలా జరగడం మామూలే వెచ్చటి దేశాల్లో
పడవ ఇరుక్కున్నది - అదే 'స్నార్క్'

అసలు విఫలత అయ్యింది ప్రయాణంలో
బెల్‌మాన్ ఖంగారుపడ్డాడు, దిగులు చెందినాడు.
అతడన్నాడు- నేననుకున్నా గాలి తూర్పుకు వీస్తే
పడవ పడమరకు పోదు గదా అని!

అయితే ప్రమాదం గడిచింది; నేలమీదకు దిగారు.
పెట్టెలు, సూట్‌కేసులు, సంచులు
వాళ్లకు నచ్చలేదు వాళ్లు దిగిన ప్రదేశం
అంతా లోయలు, గరుకు కొండలు.

బెల్‌మాన్ వాళ్లలో హుషారు తగ్గడం గమనించాడు.
మధుర సంగీత స్వరంతో మందలించాడు.
కష్టకాలంలో చెప్పుకునే హాస్యగుళికలు వినిపించాడు.
అయితే సిబ్బంది నవ్వలేక మూలిగినారు.

వాళ్లకు తాగడానికి బ్రాందీ ఇచ్చినాడు పుష్కలంగా
వాళ్లను బీచ్‌లో కూర్చోమని చెప్పినాడు మృదువుగా.
వాళ్లనుకున్నారప్పుడు కేప్టెన్, చాలా ఉదారుడని, గొప్పవాడని.
అప్పుడతడు లేచి ఉపన్యాసమిచ్చినాడు.

'ఫ్రెండ్స్, రోమన్స్, కంట్రీమెన్, లెండ్ మీ యువర్ ఈయర్స్
వాళ్లందరికీ బహు ఇష్టం ఇట్లాంటి సంబోధనలు
(మిత్రులారా, రోమన్ సైనికులారా, ప్రజలారా, నాకివ్వండి మీ చెవులు)
వాళ్లు అతడి శుభం కోసం తాగినారు, జయజయధ్వానాలు చేసినారు.
అతడు వాళ్లకు మరింత బ్రాందీ ఇచ్చినాడు.

మనం ప్రయాణించాం ఎన్నో నెలల పాటు, ఎన్నో వారాల పాటు.
(నెలకు నాలుగు వారాలు మీకందరికీ తెలుసు)
ఇంతవరకూ మనం (మాట్లాడుతున్నది మీ కేప్టెన్)
'స్నార్క్'ను ఒక్కక్షణం కూడా చూడలేదు.

మనం ప్రయాణించాం ఎన్నో వారాలు, ఎన్నో రోజులు
(వారానికి ఏడు రోజులు మీకు తెలుసు)
అయినా ఆ 'స్నార్క్', మనం ఇష్టంగా చూద్దామనుకుంటున్నది
ఇప్పటి వరకు మనం చూడనే లేదు!

రండి, వినండి, మిత్రులారా, నేను మరల చెబుతున్నాను.
అయిదు తప్పు చేయలేని చిహ్నాలు
మీకు తెలుస్తుంది, మీరెక్కడకు వెళ్లినా,
సరైన 'స్నార్క్స్' ఎలా ఉంటాయో!

వరుసగా చెబుతానా చిహ్నాలు, మొదటిది రుచి,
కొద్దిగా, బోలుగా ఉంటుంది కాని కరకరలాడుతుంది.
కోటులా నడుం వద్ద బిగువుగా ఉంటుంది.
విల్లో-ఓ-విస్ప్ మెరుపు వాసన వేస్తుంది.

మీకు తెలుసు ఆలస్యంగా లేస్తుందది
ఎంత ఆలస్యమంటే, నేను చెబుతాను
అయిదు గంటల తేనీటి సమయమప్పుడు
బ్రేక్‌ఫాస్ట్ చేసి మరుసటి రోజు భోజనం చేస్తుంది.

మూడో లక్షణం- నవ్వొచ్చే మాట చెబ్తే నవ్వుతుంది ఆలస్యంగా
నీవేదైనా అటువంటి ప్రయత్నం చేస్తే
బాగా దిగులు చెందినట్లు నిట్టూర్పు విడుస్తుంది.
శ్లేషగా మాట్లాడితే చావుముఖం పెడుతుంది.

నాల్గోది దానికిష్టం స్నానం చేసే యంత్రాలంటేను,
ఒక దానిని పట్టుకుని తిరుగుతుందెప్పుడూనూ,
అక్కడ దృశ్యానికి అది అదనపు ఆకర్షణలే
అటువంటి అభిప్రాయంపై అందరికీ సందేహమే!

అయిదవది, అత్యాశ; అది సరాసరి
ప్రతి గుంపును వర్ణించీ విభజించడం
ఈకలున్న వాటిగా, కరిచే వాటిగా
మీసాలుండి గోకే వాటిగా.

"మామూలు 'స్నార్క్'లు చేయవే అపాయం
అయినా మీకు చెప్పడం నా విద్యుక్త ధర్మం
కొన్ని 'బూజూమ్‌లు' – బెల్‌మాన్ ఆగినాడు
ఎందుకంటే అక్కడ కళ్లు తిరిగి పడినాడు బేకర్.

## Fit the Third (మూడవ కింక)
## The Baker's Tale (బేకర్ కథ)

వాళ్లు అతడిని మేల్కొల్పారు మెత్తని రొట్టెలతో, లేవనెత్తారు మంచు ముక్కలతో
వాళ్లతడిని మేల్కొల్పినారు ఆవాలు, ఆడేలు కూరతో
మేల్కొల్పినారతడిని జామ్, మరియు చక్కని సలహాలతో
వ్యంగ్య, శ్లేష పొడుపు కథల్తో

చాలాసేపటికతడు లేచి కూర్చున్నాడు, ఆనక మాట్లాడినాడు
తన విషాద గాధను వివరించబూనుకున్నాడు.
బెల్‌మాన్ అరిచాడు గట్టిగా– 'నిశ్శబ్దం, చిన్న మూలుగు కూడా వినరావద్దు!'
గణగణ మోగించాడు తన గంటను.

అంతా నిశ్శబ్దమే అప్పుడు, కేక లేదు మూలుగూ లేదు
ఎవడూ వేయలేదు ఊళ, ఏ ధ్వనీ రాలేదా వేళ!
వాళ్లు 'హో' అనగానే అతడు చెబ్తున్నాడతడి కథ ఓహో!
అతి పురాతనమైన కాలపు గొంతుతో!

నా తల్లిదండ్రులు నిజాయితీపరులు, పేదవాళ్లే అయినా
'ఆ సోది ఆపు, అసలు కథకురా!' –అన్నాడు బెల్‌మాన్ ఓపికలేక!
'చీకటి పడిందా రాదు 'స్నార్క్'
వృథా చేయవద్దు క్షణమైనా ఈ పూటకు!'–

'సరే! నలభై ఏళ్లు ముందుకుపోతున్నా!' –అన్నాడు బేకర్
కన్నీళ్లు కారుస్తూ– 'ఇంకెక్కువేం చెప్పను'–
నన్ను మీ ఓడలోకి ఎక్కించుకున్నారు కదా!
'స్నార్క్'ను వేటాడేందుకు'–

'నా ప్రియమైన అంకుల్ (అతడి పేరే నాకు పెట్టారు)–
అన్నాడు, అతడికి నేను వీడ్కోలు చెప్పిపుడు'–
'ఆపు, నీ అంకుల్ సోది' –అరిచాడు బెల్‌మాన్
అరుస్తూనే గణగణ గంట కొట్టినాడు కోపంగా!

'అంకుల్ అన్నాడు నాతో' –అన్నాడు నెమ్మదైన బేకర్
మీ 'స్నార్క్' గనుక నిజంగా స్నార్క్ అయితే,
దానిని తీసుకురా సరాసరి ఇంటికి, దానికి పెడ్దాం తిండి
అది పనికి వస్తుంది కాంతికి కొట్టడానికి గండి!

దానిని చిన్ని గిన్నెలో తేవచ్చు, జాగ్రత్తగా తీసుకురా!
దానిని వేటాడవచ్చు ఫోర్కులతోను, ఆశతోను,
దానిని భయపెట్టవచ్చు రైల్వే షేరుతోనూ
దానిని ఆనందింపజేయవచ్చు చిరునవ్వులతో, సబ్బుతో

('అదే సరైన పద్ధతి' –అన్నాడు బెల్‌మాన్
అలా స్వగతంగా అరిచాడు–
–'నాకు అలాగే చెప్పారు ఆరోజుల్లో
అలాగే 'స్నార్క్'లను పట్టుకోవాలన్నారు'–)

‘అయితే, మేనల్లుడా, జాగ్రత్తగా ఉండాలారోజు,
నీ ‘స్నార్క్’ గనుక అయ్యిందా బూజుమ్
నీవు మెత్తగా, అకస్మాత్తుగా అయిపోతావు మాయం
మళ్లీ కలుసుకునేదే లేదు అవకాశం’–

ఇది, ఇది, అణగదొక్కుతున్నది నా ఆత్మను.
నా అంకుల్ మాటలు గుర్తుకు వచ్చినప్పుడల్లానూ
నా గుండె తొణుకుతున్నది ఎలాగంటే
పెరుగు, అంచుల నిండా ఉన్న పాత్రలా!

‘ఇదే, ఇదే, మనకిందకు ముందు జరిగిందే’–
అన్నాడు ఆగ్రహంతో బెల్‌మాన్.
బేకర్ అన్నాడు– ‘నన్నింకోసారి చెప్పనిస్తే,
ఇదే, ఇదే, నేను భయపడ్తున్నది’–

ప్రతి రాత్రి చీకటిపడ్డాక నేను తలపడుతున్నా ‘స్నార్క్’తో
కలలా, కలవరంతో చేసే యుద్ధం
దానికి తిండి పెడ్తాను ఆ నీడలలో ‘గ్రీన్స్’తో
దానిని వాడ్తాను కాంతిని కొట్టడానికి.

ఒకవేళ నేను గనుక బూజుమ్‌ను కలిస్తే
ఏ క్షణంలోనైనా (అది నాకు తెలుసు)
మెత్తగా, అకస్మాత్తుగా అయిపోతాను మాయం.
భరించలేకున్నాను ఇదే అభిప్రాయం...

## Fit the Fourth (నాల్గవ కింక)
## The Hunting (వేట)

బెల్‌మాన్ కంగారు పడుతూ తన కనుబొమలను రిక్కించినాడు.
ఈ మాట నీవు ముందే చెప్పి ఉండాల్సింది
ఇప్పుడు చెప్పడం చాలా సంక్లిష్టంగా మార్చింది పరిస్థితిని.
ఆ ‘స్నార్క్’, ఏ మాటకామాట, తలుపు దగ్గరే ఉన్నపుడు.

మనందరం దుఃఖపడాల్సిందే, మీరు నమ్మినట్లు
మళ్లీ జన్మలో కలుసుకోలేమన్నది
యదార్థంగా, మిత్రుడా, ఈ ప్రయాణం మొదలైనపుడే,
అప్పుడే చెప్పి ఉండాల్సిందీ సంగతి!

–'ఇప్పుడు చెప్పడంతో సంక్లిష్టంగా మారింది పరిస్థితి
ఈ మాట నేను ముందే చెప్పాననుకుంటాను'–
అప్పుడు వాళ్లు 'హీ' అని పిలిచేవాడు జవాబిచ్చాడు – నిట్టూర్పు విడుస్తూ
'ఈ మాట మనం ఓడ ఎక్కేప్పుడే చెప్పాను'

కావాలంటే నామీద హత్యానేరం మోపండి
లేదా జ్ఞానం లేదనండి (మనందరికీ ఉండదొక్కోసారి)
అయితే నాకు నటించే మనస్తత్వమే లేదు
అటువంటి నేరమేదీ నేను చేయలేను!

ఆ మాట నేను హీబ్రూ భాషలో చెప్పాను, డచ్‌భాషలోనూ,
అదేమాట జర్మన్‌లో, గ్రీకులోనూ
అయితే నేను మరిచిపోయాను (నాకు బాధ వేస్తున్నది)
మనం మాట్లాడేది ఇంగ్లీషు భాషలోనని"

"ఇదొక జాలిగొలిపే కథ" –అన్నాడు బెల్‌మాన్.
అతడి ప్రతిమాటకు ముఖం పొడుగవుతుండగా,
అయితే నీవిప్పుడు నీ కథంతా చెప్పావు గనుక
దీనిమీద చర్చించడం అనవసరం.

–'ఇంకా మిగిలిన నా ఉపన్యాసం (అన్నాడతడు సిబ్బందితో)
నాకు ఖాళీ దొరికినప్పుడు చెబుతాను'
అయితే 'స్నార్క్' దగ్గర్లోనే ఉన్నది, మళ్లీ అంటున్నాను
దానిని వెదకడం మీ పవిత్ర విద్యుక్తధర్మం.

–“వెదకండి చిన్నిచిన్ని గిన్నెలతో, వెదకండి జాగ్రత్తగా
వెదకండి ఫోర్కులతో, ఆశతో
దానిని ప్రాణాలతో బెదిరించండి రైల్వేషేరుతో
దానిని ఆకర్షించండి చిరునవ్వులతో, కాకా పట్టండి సబ్బుతో!

ఎందుకంటే ‘స్నార్క్’ ఓ విచిత్ర జంతువు.
సాధారణ విధానాలతో పట్టుబడని జీవి అది.
మీకు తెలిసిందానితో, మీరింత వరకు చేయంది చేయండి
ఒక్క అవకాశం కూడా కోల్పోకండి!

‘ఇంగ్లండ్ ఎదురుచూస్తున్నది, నేను ముందుకు వెళ్తాను!’
ఇది గొప్ప హితవాక్యం, అతి పేలవమైనది.
మీక్కావల్సిన వస్తు సరంజామా తీసుకోండి
యుద్ధానికి తగిన విధంగా సన్నద్ధులు కండి!”–

బాంకర్ సంతకం చేసినాడు ఖాళీ చెక్కుపై
దానిని క్రాస్ చేసి, చిల్లర వెండి నాణేలనిచ్చినాడు
బేకర్ జాగ్రత్తగా తన మీసాల్ని, జుట్టు దువ్వినాడు
కోటు మీద పడిన దుమ్ము దులిపినాడు.

బూట్స్, బేకర్‌లు పారకు పదునెడ్తున్నారు.
ఒకరి తరువాత ఒకరు సానబెడ్తున్నారు.
బీవర్ మాత్రం లేసు చేస్తూనే ఉన్నది.
ఏమాత్రం తనకు సంబంధం లేనట్లు–

బారిస్టర్ దాని గర్వానికి ఏదో చెప్పబోయినాడు.
చెప్పాల్సింది చెప్పలేక వృథా చేసినాడు.
ఎన్నో ఉదాహరణలు, లేసులకు సంబంధించిన కేసులు
హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన వాటిని.

బోనెట్లు తయారు చేసేవాడు భీకరమైన ప్రణాళిక వేసినాడు
కొత్తరకం మెడ, 'బౌ'లు తయారు చేసినాడు.
బిలియర్డ్-మార్కర్ తన వణికే చేతుల్తో
తన ముక్కుపై సుద్దముక్క రాస్తున్నాడు.

బుచ్చర్-కటిక వాడెందుకో ఖంగారుపడుతూ
పసుపు గ్లవుస్, మెడపట్టీ తొడుక్కున్నాడు.
-'ఏదో విందుకు పోతున్నట్లున్నది నాకని' -గొణిగినాడు.
బెల్‌మాన్ ప్రకటించాడు- 'నింపినారా' అన్నాడు.

'పరిచయం చేయండి నన్ను, మంచివాడా' -అన్నాడతడు.
మళ్లీ మనం గుంపుగా దాన్ని కలిసినపుడు,
బెల్‌మాన్ పట్టుదలగా తల ఊపుతూ అన్నాడు
-'అదంతా ఆధారపడి ఉంటుందీ వాతావరణంపై'

బీవర్ మామూలుగా గంతులు వేస్తూ వెళ్తున్నది
బుచ్చర్ బిడియంగా ఉండడం చూసింది.
బేకర్ మూర్ఖుడిగా లావుగా కనబడుతున్నా
చేసాడు ప్రయత్నం కన్నుగొట్టడానికని,

'మగాడిలా ఉండు' -అరిచాడు బెల్‌మాన్ గట్టిగా
బుచ్చర్ ఏడ్వడం మొదలెట్టేసరికి
-'మనం జుబ్‌జుబ్ పక్షిని కలుసుకోవాలి
ఈ పనికి మనకు చాలా శక్తి కావాలి!'

## Fit the Fifth (అయిదవ కింక)
## The Beaver's Lesson (బీవర్ పాఠం)

వాళ్లు వెదికినారు చిన్నిచిన్ని గిన్నెలతో, వెదికినారు జాగ్రత్తతో
వెంటబడి వెదకినారు ఫోర్కులు, ఆశతో
దాని ప్రాణాలపై బెదిరించినారు రైల్వేషేర్‌తో
దానిని ఆకర్షింపబూనినారు చిరునవ్వులతో, సబ్బుతో (కాకాపట్టి)

అప్పుడు బుచ్చర్ గొప్ప ప్రణాళిక వేసినాడు
        తాను నిజంగా దండయాత్రకు పోయేట్లు
మనుషులు పోని చోటుకు వెళ్లాలనుకున్నాడు
        శూన్యమై, ఒంటరిగా ఉన్న లోయలోకి

అయితే అదే ప్రణాళిక బీవర్‌కూ తట్టింది.
        అదీ అదే చోటును తానెన్నుకున్నది
మోసపోయి కాదు, సూచనా, మాటా లేదు.
        అతని మొహంపై ఏదో విరక్తి కనిపించింది.

ప్రతి ఒక్కరూ అనుకున్నారు తాము 'స్నార్క్' గురించే
        ఆలోచిస్తున్నామని, రోజంతా ఉన్నామని ఆ పనిమీదే!
ప్రతి ఒక్కరూ అనుకున్నారు తామేమీ వ్యాఖ్యానించలేదని
        ఇంకొకరు ఆ దారిన వెళుతున్నారని!

అయితే పోయినకొద్దీ ఆ లోయ సన్నబడి సన్నబడింది
        సాయంకాలం చీకటిగా చల్లగా మారుతోంది
ఎప్పటి వరకంటే (అది కంగారు వల్లనే కాని మంచి సంకల్పం వలన కాదు)
        వాళ్లు భుజానికి భుజాలు రాసుకుంటూ నడవసాగినారు.

అప్పుడో కేక, పెద్దగా, కీచుమని, ఆకాశాన్ని చీల్చినట్లు
        వాళ్లకు తెలుసు అపాయం పొంచి ఉందని దగ్గరే
బీవర్ పాలిపోయింది తలనుంచి తోక చివరకు
        చివరకు బుచ్చర్ కూడా స్పందించినాడు వింతగా!

తాను చిన్నప్పుడెప్పుడో మరచిపోయిన బాల్యాన్ని
        గుర్తు తెచ్చుకున్నాడు అప్పటి ఆనందపు అమాయకపు స్థితిని
ఆ శబ్దం అతడికి చక్కగా గుర్తుకు తెచ్చింది
        పలకపై బలపం కీచుమని విరగడానిని!

'ఇదిగో, ఇదే జుబ్ జుబ్ గొంతు! లెక్కపెట్టండి!
(ఇతడినే వాళ్లు 'దద్దమ్మ' అని అన్నది)
'బెల్‌మాన్ మీకు చెబుతాడు' -అన్నాడతడు గర్వంగా
'ఈ మాట ఇంతకు ముందు అన్నానని'

ఇదిగో ఇదే జుబ్‌జుబ్ స్వరం! లెక్క పెట్టండి!
మీరు కనుగొంటారు, ఈ మాట నేను రెండుసార్లు అన్నానని!
ఇది జుబ్‌జుబ్ పాట! నిదర్శనం సంపూర్ణం
నేను మూడుసార్లు చెప్పిందవుతుంది నిజం"

బీవర్ లెక్కపెట్టింది అతి జాగ్రత్తతో
ప్రతి పదాన్ని అంతులేని సావధానంతో
తన గుండెను పోగొట్టుకున్నది, నిరాశలో మునిగింది
మూడోసారి ఆ మాట వినగానే,

అన్ని బాధలు ఉన్నప్పటికీ అలా అనుకున్నారు,
అది సరిగా లెక్కవేయడం మరచిందని,
ఇప్పుడు చేయగలిగిందా మెదడును తవ్వి వెదకడం
ఎంతో సంఖ్యో తెలుసుకునేందుకు యత్నించడం!

రెండుకు ఒకటి కలుపు- అలా అయితే సరే!
అది అన్నది- 'లెక్క వేయాలి వేళ్లూ బొటనవేలుతో,
కన్నీళ్లు కారుతుండగా అనుకున్నది, చిన్నప్పుడు
లెక్కలు చేస్తున్నపుడు ఇంత బాధ పడలేదు'.

'ఆ పని చేయవచ్చు' -అన్నాడు బుచ్చర్- నేననుకుంటా,
ఆ పని చేయాలి ఖచ్చితంగా, నేననుకున్నానలా,
ఆ పని చేయబడ్తుంది! కాగితం, ఇంకు తీసుకురా!
మనం సంపాదించుకోవాలి కాలాన్ని కాస్త!

బీవర్ తెచ్చింది కాగితం, వివరాలు, కలాలు
ఇంకు సరిపడినంత కన్నా ఎక్కువే చాలు
వింత వింత జంతువులు వస్తున్నాయి వాటి గూళ్ల నుంచి
వాళ్లని చూస్తున్నాయి ఆశ్చర్యంగా, విప్పారిన కనులతో.

బుచ్చర్ ఎంతగా పనిలో లీనమైనాడంటే పట్టించుకోలేదు వాటిని.
ఆ చేత్తో, ఈ చేత్తో కలం పట్టుకున్నాడు
పేరు పొందిన శైలిలో వివరించినాడు
బీవర్ దానిని అర్థం చేసుకున్నది సరిగానే!

'మూడు' ఇప్పుడు వివరించాల్సిన కారణం కాగా
అనువైన సంఖ్య అది వివరించడానికి
ఏడు కలిపి, పది కలిపి, హెచ్చవేయి,
దానిని వెయ్యిలోంచి ఎనిమిది తగ్గించి.

ఆ వచ్చిన దానిని భాగించు, చూస్తున్నారుగా
తొమ్మిది వందల తొంభై రెండుతో
దాంట్లోంచి పదిహేడు తీసివేయి, మిగిలిందెంత
ఖచ్చితంగా, సరిగా అదే ఆ సంఖ్య.

నేను ఉపయోగించిన పద్ధతి చెబ్తాను సంతోషంగా
అది నా బుర్రలో చాలా స్పష్టంగా ఉన్నది
నాకు సమయముండీ, నీకు బుర్ర గానీ ఉంటే
దాని గురించి ఇంకా చాలా చెప్పాల్సి ఉంది.

ఒక్కక్షణంలో నేను గ్రహించగలిగాను
ఇన్నాళ్లూ ఓ మార్మిక విషయంగా దాచబడిన దానిని.
అదనపు రుసుము వసూలు చేయకుండా
మీకు చెబ్తాను సాధారణ చరిత్రలో ఒక పాఠాన్ని.

అతడి తెలివైన పద్ధతిలో అతడలా చెప్పినాడు
(అన్ని మర్యాదపూర్వకమైన న్యాయాలను మరచినాడు)
ఎటువంటి పరిచయం లేకుండానే నిబంధనలు చెప్పినాడు
సమాజంలో ఓ గొప్ప కలకలాన్ని రేకెత్తించే దానిని)

జుబ్ జుబ్ లాంటి ధూర్తపక్షిని పదును పెట్టడానికి
ఎందుకంటే అది ఉంటుంది శాశ్వత ఉద్వేగంలో
దాని దుస్తుల రుచి పరమ నీచంగా ఉంటుంది,
అది ఫాషన్‌కు యుగాల ముందుంటుంది.

ఇంతకుముందు ఒక్కసారి కలిసిన స్నేహితుడిని గుర్తుపడ్తుంది
కన్నెత్తి చూడదు లంచం వేపు తానన్నది
దాన ధర్మాల సమావేశంలో ద్వారం వద్ద నిలబడ్తుంది
పోగు చేస్తుంది, కాని, తాను చే(వ్రాలు చేయనిది.

వండినపుడు దాని రుచి మరింత ప్రత్యేకం
మాంసం కన్నా, నత్తల కన్నా, గుడ్లకన్నా
(కొందరంటారు అది దంతపు జాడీలో ఉంటుందని
మరికొందరంటారు అది 'మహాగని' పీపాలలోనని.

దానిని రంపపు పొట్టులో ఉడకబెట్టు, బంకలో ఉప్పు బెట్టు
మిడతలతో, బద్దెపురుగులతో గడ్డకట్టించు
కాని ఓ ముఖ్యవిషయం గుర్తుంచుకో
దాని చక్కని రూపాన్ని చెడగొట్టాను నేను!'-

బుచ్చర్ అలా మరుసటి రోజు వరకూ మాట్లాడే వాడే,
కాని అనుకున్నాడు పాఠం ముగించాలని,
అతడు ఆనందంగా ఏడ్చినాడు ఏదో చెప్పాలని
అతడు బీవర్‌నప్పుడు స్నేహితుడిగా భావించినాడు.

బీవర్ చెప్పింది, ఆప్యాయతా దృక్కులతో
కన్నీళ్లకన్నా ధారాపాతంగా వర్షించిన వాటితో
అది నేర్చుకుంది పది నిముషాల్లో, మొత్తం పుస్తకాలన్నీ
డెబ్భై ఏళ్లు చదివితే వచ్చే జ్ఞానాన్ని, పాఠాల్ని.

వాళ్లు వెనక్కివచ్చారు, చేతిలో చేయి వేసుకుని
బెల్‌మాన్ ఓ క్షణం చలించాడు ఉద్వేగంతో
అన్నాడు– 'ఇది మన అలిసిన క్షణాలకు ఓదార్పు
మనం పెను అలలున్న సముద్రంలో పడ్డ కష్టానికి తీర్పు'

బీవర్, బుచ్చర్ ఎటువంటి స్నేహితులైనారంటే
ఎవరికీ తెలియనంత, ఊహించలేనంత
శీతాకాలం, వేసవి కాలం వాళ్ల స్నేహం ఒకే తీర్పు.
నీవు వాళ్లను ఒంటరిగా ఉండగా కలుసుకోలేవు.

పోట్లాటలు వచ్చినపుడు, తరచుగా కనబడ్తాయి
పోట్లాటలలో, రకరకాల, స్పర్ధలు, ప్రయత్నాలలో
వారికి వినబడేది 'జుబ్‌జుబ్' పాట వాళ్ల మనసులలో
వారి స్నేహాన్ని చేసేది మరింత గట్టిగా.

## Fit the Sixth (ఆరవ కింక)
## The Barrister's Dream (బారిష్టర్ స్వప్నం)

వాళ్లు వెదికినారు చిన్నిచిన్ని గిన్నెలతో, వెదికినారు జాగ్రత్తగా
వెంటబడి వెదికినాడు ఫోర్కులు, ఆశతో
దాని ప్రాణాలపై బెదిరించినారు రైల్వే షేర్‌తో
దానినాకర్షింపబూనినారు చిరునవ్వుల్తో, సబ్బుతో (కాకాపట్టి)

బారిష్టర్, అప్పటికే ఋజువు చేయలేక అలిసి ఉన్నాడు
బీవర్ చేస్తున్న లేసు తయారి తప్పని
అలిసి నిద్రపోగానే, కలలో చూసినాడు స్పష్టంగా జంతువును
అతడి ఊహ దానిపైన ఉన్నది చాలాకాలం.

అతడు కలగన్నాడు తానొక న్యాయస్థానం నీడలో ఉన్నట్లు
అక్కడున్నది 'స్నార్క్' కంటిలోన అద్దంతో
పెద్దగౌను, పట్టీలు, విగ్గు, వాదిస్తున్నది ఓ వరాహపు కేసును
ఎందుకది తన పందుల కొట్టం విడిచి వెళ్లిందో అని.

సాక్షులు ఋజువు చేసారు, కించిత్తు దోషం లేకుండా
వెళ్లి చూసేప్పటికి ఖాళీగా ఉంది కొట్టమని
న్యాయాధిపతి వివరిస్తూనే ఉన్నాడు న్యాయపు పరిధిని
మంద్రంగా ప్రవహించే ధ్వనితోనే!

నేరమేమిటో సరిగా వ్యక్తం చేయబడలేదని
'స్నార్క్' మొదలెట్టి మూడు గంటలపాటు
ఇవ్వగా ఉపన్యాసం, ఎవరి ఊహకూ అందలేదు
పంది ఏం చేసి ఉండాలనే సారాంశం.

జ్యూరీ సభ్యులది ఒక్కొక్కరిదీ ఒక్కొక్క అభిప్రాయం
(నేరం గూర్చి చదివేప్పటికే వాళ్లకున్నదో నిర్ణయం)
అందరూ మాట్లాడినారొక్కసారే, కాబట్టి ఎవరికీ ఏమీ తెలీదు-
ఎదుటి వాళ్లు ఏం మాట్లాడినారో!

'నీకో విషయం తెలవాలి' -అన్నాడు జడ్జి - వెంటనే
'స్నార్క్' అన్నది 'ఫడ్జ్' - ఆ న్యాయం పనికిరాదిప్పుడు'-
నేను చెప్తున్నా వినండి మిత్రులారా! ఈ ప్రశ్న
ప్రాచీన కాలపు ఇంటి హక్కులకు సంబంధించింది'.

"రాజద్రోహం నేరం పందిపై ఆరోపించబడింది'
సాయం చేసినట్లు, అరుదుగా సమర్థించినట్లు
బాకీ తీర్చలేదనే విషయం స్పష్టమైనది కదా
ఆ వాదనను అంగీకరిస్తే ఇంకేం ఋణపడి ఉంటుంది?

స్థలం వదిలి వెళ్లిందనే విషయాన్ని ఖండించడం లేదు నేను
ఆ అపరాధ భావన, నేను నమ్ముతాను, తొలగించబడింది.
(ఈ వాజ్యానికైన ఖర్చుల్ని లెక్కగడితే?
సాక్ష్యాధారాలు ఋజువు చేస్తాయి వాటిని,

–"నా పేద క్లయింటు జీవితం ఆధారపడింది మీ ఓట్లపై"
అని అతగాడు కూర్చున్నాడు తన స్థానంలో!
న్యాయాధిపతి చూసుకుంటున్నాడు తన నోట్సును
సంక్షిప్తంగా కేసు గురించి చెప్పడానికని!

న్యాయాధిపతి అన్నాడు, 'నేనెప్పుడూ కేసును చేయలేదు సంక్షిప్తం'!
అందుకని 'స్నార్క్' తీసుకుంది ఆ వ్యవహారం
ఎంత భాగా సంక్షిప్తం చేసిందంటే
సాక్షులు చెప్పిన దానికన్నా చక్కగా చెప్పింది.

తీర్పు చెప్పమనే సరికి, సభ్యులు నిరాకరించారు.
ఎందుకంటే వాళ్లకు 'మాట' ఉచ్ఛరించడం రాలేదు.
వాళ్లు దానికి 'స్నార్క్'పై ఆధారపడినారు
తమ విధిని కూడా దానినే నిర్వర్తించమన్నారు.

అందుకని 'స్నార్క్' పాలనబడింది 'తీర్పు' కూడా
రోజంతా పడ్డ శ్రమకు ఫలితంలా
అది అన్నది స్పష్టంగా 'గిల్టీ–నేరం ఋజువైంది' – జ్యూరీ
మూలిగింది బాధగా, కొందరు మూర్ఛపోయినారు ముందుగా.

'జీవిత ఖైదు' – అన్నదది నిశ్చయంగా
పైన నలభై పౌండ్లు జరిమానా
జ్యూరీ హర్షధ్వానాలు చేసినారు. న్యాయాధిపతి
భయపడినాడు వాక్యం న్యాయబద్ధంగా లేదేమోనని.

అయితే వాళ్ల సంతోషంతా అకస్మాత్తుగా ఆగింది
జైలర్ అన్నాడు కన్నీళ్లతో
అటువంటి శిక్ష వలన ఏ ప్రయోజనమూ ఉండదని
పంది చనిపోయి అప్పటికీ చానా ఏళ్లయ్యిందని.

జడ్జి వెళ్లిపోయినాడు కోర్టు విడిచి; బాగా నిరాశ చెందినట్లు
'స్నార్క్' మాత్రం కాస్త ఆశ్చర్యపడినా
డిఫెన్స్ లాయర్‌గా తన పని సరిగా చేయనందుకు
ఆఖరి వరకు ఏదో అరుస్తూనే ఉంది.

అలా బారిష్టర్ కలగన్నాడు, ఆ అరుపు వినబడ్తోంది
ప్రతిక్షణం ఎక్కువైనట్లు, స్పష్టంగా ఉన్నట్లు
అతడు మేల్కొన్నాడు బిగ్గరగా వినిపించిన గంటమోతకు
బెల్‌మాన్ మోగించాడు అతడు చెవి పక్కకు.

## Fit the Seventh (ఏడవ కింక)
## The Banker's Fate (బ్యాంకర్స్ విధి వ్రాత)

వాళ్లు వెదికినారు చిన్నిచిన్ని గిన్నెల్తో, వెదికినారు జాగ్రత్తతో
వెంటబడి వెదికినారు ఫోర్కులు ఆశతో
దాని ప్రాణాలపై బెదిరించినారు రైల్వేషేరుతో
దానిని ఆకర్షింపబూనినారు చిరునవ్వుల్తో, సబ్బుతో (కాకాపట్టి)

బ్యాంకర్ కొత్తగా వచ్చిన ధైర్యంతో
అది సాధారణమైన వ్యాఖ్యానం కదా
ముందుకు దూసుకుబోయినాడు ఉన్మత్తుడిలా,
క్రమేపీ కనుమరుగైనాడు 'స్నార్క్'ను వెదుకుతూ,

అతడు చిన్ని చిన్ని గిన్నెలతో, జాగ్రత్తతో వెదుకుతున్నపుడు
ఓ బాండర్ స్నాచ్ వచ్చిందతడికి దగ్గరగా
గట్టిగా పట్టుకుంది బాంకర్‌ను, అతడరిచినాడు బిగ్గరగా
ఎందుకంటే అతడికి తెలుసు ఎగిరిపోవడం అసాధ్యమని

ఇవ్వజూపినాడు తగ్గింపు, ఇస్తానన్నాడు చెక్‌బుక్కు
(బేరర్ తీసుకోవచ్చు) ఏడు పౌండ్లు పది
కాని బాండర్ స్నాచ్ చూపింది మెడను
మళ్లీ పట్టుకున్నది బ్యాంకర్‌ను.

విరామం లేదు, ఆగలేదు – తన భీకరాగ్ని దవడల్తో
రాక్షసంగా కొరుకుతూ పోయింది
జారినాడు, గెంతినాడు, తప్పటడుగులు వేసి కూలబడినాడు
చివరకు మూర్ఛవచ్చి నేలపై స్పృహతప్పి పోయినాడు.

మిగతా వాళ్లు రావడం చూసి పారిపోయింది బాండర్ స్నాచ్,
భయంతో కూడిన కేకల్తో వాళ్లు వచ్చినారటుగా!
బెల్‌మాన్ అన్నాడు బెరుకు బెరుకుగా– నేను భయపడ్డట్లే జరిగింది!
అని పవిత్రంగా మోగించాడు తన గంటని.

అతడి నల్లబడిన ముఖం, ఉన్నది గుర్తుపట్టలేనంతగా
ఇదివరకటికీ ఇప్పటికే ఎంతో తేడాగా
అతడికి ఎంత భయమేసిందంటే అతడి నల్లకోటు తెల్లబడింది
ఆశ్చర్యం గొలుపుతుంది ఆ దృశ్యం చూస్తేను!

ఆ రోజు ఉన్న వాళ్లందరికీ భయం కలిగిస్తూ
అతడు లేచి నిలబడినాడు సాయంకాలపు దుస్తుల్లో
ఏదో జ్ఞానరహిత మూతి విరుపుల్తో, ఏదో చెప్పాలనుకున్నట్లు
అతడి నాలుక ఏదీ వ్యక్తీకరించలేని స్థితిలో

కూలబడినాడు కుర్చీలో, జుట్టులోకి వేళ్లు పోనిచ్చి
వింతైన ధ్వనుల్తో మూలిగినాడు వివిధంగా
అర్థంపర్థం లేని మాటల్తో అగుపడ్డాడు పిచ్చివాడిలా
చేతుల్తో రెండు ఎముకల్ని పట్టుకుని కదిలించాడిలా

వాడి మానాన వాడిని వదిలేయండి, ఇప్పటికే అయ్యింది ఆలస్యం
అన్నాడు బెల్‌మాన్ అంతులేని భయంతో-
-"ఇప్పటికే వృధా అయ్యింది సగం దినం, ఇంకా అయ్యిందా ఆలస్యం.
పట్టుకోలేం 'స్నార్క్'ను రాత్రి అయ్యేలోగా మనం!"

## Fit the Eight (ఆఖరి కింక)
## The Vanishing (అదృశ్యం)

వాళ్లు వెదికినారు చిన్నిచిన్ని గిన్నెల్తో, వెదికినారు జాగ్రత్తతో,
వెంటబడి వెదికినారు ఫోర్కులు, ఆశతో,
దాని ప్రాణాలపై బెదిరించినారు రైల్వేషేరుతో
దానిని ఆకర్షింపబూనినారు చిరునవ్వుల్తో, సబ్బుతో (కాకాపట్టి)

వేట విఫలమౌతుందేమోనని అనుకోడానికే భయపడినారు.
చిట్ట చివరకు బీవర్ ఉద్రేకపడింది కాస్త
తన తోక చివర్తో గెంతడం మొదలెట్టింది
ఎందుకంటే పగటి వెలుగు కాస్తా ముగియ వస్తోంది.

అదుగో థింగమ్ బాబ్ అరుస్తున్నది- అన్నాడు బెల్‌మాన్.
పిచ్చివాడిలా కేకలు బెడ్తున్నాడు, మొరుగుతున్నాడు.
అయ్యో! చేతులూపుతున్నాడు, తల విదిలిస్తున్నాడు
అతడికి ఖచ్చితంగా కనిపించి ఉంటుందీ 'స్నార్క్'!

వాళ్లు దీక్షగా ఆనందంగా చూసారటువేపు, బుచ్చర్
అన్నాడు- 'అతగాడెప్పుడూ అసాధ్యుడైన హాస్యగాడు
వాళ్లు చూసారు, వాళ్ల బేకర్‌ను- పేరు పెట్టని హీరోను.
పక్కనే ఉన్న కొండ చరియపై అతగాడిని.

నిట్టనిలువుగా, ఘనంగా, ఒక్క క్షణం పాటుగా,
కాని మరుక్షణంలో చూసారు వాళ్లు ఆ ఆకారాన్ని
(ఏదో తీవ్రమైన నెప్పితో) అగాధంలోకి ఉరకగా
వాళ్లు ఆశ్చర్యంతో విన్నారు, వేచి చూసినారు.

'అదుగో అదే స్నార్క్' తొలుదొల్త విన్నారందరూ ఆ మాట
అదే అనిపించింది మంచిగా, యదార్ధంగా
తరువాత ఉధృత ప్రవాహంలా నవ్వులూ, జేజేలు
ఆ తరువాత శాపగ్రస్త పదాలు – అది బూ....!

అంతా నిశ్శబ్దం, కొందరి ఊహ వాళ్లు విన్నారని
గాలిలో ఏదో అలసటగా సంచరించిన నిట్టూర్పును
అది ధ్వనించింది... జుమ్.... అని, కొందరంటారు
అది జూమ్మని వీచిన గాలి అని.

వాళ్లు చీకటి పడేంత వరకూ వెదికినారు, కనబడలేదు.
చివరకు ఒక గుండీ, ఈక లేక ఏ గుర్తైనా!
దానిని బట్టి వాళ్లున్న ప్రదేశమే ఇందాక
బేకర్, స్నార్క్‌ను కలిసిన చోటని చెప్పేందుకు.

మాట మధ్యలో అతడు చెప్పదలుచుకున్నది.
నవ్వుల మధ్య గిలిగింతల సంతోషం మధ్యన,
అతడు మెత్తగా, మృదువుగా, అకస్మాత్తుగా అదృశ్యమౌతూ
అన్నాడేమిటంటే 'స్నార్క్', 'బూజుమ్' ఒకటేనన్నది.

✧✧✧✧✧

---

'కారల్‌మార్క్స్' అన్నాడు – Everything importance in history occurs twice, the first time as tragedy, the second as farce; – ఆ విధంగానే సాహిత్య చరిత్రలో కూడా మొదట La Recherche de l absolu వచ్చింది ఆ తరువాత The Hunting of Snark. లూయిస్ కారల్ మొదట ఈ పద్యాన్ని The Atheneum, The most bewildering of modern poems గా, An agony in eight fits అనే ఉపశీర్షికతో ప్రచురించినాడు. ఫిట్స్ (కింకలు) ఎనిమిదీ క్రమేపీ చిన్నవవుతూ చివరకు స్నార్క్, బూజుమ్ ఒక్కటేనని చెబుతూ ముగుస్తాయి.

ఈ కవితలోని Portmenteau words (Suitcase- రెండు మూడు పదాలు కలిపి ఒకే పదంగా రూపుదిద్దుకోవడం Snark (Snail+Snake+Shark); ముఖ్య పాత్రల పేర్లు– Bellman, Boots, Bonnet maker, Barrister, Broker, Billiard Marker, Banker, Baker, Bucher, Beaver Snark - Boojum - అన్నీ 'B' అక్షరంతో ప్రారంభమవడం విశేషం. అలా ఇది Nonsense కవితగా ప్రసిద్ధికెక్కింది.

## Dr. LANKA SIVA RAMA PRASAD



M.B.B.S; M.S (General Surgery);
M.Ch (Cardio Thoracic & Vascular Surgery)
FIVS (Fellow in Vascular Surgery)
Post Graduate Diplomate in Human Rights
Post Graduate Diplomate in Television Production
Web Engineer- Web Designer
Fellow of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Cell Animation Artist (Heart Animation Acadamy - Hyderabad)
Computer Animation Specialist (Pentafour- Chennai)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

# డాక్టర్ లంకా శివరామప్రసాద్ రచనలు

**కవిత్వం (తెలుగు) (Poetry) :**

1. ఆల్కెమీ
2. వానమబ్బుల కాంతిఖడ్గం
3. టీకప్పులో తుఫాను
4. తంగేటి జున్ను
5. కర్కాటకం (క్యాన్సరు) (First Poetry Book about Cancer in Telugu)
6. ఒక సరస్సు–అనేక హంసలు (First Poetry Book about Psychiatry in Telugu)
7. మరణ శాసనం – దీర్ఘ కవిత.
8. శ్రీ లలితాసహస్రనామ స్తోత్రం

**కవిత్వం (ఇంగ్లీషు) (Poetry) :**

1. **Shades**
2. **The Twilight Zone**

**నవలలు (Novels) :**

1. **In Search of Truth (English)**
2. సత్యాన్వేషణలో (తెలుగు)
3. జీనోమ్ (తెలుగు) (First Biotechnology Novel in Telugu)

**కథలు, వ్యాసాలు (Stories, Essays) :**

1. కత్తి అంచుపై... (First Noir Stories in Telugu)
2. ఛుప్ కె ఛుప్ కె (రహస్యభాష) (స్త్రీల వ్యాధులు)
3. అక్షరార్చన

**ఇతరాలు (Others) :**

1. దీప నిర్వాణగంధం (About Death)
2. స్వప్నశాస్త్రం (Dreams-1)
3. కలలు-పీడకలలు (Dreams-2)
4. సంఖ్యాశాస్త్రం (Numerology)
5. **How to be Happy**
6. డా. జయదేవ్ కార్టూన్లు
7. **Bouquet of Telugu Songs and Poems**

**అనువాదాలు (English to Telugu) Translations :**

1. ఇలియాడ్ (Homer) - **Iliad**
2. ఒడెస్సీ (Homer) - **Odyssey**
3. ఎపిక్ సైకిల్ (Homer) - **Epic Cycle**
4. మూడు గ్రీకు ట్రాజెడీలు - **Three Greek Tragedies**
5. ఈనీడ్ (Virgil) - **Aenied**
6. తీర్థయాత్రికుని ప్రగతి (John Bunyan) - **Pilgrims Progress**
7. పారడైజ్ లాస్ట్ & రిగైన్డ్ (John Milton) - **Paradise Lost & Paradise Regained**
8. డివైన్ కామెడీ (Dante) - **Divine Comedy**
9. ఫాస్ట్ (Goethe) - **Faust**
10. నామదేవొ ధసాల్ కవిత్వం (NamDeo Dhasal) Poetry
11. ప్రపంచ ప్రసిద్ధ కథలు (World Famous Stories)
12. విలియం బ్లేక్ కవిత్వం (William Blake Poetry)
13. రసధుని (Russian Poetry)
14. జలపాతం (అష్టాదశ ఆంగ్ల కవుల కవిత్వం) (18 English Poets)
15. క్రీస్తు అద్భుతగీతాలు (The Wonderful Poems on Christ)
16. క్రీస్తు నడచిన దారి (The Path of Christ)
17. మస్నవి 1 - 6 (మౌలానా జలాలుద్దీన్ రూమి) - **Masnavi**
18. పక్షుల సభ (ఫరీదుద్దీన్ అత్తర్) - **Conference of Birds**
19. శిలప్పదికారం (తమిళ సాహిత్యం) - **Silappadikaram**
20. మణిమేఖల (తమిళ సాహిత్యం) - **Manimekhala**
21. తమిళ సరస్వతి అందెల రవళి (తమిళ సాహిత్యం) - **Sangam Poetry**
22. డబ్బు-మని-షి - **Money Poetry**
23. శాంతి యుద్ధం - **War-Peace Poetry**

24. ఎమిలి డికెన్సన్ కవిత్వం 1-5 (తెలుగులో)
25. సౌగంధిక (కవిత్వం)
26. తూర్పు-పడమర (కవిత్వం) (Master Poems in English)
27. ప్రేమ కురిసిన వేళలో... (కవిత్వం) (Master Poems in English)
28. వాళ్లు ముగ్గురు (కవిత్వం) (Master Poems in English)
29. అలనాటి కొత్తగాలి (కవిత్వం) (Master Poems in English)
30. మంచు తుఫాను (కవిత్వం) (Master Poems in English)

**అనువాదాలు** (తెలుగు మరియు ఇతర భాషల్నుంచి ఇంగ్లీషులోకి) **Translations :**

1. **Modern Bhagavad Geeta** (Poetry) (Vyasa)
2. **Soundarya Lahari** (Poetry) (Sankaracharya)
3. **Bhagavatam** (Poetry) (Potana)
4. **Samparayam** (Poetry) (Suprasanna)
5. **The Tree of Fire** (Poetry) (Anumandla Bhoomaiah)
6. **The Pool of Blood** (Novel) (Ampasayya Naveen)
7. **The Poems of Kuppam** (Poetry) (Seeta Ram)
8. **The Broken Grammar** (Poetry) (T.W. Sudhakar)
9. **We need a language** (Poetry) (T.W. Sudhakar)
10. **This is No Streaking** (Stories) (K.K. Menon)
11. **The Voice of Telangana** (Poetry) (Madiraju Ranga Rao)
12. **Satarupa** (Poetry) (A.K. Khanna)
13. **Fire & Ice** (Poetry) (Rama Chandramouli)
14. హిందీ నుంచి తెలుగులోకి - మధుశాల (హరివంశరాయ్ బచ్చన్)

**శతకాలు (Poetry) :**

1. కుయ్యోమొర్రో శతకం
2. భైరవ శతకం
3. కాయగూర శతకం
4. అయ్యబాబోయ్ శతకం

**త్వరలో (Poetry) :**

1. దైవమార్గం (మహమ్మదీయ మతం) (Poetry)
2. సెలయేరు (Master Poems - English to Telugu)
3. ఎండా-వానా (కవిత్వం) (Master Poems in English)

4. **పిల్లనగ్రోవి పిలుపు** (కవిత్వం) (Master Poems in English)
5. **నాలుగు దిక్కులు** (కవిత్వం) (Master Poems in English)
6. **అల్లంత దూరాన ఆ పాట వినవచ్చె** (కవిత్వం) (Master Poems in English)
7. **దివ్య వస్త్రాల కోసం** (కవిత్వం) (Master Poems in English)
8. **ఆమని** (కవిత్వం) (Master Poems in English)
9. **ఒక మధుశాల** (కవిత్వం) (Master Poems in English)
10. **కొత్త దీపాలు** (కవిత్వం) (Master Poems in English)
11. **మరుభూమి** (కవిత్వం) (Master Poems in English)
12. Odysseus Elytis '**The Axion Esti**' **Worthy it is - ఇది విలువైనది.**
13. Frederico Garfcia Lorca "**Love & Death**" **- ప్రేమ – మృత్యువు**
14. **పదివేల పంక్తులు (ప్రపంచశాంతి కోసం) ఎడ్విన్ కార్డివిల్లా (Part-I)**
15. Bees Need No Invitation When Flowers Bloom...
16. **పాబ్లో నెరుడా కవిత్వం–1**

ప్రపంచ సాహిత్యం-49



# అల్లంత దూరాన ఆ పాట వినవచ్చె...

ముగ్గురు కవయిత్రులు-
ఎమిలి బ్రాంటి, క్రిస్టినా రోజెట్టి, ఎమిలి డికిన్‌సన్
అయిదుగురు కవులు-
వాల్ట్ విట్‌మాన్, మాథ్యూ ఆర్నాల్డ్, ఎడ్గార్ అల్లన్‌పో,
డాంటీ గాబ్రియేల్ రోజెట్టి, ఛార్లెస్ యల్‌డాడ్‌సన్-లూయిస్ కారల్ ల
పదిహేవు కవితల స్వేచ్ఛానువాదమీ కవితా సంకలనం.

సృజనలోకం ప్రచురిస్తున్న Master Poems in English
అనువాద కవితలను విశేషంగా తెలుగు సాహితీ ప్రియులకు
ఈ పుస్తకం మరో కానుక.  ఈ ప్రయత్నం మరింత
ఆదరణ పొందుతుందని ఆశిస్తూ...

## డాక్టర్ లంకా శివరామప్రసాద్